సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 16

సంచిక: 145

మంగళవారం 15-8-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్



కారాగారంలో గడిపే సమయం శిక్ష సమయం కాదు, శిక్షణ సమయం. కారాగారం మానసిక పరివర్తన దిశగా శిక్షణ ఇచ్చే ప్రదేశం. శిక్ష పూర్తయి విడుదలైన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడానికి అవసరమైన నైపుణ్య శిక్షణ కూడా ఇచ్చే ప్రదేశంగా ఉండాలి. అలాగే ఉంటాయి కూడా. అయితే ఈ ఏడాది దేశం మరో అడుగు ముందుకేసింది. శిక్ష అనుభవిస్తున్న మహిళలకు ఉపాధి అవకాశాలను జైలు గోడల మధ్య కాకుండా సమాజంలో కల్పించడం ఈ స్వాతంత్య్ర దినోత్సవం ప్రత్యేకత.

-వివరాలు 15లో


A quality product from
PAN BAHAR
ప్రతీ
బాహుబలి
గుండె చప్పుడు
అంటోంది
ఇండియా అని
Bahubali
PAN MASALA
NO TOBACCO NICOTINE
www.panbahar.in
CHEWING OF PAN MASALA IS INJURIOUS TO HEALTH. NOT FOR MINORS



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 145

మంగళవారం 15-8-2023

పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు
సాక్షి
స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సామరస్య స్ఫూర్తిని పాటిద్దాం

విభిన్నమైన గుర్తింపులు ఉన్నప్పటికీ భారతీయులంతా సమాన అవకాశాలు, సమాన హక్కులు, సమాన విధులు ఉన్న సమాన పౌరులేనని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉద్ఘాటించారు. దేశ ప్రజలంతా ఒక్కటేనని స్పష్టం చేశారు. - వివరాలు 6లో



రెండు రాష్ట్రాల్లో భీకర వర్షం

హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌ను భీకర వర్షాలు ముంచెత్తుతున్నాయి. హిమాచల్‌లో 48 మంది మరణించారు.
- వివరాలు 6లో



రూ.99,999 వరకు..
రుణమాఫీ క్లియర్!

స్వాతంత్య్ర దినోత్సవ వేళ రైతులకు సర్కారు శుభవార్త

- తక్షణమే బ్యాంకుల్లో సొమ్ము జమ చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశం
- 9,02,843 మంది రైతులకు ఒక్కరోజే రూ.5,809.78 కోట్లు విడుదల
- ఇప్పటివరకు 16,22,330 మంది రైతులకు రూ.7,753.43 కోట్లు మాఫీ
- రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని మరోసారి రుజువైంది: సీఎం కేసీఆర్
- రైతుబంధు, బీమా, ఉచిత విద్యుత్‌లతో అండగా నిలిచామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభ వార్త చెప్పింది. ఇచ్చిన హామీ మేరకు రూ.99,999 లోపు ఉన్న పంట రుణాలన్నింటినీ మాఫీ చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు సదరు రైతుల రుణాలున్న బ్యాంకుల్లో తక్షణమే సొమ్ము జమ చేయాలని సీఎం కేసీఆర్ సోమవారం ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును

మిగతా 2వ పేజీలో ▶

రుణమాఫీ జరిగిందిలా.. (రూ. కోట్లలో)

విడత	రైతుల సంఖ్య	విడుదల చేసిన సొమ్ము
తొలి విడత	5,42,609	1,207.38
రెండో విడత	1,76,878	736.27
తాజా విడత	9,02,843	5,809.78
మొత్తం	16,22,330	7,753.43



విజయ్ కుమార్ రమణ కుమార్

అడిషనల్ డీజీ విజయ్‌కుమార్‌కు ప్రెసిడెంట్ మెడల్

ఉత్తమ సేవలకుగాను సంగారెడ్డి ఎస్పీ రమణకుమార్‌కు కూడా...

- మరో 32 మందికి పోలీస్ శౌర్య, ఉత్తమ పోలీస్ సేవా పతకాలు
- స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించిన కేంద్ర హోంశాఖ - 5లో

ఎంపీ ఇంటిపైనే రాళ్ల దాడి జరిగితే..



సామాన్యుడి పరిస్థితేంటి?

- అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం
- హింసాకాండపై ప్రధాని నోరెందుకు మెదపరు?

- వివరాలు 7లో

కాంగ్రెస్ వస్తే కుంభకోణాల కుంభమేళానే..

ఎల్లారెడ్డి సభలో మంత్రి కేటీఆర్ ఫైర్



- ధరల పెరుగుదల పాపం కేంద్రంలోని బీజేపీదే
- కేసీఆర్ నాయకత్వంలో అన్నిరంగాల్లో రాష్ట్రం అభివృద్ధి

- వివరాలు 2లో

మిగులు రాష్ట్రాన్ని అప్పల కుప్పగా మార్చారు



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం

- వివరాలు 7లో

గెలుపు గుర్రాలపై ఫోకస్!



వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ప్రారంభించిన కాంగ్రెస్

- వివరాలు 7లో

తెలంగాణలోని ములుగు జిల్లా మంగపేట మండలంలోని 23 గ్రామాలు రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ పరిధిలోకి వస్తాయని తెలంగాణ హైకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చింది. దీనికిముందు దాదాపు 7 దశాబ్దాలుగా ఈ వివాదం కొనసాగింది. ఎట్టకేలకు ఆదివాసీలకు అనుకూలంగా తీర్పు వెలువడింది.

పంట నాశనం చేశాడన్న ఆరోపణలతో 1996లో నాగోసింగ్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోదైంది. దీంతో కొంతకాలం పాటు విచారణ ఖైదీలుగా జైలు జీవితం గడిపారు. బెయిల్ రావడంతో బయటకు వచ్చినా మొత్తం మీద 26 ఏళ్ల పాటు విచారణ కొనసాగింది. చివరకు 2022లో కోర్టు వారిని నిర్దోషులుగా ప్రకటించింది. ఆ సంతోషంలో నాగోసింగ్ ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. బిహార్ బంకా జిల్లాలో ఇది జరిగింది.

ఒకటికాదు..రెండు కాదు.. లక్షల కేసులు ఏళ్ల తరబడి కోర్టుల్లో మగ్గుతున్నాయి. దాఖలవుతున్న పిటిషన్లకు అనుగుణంగా కేసులు పరిష్కారం కావడం లేదు. 30 ఏళ్లకు పైగా 'సాగుతున్న'కేసులు ఎన్నో ఉన్నాయి. 'ఏళ్లకు ఏళ్లు విచారణ సాగిన తర్వాత బాధితుడికి అనుకూలంగా తీర్పు వచ్చినా అది న్యాయం అందినట్లు కాదు', 'సత్వర న్యాయం అందనంత కాలం బాధితులకు న్యాయం జరగనట్టే'.. ప్రభుత్వాధినేతలు, న్యాయనిపుణులు పదే పదే చెప్తున్న మాటలివి. అయినప్పటికీ కేసుల పరిష్కారంలో సంవత్సరాల జాప్యం జరుగుతోంది. పెండింగ్ కేసులు కోర్టులకు గుదిబండలా మారుతున్నాయి. దేశవ్యాప్తంగా పెండింగ్ కేసుల సంఖ్య (కిందికోర్టు, హైకోర్టులు కలిపి) ఈ జూలై 1 నాటికి 5 కోట్లు దాటిందని కేంద్ర న్యాయ మంత్రి గతవారం రాజ్యసభలో ప్రకటించడం గమనార్హం. – సాక్షి, హైదరాబాద్



సా..గుతున్న కేసులు..
సవాలక్ష కారణాలు!

కోర్టులపై పెరుగుతున్న 'పెండింగ్' భారం

- ఏటా 6 శాతం చొప్పున పెరుగుదల
- పిటిషన్ల నమోదు, తీర్పుల సంఖ్యలో భారీ వ్యత్యాసం
- సుప్రీంకోర్టులో 70 వేల కేసులు.. ఏటా వెయ్యి మాత్రమే తీర్పులు!
- జూలై 1 నాటికి దేశవ్యాప్తంగా 5 కోట్లు దాటిన అపరిష్కృత కేసులు
- జడ్జిలు, సిబ్బంది, మౌలిక సదుపాయాల లేమితో ఇబ్బందులు

జూలై 1 నాటికి పెండింగ్ కేసులు

సుప్రీంకోర్టులో	అన్ని రాష్ట్రాల హైకోర్టుల్లో	జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో
69,766	60,62,000	4,41,000,00

సివిల్ కేసుల పెండింగ్ ఇలా..

సంవత్సరాలు	దేశవ్యాప్తంగా..	రాష్ట్రవ్యాప్తంగా..
0-1	41,32,591 (37.34%)	1,52,952 (44.24%)
1-3	24,27,804 (21.93%)	87,050 (25.20%)
3-5	19,16,860 (17.32%)	59,253 (17.15%)
5-10	6,48,702 (5.86%)	38,589 (11.17%)
20-30	1,08,222 (0.98%)	6,964 (2.02%)
30 ఏళ్లకుపైగా..	31,424 (0.28%)	654 (0.19%)

క్రిమినల్ కేసుల పెండింగ్ ఇలా..

సంవత్సరాలు	దేశవ్యాప్తంగా..	రాష్ట్ర వ్యాప్తంగా..
0-1	1,17,62,024 (35.22%)	2,51,950 (44.40%)
1-3	71,65,477 (21.45%)	1,61,599 (28.48%)
3-5	56,76,320 (17.00%)	95,932 (16.91%)
5-10	56,17,593 (16.82%)	54,566 (9.62%)
20-30	4,11,223 (1.23%)	3049 (0.54%)
30 ఏళ్లకుపైగా..	70,134 (0.21%)	265 (0.05%)

(నోట్: గణాంకాలు 2023, జూలై 29 వరకు)

కోర్టుల్లో పెండింగ్ కేసులు మూడేళ్లలో 18 శాతం, అంటే ఏటా 6 శాతం చొప్పున పెరిగాయి. ప్రస్తుతం 34 మంది న్యాయమూర్తులున్న సుప్రీంకోర్టు 70 వేల పెండింగ్ కేసుల భారం మోస్తూ ఏడాదికి సుమారు వెయ్యి తీర్పులిస్తోంది. 2018 నవంబర్ నాటికి సుప్రీం

సుప్రీంలో ఏడాదికి 1,000 తీర్పులు


కోర్టులో ఉన్న కేసుల్లో 40 శాతం అయిదేళ్ల కంటే ఎక్కువ కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. 8 శాతం కేసులు పదేళ్లగా పెండింగ్‌లో ఉన్నాయి. 2004తో పోల్చినప్పుడు అయిదేళ్లగా పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య 7 శాతం పెరిగింది. ట్రయల్ కోర్టులో మొదలై సుప్రీంకోర్టులో తీర్పు రావడానికి ఒక్కో కేసుకు సగటున 13 సంవత్సరాల 6 నెలల కాలం పడుతోంది. ఇందులో మూడో వంతు కాలం ప్రొసీడింగ్స్ సుప్రీంకోర్టులోనే ఉంటోంది.

పెండింగ్‌కు ముఖ్య కారణాలివే..

- జడ్జిలు సహా కోర్టు సిబ్బంది లేమి
- న్యాయ వ్యవస్థకు అరకొర నిధుల కేటాయింపు
- కోర్టులు, ఇతర చోట్ల మౌలిక సదుపాయాల కొరత
- చట్టపరమైన ప్రక్రియ దుర్వినియోగం, చట్టంలో లోటుపాట్లు (వాయిదా వేస్తూ వెళ్లడం)
- న్యాయస్థానాల్లో అంతంత మాత్రంగా సాంకేతికత
- చట్టాలపై ప్రజలకు అవగాహన పెరగడం
- ఆర్‌టీఐ, ఆర్‌టీఈ లాంటి కొత్త చట్టాలు వస్తుండటం
- జనాభా మేరకు కోర్టుల సంఖ్య లేకపోవడం
- ప్రభుత్వం నుంచి కూడా లిటిగేషన్లు పెరగడం
- పలు చట్టాల్లో ఇంకా అస్పష్టత ఉండటం







(సుప్రీం కోర్టులో పెండింగ్ కేసులు సంఖ్య: 69,766 (2023, జూలై 1 వరకు)

న్యాయమూర్తుల సంఖ్య ఇలా..

సుప్రీంకోర్టు..
మొత్తం న్యాయమూర్తుల సంఖ్య: 34
ప్రస్తుతం ఉన్నది: 32

తెలంగాణ హైకోర్టు..
మొత్తం న్యాయమూర్తుల సంఖ్య: 42
ప్రస్తుతం ఉన్నది: 30

ఏపీ హైకోర్టు..
మొత్తం న్యాయమూర్తుల సంఖ్య: 37
ప్రస్తుతం ఉన్నది: 28

అవగాహన.. సాంకేతికత అభివృద్ధితో ప్రయోజనం

- ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా కోర్టులకు వచ్చే కేసులను కొంతవరకు తగ్గించవచ్చు.
- కోర్టుల్లో మౌలిక వసతులు కల్పించాలి. ముఖ్యంగా సాంకేతికతను అభివృద్ధి పరచడంతో పాటు పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకొస్తే కేసుల సత్వర పరిష్కారం సాధ్యమవుతుంది. అన్ని కోర్టుల్లో వర్చువల్ విచారణ చేపట్టాలి. సాక్షులు, అధికారులు, కక్షిదారులు కోర్టుకు రాకున్నా ఆన్‌లైన్ ద్వారా వారి వాంగ్మూలాలను స్వీకరించవచ్చు. తద్వారా వాయిదాలను కొంతవరకు తగ్గించొచ్చు.
- టెక్నాలజీతో ఒకే రకమైన కేసులను ఒక్క దగ్గరే విచారణ చేపట్టవచ్చు.
- మోటార్ వెహికిల్ కేసుల్లో చాలా కేసులు హైకోర్టులకే వస్తున్నాయి. వీటిని జిల్లా కోర్టుల్లోనే పరిష్కరిస్తే ఉన్నత న్యాయస్థానాలపై భారం కొంత తగ్గుతుంది. హైకోర్టులో ఈ కేసులను చాలా వరకు సింగిల్ జడ్జికే పరిమితం చేయాలి.
- చిన్న చిన్న కేసుల విచారణకు గడువు పెట్టుకోవాలి. ఆ గడువులోగా ఉత్తర్వులు ఇచ్చేయాలి.
- పలు కారణాల రీత్యా ఒక్కోసారి వాద ప్రతివాదులు, కొన్ని సమయాల్లో న్యాయవాదులు కోర్టుకు హాజరుకాలేపోతుండటంతో కేసులు వాయిదా పడుతున్నాయి.
- ఫ్యామిలీ కేసుల్లో ఎక్కడో ఉద్యోగం చేస్తున్న భర్త, భార్య ప్రతిసారీ కోర్టుకు హాజరు కావడం తీవ్ర ఇబ్బందికరంగా మారుతోంది.
- ప్రభుత్వ లిటిగేషన్లు కూడా తగ్గాలి. అధికారులు హాజరుకాలేని పక్షంలో వారు ఆన్‌లైన్ ద్వారా వివరణ ఇచ్చే వెలుసుబాటు ఉండాలి. దీంతో హాజరు కోసం వాయిదా వేయాల్సి అవసరం ఉండదు. ప్రభుత్వం కూడా ఓ లిటిగేషన్ పాలసీని తీసుకొస్తే మరింత ఉపయుక్తంగా ఉంటుంది.



-జస్టిస్ నవీన్‌రావు, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి

జడ్జిల రోస్టర్ వేర్వేరుగా ఉండాలి

ప్రజలు, పనిచేస్తున్న జడ్జిల నిష్పత్తిలో చాలా తేడా ఉంది. కేటాయించిన సంఖ్యలోనూ పెద్ద ఎత్తున ఖాళీలుంటున్నాయి. వీటిని ఎప్పటికప్పుడు భర్తీ చేయాలి. ఇక చిన్న చిన్న కేసులను వాయిదాలు వేయకుండా నిర్ణీత గడువుతో సత్వరం పరిష్కరించాలి. జడ్జిల రోస్టర్ కూడా క్రిమినల్, సివిల్, రిట్.. ఇలా వేర్వేరుగా ఉండాలి. ఎవరికి ఎందులో నైపుణ్యం ఉందో ఆ సబ్జెక్టును కేటాయిస్తే వేగంగా పూర్తి చేయగలుగుతారు.

– సీనియర్ న్యాయవాది, తెలంగాణ హైకోర్టు

నేనిక కోర్టుకు రాలేను!

మేడమ్.. మా బాబుకు ఐదేళ్లు ఉన్నప్పుడు విడాకుల కోసం కోర్టుకు వచ్చా. ఇప్పుడు డిగ్రీ చదువుతున్నాడు. ఇంకా నేను కోర్టు చుట్టూ తిరుగుతూనే ఉన్నా. ఉద్యోగం చేసుకుంటూ నా పిల్లలను పోషించుకుంటున్నా. వాయిదాల కోసం సెలవులు పెట్టడానికి నానాయాతన పడాల్సి వస్తోంది. మీరు విడాకులు ఇవ్వకపోయినా పర్వాలేదు. నేను ఇకపై కోర్టుకు రాలేను

-జడ్జితో రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ మహిళ



స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో మువ్వన్నెల రంగులతో వెలుగులీనుతున్న చార్మినార్

రూ.99,999 వరకు రుణమాఫీ క్లియర్

▶ మొదటి పేజీ తరువాయి

ఆదేశించారు. ఈ మేరకు ఆర్థిక శాఖ సోమవారం రూ.5,809.78 కోట్ల విడుదలకు ఉత్తర్వులు జారీ చేసింది.

ఆర్థిక ఇబ్బందులతో జాప్యమైనా..

2018 ఎన్నికల సమయంలో రైతులకు రూ.లక్ష వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి రాగానే విడతల వారీగా రుణమాఫీ చేయనున్నట్టు ప్రకటించారు. అయితే దీని అమల్లో జాప్యం జరిగింది. కరోనా మహమ్మారి విజృంభణ, లాక్‌డౌన్లతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడం, పెద్ద నోట్ల రద్దు ప్రభావంతో దేశవ్యాప్తంగా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి దిగజారి రుణమాఫీ ప్రక్రియ ఆలస్యమవుతోందని సీఎం కేసీఆర్ స్వయంగా ప్రకటించారు. ఇటీవల ఆర్థిక పరిస్థితి మెరుగుపడిన నేపథ్యంలో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ ప్రక్రియ మొదలుపెడుతున్నట్టు చెప్పారు.

45 రోజుల కార్యాచరణతో

ఆగస్టు 2న సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించి రుణమాఫీ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. వెంటనే ఆర్థిక మంత్రి హరీశ్‌రావు, ఆ శాఖ ఉన్నతాధికారులు కసరత్తు చేసి.. 45 రోజుల కార్యాచరణ రూపొందించారు. సెప్టెంబర్ 15వ తేదీ నాటికి మొత్తం రుణాలను మాఫీ చేయాలని నిర్ణయించారు. అయితే ఇంతకు ముందే తొలి విడతగా 5,42,609 మంది రైతులకు సంబంధించి రూ.1,207.38 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో రెండో విడతగా.. ఆగస్టు 3, 4, 11 తేదీల్లో కలిపి 1,76,878 మంది రైతులకు సంబంధించి రూ. 736.27 కోట్లను బ్యాంకుల్లో జమ చేసింది. తాజాగా 9,02,843 మంది రైతులకు సంబంధించి రూ.99,999 వరకు ఉన్న రుణాలను మాఫీ చేశారు. మొత్తంగా ఇప్పటివరకు 16,22,330 మంది రైతుల రుణాలకు సంబంధించి రూ.7,753.43 కోట్లను విడుదల చేశారు.

రైతు బంధు, బీమా, ఉచిత విద్యుత్‌తో..

దుఃఖంతో ఉన్న రైతు కుటుంబాలను ఆదుకోవాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు బీమాను అమలు చేస్తోందని, రైతు ఏ కారణంతో మరణించినా వారి కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సాయం అందుతోందని సీఎం కేసీఆర్ పేర్కొన్నా రు. ఇప్పటివరకు మరణించిన రైతులకు రూ.5,402.55 కోట్లు పరిహారంగా అందినట్టు వివరించారు. ఇక రాష్ట్రంలో 27.49 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు ఉచిత విద్యుత్ అందిస్తూ పంటల సాగుకు అండగా నిలిచామని.. గత తొమ్మిదేళ్లలో ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం రూ.96,288 కోట్లను భరించిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో 65 లక్షల మంది రైతులకు 'రైతు బంధు'తో ప్రత్యక్ష ప్రయోజనం కలుగుతోందని.. ఎకరానికి ఏటా రూ.10వేల చొప్పున.. ఇప్పటి వరకు 11 విడతల్లో రూ.71,552 కోట్లను రైతులకు అందించామని తెలిపారు.

రైతుల సంక్షేమంలో రాజీ లేదు




ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేసిన సీఎం కేసీఆర్‌కు రైతుల తరపున ధన్యవాదాలు చెప్తున్నా.. కేంద్రం ఎన్ని ఆర్థిక అవరోధాలు సృష్టించినా, కరోనా లాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా రైతు సంక్షేమం విషయంలో సీఎం కేసీఆర్ ఏనాడూ రాజీ పడలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఒకేరోజు 9,02,843 మంది రైతుల రుణాలకు సంబంధించి రూ.5,809.78 కోట్లు విడుదల చేసి రికార్డు సృష్టించింది. దరఖాస్తు చేసుకునే అవసరం లేకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేయడం దేశంలో ఒక్క తెలంగాణ ప్రభుత్వానికే సాధ్యమవుతోంది. కేసీఆర్ రైతుల కుటుంబాల్లో ఆనందం నింపారు.

– ఆర్థిక, వైద్యారోగ్య మంత్రి హరీశ్‌రావు

రాష్ట్రంలో రైతు రాజ్యం

తెలంగాణ రాష్ట్రం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని రుణమాఫీతో మరోసారి రుజువైందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. 2014లోనూ రైతుల రుణమాఫీ చేశామని, 35,32,000 మంది రైతులకు లబ్ధి చేకూరిందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సాగునీటి వసతుల కల్పనలో భాగంగా.. మిషన్ కాకతీయ కింద 35వేల చెరువుల పునరుద్ధరణ, కాళేశ్వరం వంటి బహుళార్థ సాధక ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టిందని వివరించారు. సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించడం, నకిలీ విత్తనాల తయారీ, సరఫరాదారులపై పీడీ చట్టం ప్రయోగించి జైళ్లకు పంపడం, రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడం, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం వంటివాటితో రైతులకు ప్రభుత్వం అండగా నిలిచిందని తెలిపారు. రుణమాఫీకి సంబంధించి సీఎం కేసీఆర్ నిర్ణయం, ఈ సందర్భంగా ఆయన పేర్కొన్న అంశాలతో సీఎం కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.



సీతాకోక చిలుకైన త్రివర్ణ పతాకం


ఏపీలోని అనకాపల్లి జిల్లా తూటిపాలకు చెందిన మైక్రో రైటర్ రవికుమార్ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆవ, తోటకూర గింజలతో సీతాకోక చిలుక ఆకారంలో జాతీయ జెండాను రూపొందించారు. – మాకవరపాలెం

పూర్వీకుల త్యాగాలను స్మరించుకుందాం: గవర్నర్



సాక్షి, హైదరాబాద్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా దేశ, రాష్ట్ర ప్రజలందరికీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన పూర్వీకుల త్యాగాలను స్మరించుకుందామని పిలుపునిచ్చారు. దేశం స్వయంసమృద్ధి, నాణ్యమైన విద్య, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ, ఆర్థికాభివృద్ధి సాధించేందుకు పాటుపడాలని పిలుపునిచ్చారు.

ఇదండీ సంగతి



కేసీఆర్ అవినీతి పాలన దేశమంతా తెలుసు

మధ్యప్రదేశ్ సీఎం ఘాటు వ్యాఖ్యలు




సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ సీఎం కేసీఆర్ అవినీతి దేశమంతా తెలుసని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇతరుల అవినీతి గురించి కేసీఆర్ మాట్లాడటమా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మధ్యప్రదేశ్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పోటీని స్వాగతిస్తున్నామని, ప్రజాస్వామ్యంలో అందరికీ అవకాశాలుంటాయని అన్నారు. శనివారంరాత్రి కొద్దిమంది దక్షిణాది పాత్రికేయులతో భోపాల్‌లోని తన అధికారిక నివాసంలో ఆయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. మధ్యప్రదేశ్ వ్యాపం కుంభకోణం గురించి కేసీఆర్ ప్రస్తావించడంపై శివరాజ్‌సింగ్ స్పందించారు. ''తెలంగాణలో అవినీతి పాలన గురించి దేశం మొత్తం తెలుసు. తెలంగాణ అవినీతి దేశానికే మార్గదర్శకత్వం వహిస్తోంది. 'గురువింద గింజ తన నలుపెరగదన్న సామెత మీకు తెలుసు కదా.. మధ్యప్రదేశ్‌లోనూ ఓ సామెత ఉంది. 'సూప్ బోలో తో బోలే.. చలనీ బోలే జిసమే హజారోం ఛేద్'(వేలకొద్దీ అవినీతి గుణాలు ఉన్న వ్యక్తి ఇతరుల అవినీతి గురించి మాట్లాడటం) అని కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అనంతరం తన ఓఎస్డీని పిలిచి అర్థం వివరించి చెప్పాలని సూచించగా... 'ఇతరుల అవినీతి మాట్లాడే కేసీఆర్ వారి కంటే ఎక్కువ అవినీతి పరుడని తెలుసుకోవాలి'అని ఓఎస్డీ పేర్కొన్నారు.

ఏపీ వలంటీరు వ్యవస్థ భేష్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీరు వ్యవస్థ బాగుందని శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రశంసించారు. వలంటీర్లు చేస్తున్న సేవలు, లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాల గురించి అడిగి తెలుసుకున్నారు. దీనిపై అధ్యయనం చేయాలని తన కార్యాలయ అధికారులకు ఆదేశాలిచ్చారు.

104 వాహన సిబ్బందిని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలి

సీఎం కేసీఆర్‌కు తమ్మినేని లేఖ



సాక్షి, హైదరాబాద్: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందించిన 104 వాహన సిబ్బందిని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ సేవలందించారని తెలిపారు. ప్రభుత్వం 104ను ఎత్తేసే సమయంలో వీరందరినీ ఆదుకుంటామని మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చినప్పటికీ.. ప్రభుత్వం ఈ విషయాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. మరో ఉద్యోగం కోసం నియామకమయ్యే వయసు కూడా వీరు దాటిపోయారని తమ్మినేని తెలిపారు.

కాంగ్రెస్ వస్తే కుంభకోణాల కుంభమేళానే

- ఎల్లారెడ్డి సభలో మంత్రి కేటీఆర్ ఫైర్
- ధరల పెరుగుదల పాపం కేంద్రంలోని బీజేపీదే
- కేసీఆర్ నాయకత్వంలో అన్నిరంగాల్లో రాష్ట్రం అభివృద్ధి



ఎల్లారెడ్డిలో ఫ్లైఓవర్ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే జాజాల సురేందర్ తదితరులు

సాక్షి, కామారెడ్డి: 'యాభై ఏండ్లు అధికారం వెలగబెట్టిన కాంగ్రెసోళ్లు ఎన్ని ఘనకార్యాలు జేసింవ్రో జూసినం. ఇప్పుడు అధికారం కోసం అలవికాని హామీలు ఇస్తున్నరు. వాళ్ల మాటలు నమ్మితే మోసపోవుడే. అంతేగాదు వాళ్లు అధికారంలో ఉంటే కుంభకోణాల కుంభమేళా తీసుకువస్తరు..'అని రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్ ఆరోపించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు ఎల్లారెడ్డి పట్టణంలో సోమవారం పలు అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఎల్లారెడ్డి పట్టణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు.

ఎవరు కావాలో ఆలోచించుకోండి..

కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడు దొంగరాత్రి కరెంటుతో ఎంతోమంది రైతులు కరెంటు షాకులు, పాముకాట్లకు బలయ్యారని, అప్పుడు అరిగోస పెట్టి, ఇప్పుడేమో చిలకపలుకులు పలుకుతున్నారని కేటీఆర్ విమర్శించారు. వ్యవసాయానికి మూడు గంటల కరెంటు చాలంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అంటున్నాడని, మూడు పంటల కేసీఆర్ కావాలా? మూడు గంటల కాంగ్రెస్ కావాలా? మతం పేరుతో మనమధ్య పంచాయతీ పెట్టే బీజేపీ కావాలా? రైతులు ఆలోచించాలన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలిచిందని, కాంగ్రెస్ మాటలు నమ్మి వాళ్లకు ఓట్లేస్తే రాష్ట్రం మళ్లీ పాత రోజుల్లోకి పోవలసి వస్తుందని హెచ్చరించారు. అప్పుడు ఎక్కడ చూసినా దుర్భిక్షం ఉండేదని, ఇప్పుడు మిషన్ కాకతీయతో చెరువులన్నీ బాగుపడి భూగర్భ జలాలు పెరిగాయని తెలిపారు. 24 గంటల కరెంటుతో రైతులు మంచి పంటలు పండిస్తున్నారని చెప్పారు.

ఏం జేసింవ్రో చెప్పి ఓట్లడుగుండ్రి..

కాంగ్రెస్‌కు ఓటేస్తే ధరణి, రైతుబంధు, రైతుబీమా, దళితబంధు.. అన్నీ పోయి దళారుల రాజ్యం వస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు కోతలు, కాలిన మోటార్లతో రైతులు పడ్డ కష్టాలను గుర్తు తెచ్చుకుని ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. గడపగడపకు కాంగ్రెస్ అంటూ తిరుగుతున్న షబ్బీర్‌అలీ లాంటి నాయకులు యాభై ఏండ్లలో ఏం పీకిండ్రని మంత్రి నిలదీశారు. షబ్బీర్ మంత్రిగా ఉండి కామారెడ్డిని జిల్లా చేయలేదని, కామారెడ్డికి మెడికల్ కాలేజీ తీసుకురాలేదని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు తాము అధికారం వెలగబెట్టి ప్రజలకు ఏం జేసింవ్రో చెప్పి ఓట్లడగాలని పేర్కొన్నారు. ధరల పెరుగుదల పాపం కేంద్రంలోని బీజేపీదేనన్నారు. కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమం కోసం పనిచేసే గొప్పనాయకుడని చెప్పారు. రాష్ట్రంలో వెయ్యి ఒక్క గురుకులాలు తీసుకువచ్చి పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యనందిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో రెండొందలు ఉన్న పింఛన్‌ను తాము రూ.2 వేలకు, ఐదొందలు ఉన్న పింఛన్ రూ.నాలుగు వేలకు చేశామని తెలిపారు.

అప్పుడు ఏది కావాలన్నా ఢిల్లీని అడగాల్సిందే..

రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉంది కాబట్టే కేసీఆర్ తాను ఏది చేయాలన్నా కేబినెట్ మీటింగు పెట్టి నిర్ణయం తీసుకుంటాడని, అదే కాంగ్రెస్, బీజేపీలు అధికారంలోకి వస్తే ఏది కావాలన్నా ఢిల్లీని అడగాల్సి ఉంటుందని కేటీఆర్ చెప్పారు. బేకార్‌గాళ్లు, చేతగానోళ్లు, ఢిల్లీ గులామోళ్ల మనకవసరమా? అంటూ ప్రశ్నించారు. సభలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సిబ్బందికి ఎల్‌ఐసీ బీమా

పంచాయతీ సిబ్బంది అంత్యక్రియల ఖర్చు రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ సిబ్బందికి జీవిత బీమా పథకాన్ని వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్‌ఐసీ) ద్వారా ఈ బీమాను గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు అమలు చేయాలని సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మల్టీపర్పస్ వర్కర్లు సర్వీసులో ఉండగా మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల బీమా అందేలా ఈ పథకాన్ని అమల్లోకి తేవాలని పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ జారీ చేసిన అంతర్గత ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వ హణ, మొక్కల పెంపకంలో కీలక పాత్ర పోషిస్తున్న మల్టీపర్పస్ వర్కర్ల కుటుంబాలకు సామాజిక భద్రత కోసమే బీమా అమలు చేయాలని నిర్ణయించామని, ఇందుకు అవసరమయ్యే ప్రీమియంను గ్రామపంచాయతీ నిధుల నుంచే చెల్లించాల్సి ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో వెల్లడించారు. పంచాయతీ నిధుల ద్వారా బీమా ప్రీమియం చెల్లింపుతో పాటు క్లెయిమ్‌ల పర్యవేక్షణ బాధ్యతలు జిల్లా పంచాయతీ అధికారులు (డీపీవో)లకు అప్పగించింది. అదే విధంగా సర్వీసులో ఉన్న మల్టీపర్పస్ వర్కర్లు మరణించిన సమయంలో వారి అంత్యక్రియల కోసం చెల్లించే మొత్తాన్ని పెంచుతూ ప్రభుత్వం మరో ఉత్తర్వు జారీ చేసింది. ఇప్పటివరకు రూ.5 వేలుగా ఉన్న అంత్యక్రియల ఖర్చులను రూ.10 వేలకు పెంచుతున్నట్టు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అబద్ధాల పునాదుల మీద బీజేపీ రాజకీయం: కేటీఆర్

'బీజేపీ వంద అబద్ధాలు' సీడీ, బుక్‌లెట్ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: అబద్ధాల పునాదుల మీద రాజకీయం చేస్తున్న బీజేపీ అసలు రూపాన్ని ప్రజలు ముందు పెడుతున్నట్లు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ వెల్లడించారు. పార్టీ సోషల్ మీడియా విభాగం రూపొందించిన 'బీజేపీ వంద అబద్ధాలు'సీడీ, బుక్‌లెట్‌ను సోమవారం ప్రగతిభవన్‌లో కేటీఆర్ ఆవిష్కరించారు. బీజేపీ తప్పులు, వైఫల్యాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు బుక్‌లెట్లు, సీడీల్లోని సమాచారం తోడ్పడుతుందని అన్నారు. కాగా బీఆర్‌ఎస్ సోషల్ మీడియా విభాగం రూపొందించిన ఈ సీడీలు, బుక్‌లెట్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలు, తెలంగాణకు చేసిన అన్యాయాలను బట్టబయలుచేసినట్లు సోషల్ మీడియా కన్వీనర్లు మన్నె క్రిశాంక్, వై.సతీశ్‌రెడ్డి, పాటిమీది జగన్మోహన్‌రావు, దినేశ్ చౌదరి వెల్లడించారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, భారంగా మారిన జీఎస్టీ, ప్రతీ ఇంటికి ఇంటర్నెట్ సదుపాయం, అందరికీ ఇళ్లు, విభజన హామీలు, బయ్యారం స్టీల్‌ప్లాంట్, ఐటీఐఆర్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఎస్టీ రిజర్వేషన్లు వంటి అంశాల్లో బీజేపీ వైఫల్యాలను వీటిలో పొందుపరిచారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేకానంద్ గౌడ్, ఎంపీ బీబీ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.


Reliance
Growth is Life
SMART BAZAAR
SMART SUPERSTORE
ఫుల్ పైసా వసూల్ సేల్
12th - 16th Aug
Powered by Jio TRUE 5G
త్వరపడండి!
చివరి 2 రోజులు
షాపింగ్ పైన ఫుల్ పైసా వసూల్ కావాలా?
స్మార్ట్ బజార్ కు విచ్చేయండి
SMART BAZAAR NOW ON JioMart
తాజ్‌మహల్ టీ 500 g
₹60
ఎమ్ఆర్‌పి ₹410
స్మార్ట్ ప్రైస్ ₹350
బిస్కెట్స్ 300 g
BUY ANY 2 GET ANY 1 FREE
ఎమ్ఆర్‌పి ₹120
మాజా 1.2 ℓ
BUY 2 GET 1 FREE
ఎమ్ఆర్‌పి ₹75
క్లోజ్ అప్ రెడ్ టూత్‌పేస్ట్ 300 g
BUY 1 GET 1 FREE
ఎమ్ఆర్‌పి ₹200
లక్స్ జాస్మిన్ అండ్ విటమిన్ ఈ / రోస్ అండ్ విటమిన్ ఈ / సోప్ 150 g x 3 యూనిట్స్ (మల్టీ ప్యాక్)
BUY 1 GET 1 FREE
ఎమ్ఆర్‌పి ₹198
టైడ్ 5 kg / సర్ఫ్ ఎక్సెల్ 5 kg / మ్యాటిక్ 6 kg / లిక్విడ్ 2 ℓ / ఏరియల్ మ్యాటిక్ 4+2 kg / లిక్విడ్ 2 ℓ
33% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹430
స్మార్ట్ ప్రైస్ ₹288
చాక్లెట్ హోమ్ ప్యాక్
BUY ANY 2 GET ANY 1 FREE
ఎమ్ఆర్‌పి ₹99
చింగ్స్ సీక్రెట్ / టాప్ రామెన్ నూడుల్స్ 240 g
BUY ANY 2 GET ANY 1 FREE
ఎమ్ఆర్‌పి ₹78
కోకో కోలా / స్ప్రైట్ / థమ్స్అప్ 600 ml
BUY ANY 3 GET ANY 1 FREE
ఎమ్ఆర్‌పి ₹38
డవ్ / హెడ్ అండ్ షోల్డర్స్ / ట్రెసెమీ / సన్‌సిల్క్ / లోరియల్ / క్లినిక్ ప్లస్ షాంపు 580 ml
50% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹555
స్మార్ట్ ప్రైస్ ₹278
విస్పర్ అల్ట్రా క్లీన్ XL+ 44s / స్టే ఫ్రీ శానిటరీ ప్యాడ్స్ 42s Sanitary Pads
50% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹500
స్మార్ట్ ప్రైస్ ₹250
హార్పిక్ టాయిలెట్ క్లీనర్ 600 ml + లైజాల్ ఫ్లోర్ క్లీనర్ 625 ml
₹52
ఎమ్ఆర్‌పి ₹251
స్మార్ట్ ప్రైస్ ₹199
₹999
ఎమ్ఆర్‌పి ₹1613
ఆదా చేసుకోండి ₹614
గుడ్ లైఫ్ బాదం / జీడిపప్పు (W320) 500 g
₹339/ ₹369
ఎమ్ఆర్‌పి ₹549 / ₹499
ఆదా చేసుకోండి ₹210 / ₹130
చక్కి ఆటా 5 kg
₹165
ఎమ్ఆర్‌పి ₹270
ఆదా చేసుకోండి ₹105
గుడ్ లైఫ్ డైలీ రైస్ 30 kg
₹1349
ఎమ్ఆర్‌పి ₹1650
ఆదా చేసుకోండి ₹301
BUY ANY 2 GET ANY 1 FREE
ఎమ్ఆర్‌పి ₹60
₹99
ఎమ్ఆర్‌పి ₹149 / ₹190 / ₹198
ఆదా చేసుకోండి ₹50 / ₹91 / ₹99
హెరిటేజ్ ఆగ్‌మార్క్ నెయ్యి 1 ℓ
₹559
ఎమ్ఆర్‌పి ₹730
ఆదా చేసుకోండి ₹171
25% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹15
జియోభారత్ 4G ఫోన్
₹999
ఎమ్ఆర్‌పి ₹1999
మెన్స్ వేర్, వుమెన్స్ వేర్, కిడ్స్ వేర్
ప్రారంభ ధర ₹149
60%
2 బర్నర్ గ్లాస్ టాప్ గ్యాస్ స్టవ్
₹1599
ఎమ్ఆర్‌పి ₹5695
కాటన్ డబుల్ బెడ్ షీట్ విత్ పిల్లో కవర్
₹799
ఎమ్ఆర్‌పి ₹1999
3 Pcs హార్డ్ ట్రాలీ సెట్ (55 cm / 66 cm / 76 cm)
₹5999
ఎమ్ఆర్‌పి ₹23000
₹499
ఎమ్ఆర్‌పి ₹1299
10% INSTANT DISCOUNT
SBI card
#Min. Trxn.: ₹2,500; Max. Discount: ₹500 per credit card.
Validity: 12 Aug - 16 Aug 2023. T&C Apply.
Jio Win Gold Coins
Grab a chance to WIN 1 gm Gold Coin
Shop for ₹499 & above and book a Jio SIM
Book a JioPlus SIM at ₹99
Buy a JioBharat Phone at just ₹999
వద్ద కూడా లభ్యం
fresh Signature



ఏ మూల్యానికైనా స్వేచ్ఛ అనేది ఖరీదైనది కాదు. అది జీవితానికి శ్వాస. జీవించడం కోసం మనిషి ఏం చెల్లించడు?

– మహాత్మా గాంధీ

సాక్షి

మంగళవారం, 15 ఆగస్టు 2023

తటస్థతకు తిలోదకాలు

పోసేవాడు ఒకందుకు పోస్తే... తాగేవాడు మరొకందుకు తాగాడని మోటు సామెత. ఎన్నికల కమిషనర్లు, ప్రత్యేకించి ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) నియామకంపై కేంద్ర ప్రభుత్వం ఆగస్ట్ 10న రాజ్యసభలో ప్రవేశపెట్టిన బిల్లు వ్యవహారం అచ్చం ఆ సామెతనే గుర్తు చేస్తోంది. ఎన్నికల కమిషనర్ల నియామకంపై పాలనావ్యవస్థ ఉడుంపట్టును సడలించేలా గత మార్చిలో సుప్రీమ్ కోర్ట్ రాజ్యాంగ ధర్మాసనం ఒక ఉద్దేశంలో తీర్పు చెబితే, అయిదునెలల్లో కేంద్రం ఏకంగా ఆ తీర్పు స్ఫూర్తికే విరుద్ధమైన బిల్లుతో ముందుకొచ్చింది. ఎంపిక ప్రక్రియ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)ని తప్పించింది. తటస్థంగా ఉండాల్సిన ఎంపిక కమిటీని అధికారపక్షం తన అదుపాజ్ఞల్లో ఉంచుకొనేలా తెగబడింది. పార్టీ, ప్రభుత్వాలకతీతంగా నడవాల్సిన ఎన్నికల సంఘ స్వతంత్రతను దెబ్బతీస్తోంది.

భారత ప్రధాని, ప్రతిపక్ష నాయకుడు (ఎల్ఓపీ), కేంద్ర క్యాబినెట్ మంత్రితో కూడిన ముగ్గురు సభ్యుల ప్యానెల్ ఇకపై సీఈసీని నియమిస్తుందని ప్రభుత్వం బిల్లులో ప్రతిపాదించింది. ఇప్పటిదాకా కేంద్ర మంత్రిమండలి సలహా మేరకు సీఈసీని రాష్ట్రపతి నియమిస్తున్నారు. తాజాగా ప్రతిపక్ష నేతను కూడా చేర్చి, విస్తృత ప్రాతినిధ్యంతో ప్యానెల్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన మామూలుగానైతే స్వాగతించాలి. కానీ, ఇక్కడే తిరకాసుంది. సీఈసీ సహా ఎన్నికల కమిషనర్ల ఎంపికపై ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేసే వరకు, సదరు ఎంపిక కమిటీలో సీజేఐకి కూడా చోటిచ్చి, ఈ ప్రక్రియను మరింత ప్రజాస్వామ్యయుతం చేయాలని మార్చి 2న అయిదుగురు సభ్యుల సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పునిచ్చింది. సహజంగానే ఇది మింగుడుపడని సర్కార్ ఆగమేఘాలపై బిల్లు తెచ్చేసింది. ఆ బిల్లులో సీజేఐకి బదులుగా కేంద్ర మంత్రికి చోటిచ్చింది. మంత్రులంటే ప్రధాని గీచిన గీత దాటలేరు. వెరసి, ఎంపిక కమిటీలో పేరుకు ప్రతిపక్ష నేత ఉన్నా మొత్తం ముగ్గురిలో ఇద్దరు సభ్యులు పాలక పక్షీయులే గనక మెజారిటీ ఎటు మొగ్గుతుందో వేరుగా చెప్పనక్కర లేదు.

పార్లమెంట్ చేసిన చట్టాలకు అనుగుణంగా ఎన్నికల కమిషనర్ నియామకం జరగాలని భారత రాజ్యాంగ పరిషత్ చర్చలు పేర్కొన్న మాట నిజమే. దాన్ని ఆసరాగా చేసుకొనే సుప్రీమ్ సైతం ప్రభుత్వం చట్టం చేసే వరకు ప్రధాని, ప్రతిపక్ష నేత, సీజేఐతో కూడిన ఎంపిక సంఘమంటూ అయిదు నెలల క్రితం తాత్కాలిక ప్రతిపాదన తన తీర్పులో చెప్పింది. తీరా ఇప్పుడు ప్రభుత్వం చట్టం చేస్తోంది కానీ పరోక్షంగా అధికార పక్షం చేతిలోకే అంతా తెచ్చి, రాజ్యాంగబద్ధ సంస్థ స్వతంత్రతను పణంగా పెట్టింది. ఇదీ అసలు సమస్య. అలాగే, ఎంపిక సంఘం తనదైన సొంత ప్రక్రియను ఎంచుకోవచ్చుట. ఆ సంఘం ముందు ఉంచాల్సిన తొలి జాబితాను క్యాబినెట్ సెక్రటరీ సారథ్యంలోని సెర్చ్ కమిటీ సిద్ధం చేస్తుందట. వెరసి, ప్రతిపక్ష నేత వట్టి ఉత్సవ విగ్రహమవుతారు. ఆయన అభిప్రాయం అరణ్యఘోషగా మిగులుతుంది. కొద్దినెలల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణల్లోనూ, సరిగ్గా మరో 9 నెలల్లో లోక్‌సభకూ ఎన్నికలు జరగాల్సి ఉండగా కేంద్రం ఈ బిల్లు ద్వారా ఎన్నికల సంఘంపై పూర్తిగా పట్టు బిగించాలన్నది పాలకుల తాపత్రయమనిపిస్తోంది.

ప్రభుత్వ ప్రమేయం లేకుండా నడవాల్సిన వ్యవస్థకు పెద్ద తలకాయలెవరో అధికారంలో ఉన్నవారే నిర్ణయించడం ఎన్నికల ప్రజాస్వామ్యపు ప్రాథమిక లక్ష్యానికే విఘాతం. ఆ మాటకొస్తే దేశంలో ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించే ఎన్నికల సంఘం, కమిషనర్ల నియామకం పారదర్శకంగా లేదని కొన్నేళ్ళుగా వింటున్నదే. వారిపై ప్రభుత్వం పరోక్షంగా స్వారీ చేస్తున్నదన్న ఆరోపణలూ ఉన్నాయి. 2021 నవంబర్‌లో న్యాయశాఖ ఆదేశాల మేరకు సీఈసీ, ఎన్నికల కమిషనర్లు ఉమ్మడి ఓటర్ల జాబితాపై చర్చించడానికి ప్రధానమంత్రి కార్యాలయంతో సమావేశానికి వెళ్ళడం దుమారం రేపింది. ఇది ఎన్నికల సంఘం అధికారం, స్వతంత్రతను తగ్గించడమేనని రాజ్యాంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. పాలకవ్యవస్థ జోక్యం నుంచి ఎన్నికల సంఘాన్ని కాపాడాలన్న సదుద్దేశంతో సుప్రీమ్ తీర్పునిస్తే అంతా సంతోషించారు. తీరా కొత్త బిల్లుతో ఎన్నికల సంఘం ఇక అధికారికంగానే పాలకుల గూటి చిలకగా మారిపోనుంది. ఎన్నికలు కురుక్షేత్ర సమరంగా మారిన వర్తమాన పరిస్థితుల్లో ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా ఉందని సంబంధిత పక్షాలన్నిటికీ నమ్మకం కలగడం ముఖ్యం. పాలకులేమో చట్టం తెచ్చి మరీ ఆ నమ్మకానికి చరమగీతం పలుకుతున్నారు.

ఎన్నికల సంస్కరణలపై ఏర్పాటైన దినేశ్ గోస్వామి కమిటీ 1990లోనే ఎన్నికల సంఘపు స్వతంత్రతను కాపాడే మార్గాలతో కొన్ని సిఫార్సులు చేసింది. న్యాయ సంఘం 2015 నాటి తన 255వ నివేదికలో ఆ కమిటీ ప్రతిపాదనకు మార్పులు చేస్తూ, ఎంపిక కమిటీలో ప్రధానికి చోటుకల్పించింది. సీజేఐకీ అందులో స్థానం ఉంటే అధికార, ప్రతిపక్షాలు వేటికీ మొగ్గ లేకుండా తటస్థత నెలకొనేది. కొత్త బిల్లుతో ఆ తటస్థత నిర్వీర్యమైంది. ఇది గ్రహించి ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియకు కావలిసంస్థ స్వతంత్రతను కాపాడుకోవాలి. రాజ్యాంగ రూపకల్పన వేళ అంబేడ్కర్ సైతం పాలనా వ్యవస్థ జోక్యానికి దూరంగా ఎన్నికల సంఘం ఉండాలన్నారు. సీఈసీ ఎంపిక ప్రక్రియ నుంచి సీజేఐని తప్పించకుండా ఉంటేనే అది సాధ్యం. కాదూ కూడదనుకుంటే, ప్రత్యామ్నాయంగా ఎంపిక కమిటీ నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా ఉండాలనే షరతు పెట్టాలి. తద్వారా ప్రతిపక్ష నేత మాటకు విలువ ఉంటుంది. ఎన్నికల సంఘం సమగ్రతను కాపాడినట్టూ అవుతుంది. మార్గం ఏదైనా, ఎన్నికల సంఘం నియామకాల ప్రక్రియను అపహాస్యం చేస్తున్న ఈ కొత్త బిల్లుపై తక్షణ సమీక్ష అవసరం. ప్రభుత్వం పునరాలోచించి, ఆ పని చేస్తేనే స్వతంత్ర భారతావనికి శోభ! ప్రజాస్వామ్యానికి రక్ష!!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** బ.చతుర్దశి ఉ.11.54 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** పుష్యమి ప.2.21 వరకు, తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** తె.4.31 నుండి 6.15 వరకు (తెల్లవారితే బుధవారం), **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.06 వరకు, తదుపరి రా.10.55 నుండి 11.40 వరకు, **అమృతఘడియలు:** ఉ.7.21 నుండి 9.05 వరకు.

సూర్యోదయం: 5.46
సూర్యాస్తమయం: 6.23
రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు

హింసా సంస్కృతి ఏ సందేశానికి?

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు మన దేశంలో కొత్తవి కావు. 1967 వరకు అన్ని రాష్ట్రాల్లోనూ డబుల్ ఇంజన్ కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నాయి. గట్టి ప్రత్యర్థులను, ముఖ్యంగా యువతీ యువకులను చంపడం, వారిని ప్రమాదకరమైన నక్సలైట్లుగా ముద్ర వేయడం ఆ రోజుల్లో ఆనవాయితీగా ఉండేది. అదృష్టవశాత్తూ దేశం ఆ పీడకల రోజులను అధిగమించింది. అయితే ఆనాటి క్రూరమైన ఎమర్జెన్సీ పరిస్థితుల్లో కూడా మణిపూర్ ఘటనలో లాగా మహిళలను నగ్నంగా ఊరేగించడం ఎప్పుడూ చూడలేదు. బహుశా అప్పటి రాజకీయ నిర్మాణంలో మూడో ఇంజన్ ఉండకపోవచ్చు. కానీ ఇప్పుడు ప్రజలను మతపరమైన మార్గాల్లో విభజించడానికి మార్గాలను రూపొందించే అత్యంత క్లిష్టమైన ఒక మూడో ఇంజన్ శక్తిమంతంగా పనిచేస్తోంది.

ప్రముఖ తెలుగు దినపత్రిక 'సాక్షి' సంపాదకులు వర్ధెల్లి మురళి 'నా దేశం నగ్న దేహమా?' శీర్షికతో 2023 జూలై 23న ఘాటైన వ్యాసం రాశారు. బీజేపీ ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు డబుల్ ఇంజన్‌తో, అంటే రెండో ఇంజన్ అయిన కేంద్ర మద్దతుతో నడుస్తున్నాయని ప్రధాని మోదీ నిరంతరం మాట్లాడుతున్నారని మురళి అన్నారు. వాస్తవానికి మణిపూర్‌లో మూడు ఇంజన్లు పనిచేస్తున్నాయని ఆయన చెప్పారు. కుకీ క్రైస్తవ మహిళలను నగ్నంగా ఊరేగించి, వారిలో ఒకరిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన దారుణమైన ఘటన గురించి రాస్తూ, ఏ రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా 'ట్రిపుల్ ఇంజన్' పవర్‌తో ప్రభుత్వాలు నడుస్తున్నాయని అన్నారు. ఆ మూడో ఇంజన్ – ఆరెస్సెస్.

మూడవ ఇంజన్ క్రమపద్ధతిలో ప్రతి రాష్ట్రంలోనూ ప్రజలను మెజారిటీలు, మైనారిటీలుగా విభజిస్తుంది. ఇది ప్రజలను మత పరమైన మార్గాల్లో విభజించడానికి మార్గాలను రూపొందించే అత్యంత క్లిష్టమైన ఇంజన్. 1999లో బీజేపీ, ఆరెస్సెస్ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి వారు ఎన్నికల ప్రయోజనాల కోసం యంత్రాంగాన్ని ఉపయోగించడం ప్రారంభించారు. మరీ ముఖ్యంగా 2014 ఎన్నికల నుండి దేశవ్యాప్తంగా మైనారిటీ వ్యతిరేక ప్రచారం పెద్ద ఎత్తున జరిగింది. ప్రధానంగా ముస్లింలను, క్రైస్తవులను లక్ష్యంగా చేసుకున్నారు. వ్యవస్థీకృతమైన హిందుత్వ శక్తులు వారిపై దాడి చేసేందుకు అన్ని రకాల వ్యూహాలను ప్రయోగిస్తూనే ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాల్లో క్రైస్తవులు లేదా క్రైస్తవేతరులు అనే ప్రాతిపదికన సమూహాలను విభజించడం చాలా కాలంగా జరుగుతోందని పుకార్లు ఉన్నాయి. 2014 ఎన్నికల తర్వాత ఆరెస్సెస్–బీజేపీ స్థానిక రాష్ట్ర యంత్రాంగంపై నియంత్రణను సాధించింది.

అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, మణిపూర్‌లో దాదాపు 53 శాతం జనాభా మైతేయిలు కాగా, మిగిలిన వారిలో కుకీలు, నాగాలు ఉన్నారు. కుకీలు, నాగాలలో దాదాపు 95 శాతం మంది క్రైస్తవులు; మైతేయిలలో 2–3 శాతం మంది క్రైస్తవులు. మైతేయిలలో కూడా క్రైస్తవ ప్రభావం పెరుగుతోందని హిందుత్వ శక్తులు భావించినట్లు కనిపిస్తోంది. కాబట్టి వారు మతపరమైన పరివర్తనకు అడ్డుకట్ట వేయాలని కోరుకున్నారు. మైతేయిలను బలమైన హిందూ శక్తిగా అవతరింపజేయడం ద్వారా వారు తమ ప్రయత్నాన్ని ప్రారంభించినట్లు తెలుస్తోంది. అదే సమయంలో రాష్ట్రంలోని కుకీలు, నాగాలు విశ్వాసపాత్రులైన క్రైస్తవులుగా ఉండిపోయారు, లేదా 'ఘర్ వాపసీ' అయ్యారు. ఇంకొక ప్రధాన ఆలోచన ఏమిటంటే, హిందూ



మైతేయిలను ఎస్టీలుగా గుర్తించడం వలన వారికి భూమి హక్కులు, ప్రభుత్వ ఉద్యోగాలు లభిస్తాయి. ఇది ఈశాన్య ప్రాంతాలను క్రైస్తవీకరణ నుంచి మార్చే హిందుత్వ ప్యాకేజీ. ఇది దీర్ఘకాలిక ప్రాజెక్ట్. వ్యవస్థీకృత హిందూ మైతేయిలకు ఆ పనిని చేయడానికి అనుమతించే కార్యాన్ని మణిపూర్ ముఖ్యమంత్రి బీరెన్ సింగ్‌కు అప్పగించినట్లు కనిపిస్తోంది.

రాజకీయ చర్చల నుండి అత్యంత శక్తిమంతమైన మూడో ఇంజన్‌ను మినహాయించి, ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో ఏం జరుగుతున్నదో దానికి బాధ్యత వహించాల్సింది మోదీయేనని ప్రతిపక్షాలు మాట్లాడటం తప్పు. వాజ్‌పేయి కంటే ఎక్కువ అధికారంతో మోదీ రెండో ఇంజన్ ను నడుపుతున్నారనేది వాస్తవం. కానీ మూడో ఇంజన్ అయిన ఆరెస్సెస్ ప్రమేయం లేకుండా... మణిపూర్‌లో లాగా హిందుత్వ యంత్రాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపయోగించుకోలేవు. ముఖ్యమంత్రులకు ఏం చేయాలో, ఏం చేయకూడదో చెప్పేది థర్డ్ ఇంజన్.

స్త్రీలను నగ్నంగా నడిచేలా చేసిన పురుషుల ప్రవర్తన కనికరం లేకుండా ఉండటానికి ఎంతో శిక్షణ అవసరం. వారిలో ఒకరిపై దారుణంగా అత్యాచారం చేశారు. ఆ దృశ్యానికి సంబంధించిన వీడియోలు ప్రపంచాన్ని కంపింపజేయడంతో ప్రధాని ఈ ఘటనను ఖండించారు. అయితే ఆ క్రూరత్వానికి వ్యతిరేకంగా ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొల్పాలని ఈ సంస్థ గతంలో ఒక సాధారణ ప్రకటన మాత్రం విడుదల చేసింది. అయితే ఈ దారుణ ఘటనకు సంబంధించిన వీడియో నేపథ్యంలో ఆయన ఓ ప్రకటన చేశారు. "చాలాసార్లు ప్రతికూల చర్చలే వినిపిస్తున్నాయి. అయితే మనం దేశమంతా తిరిగి చూసినప్పుడు, జరుగుతున్న మంచి విషయాల గురించి 40 రెట్లు ఎక్కువ చర్చలు సాగుతున్నాయని మనకు తెలుస్తుంది".

ఆ ఘటనలోని మహిళా వ్యతిరేక స్వభావాన్ని ఖండించకుండా '40 రెట్లు ఎక్కువ మంచి విషయాలు' అంటూ సర్‌సంఘ్ చాలక్ మాట్లాడుతున్నారు. మణిపూర్‌లో మూడు ఇంజన్లు సమన్వయంతో పనిచేశాయి కాబట్టి, ఆ చర్యలో పాల్గొన్న హిందుత్వ శక్తులు ఆ మహిళలను ఘర్ వాపసీ చేయాలనుకుంటున్నాయా? బాధితులకు ఉరిశిక్ష పడేలా తమ ప్రభుత్వం చూస్తుందని మణిపూర్ ముఖ్యమంత్రి ప్రకటించారు. అయితే బిల్కిస్ బానో అత్యాచారం కేసులో 11 మంది దోషుల వలె వారిని తరువాత విడుదల చేయవచ్చు!

నియంతృత్వం ఆసన్నమైందనే భయం కారణంగానే చాలా మంది ఇందిరాగాంధీ విధించిన అత్యవసర పరిస్థితిని ఎదిరించారు. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కేంద్ర ప్రభుత్వ మద్దతు కలిగిన డబుల్ ఇంజన్ సర్కారు. ముఖ్యమంత్రిగా జలగం వెంగళరావు పూర్తిగా ఆయిల్ నింపిన ఆ ఇంజన్‌కు రాష్ట్ర స్థాయి నిర్వాహకులు. గట్టి ప్రత్యర్థులను, ముఖ్యంగా యువతీ యువకులను చంపడం, వారిని ప్రమాదకరమైన నక్సలైట్లుగా ముద్ర వేయడం ఆ రోజుల్లో ఆనవాయితీగా ఉండేది. ఏ పోలీసు కూడా అలాంటి వారికి రక్షణ కల్పించలేదు. ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి అధికారీ పతకం సాధించేందుకు, మరింత మందిని చంపేందుకు పోటీ పడ్డారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు మనకు కొత్తవి కావు. 1967 వరకు అన్ని రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నాయి.

అయితే ఆనాటి క్రూరమైన ఎమర్జెన్సీ పరిస్థితుల్లో కూడా మహిళలను ఊరేగించడం ఎప్పుడూ చూడలేదు. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ ఇంజన్‌కు ఒక మహిళ నాయకత్వం వహిస్తున్నందున, ఆనాడు అలాంటి ఆపరేషన్ ను అనుమతించలేదు. అదృష్టవశాత్తూ దేశం ఆ పీడకల రోజులను అధిగమించింది. బహుశా ఆ రాజకీయ నిర్మాణంలో ఆ కాలంలో థర్డ్ ఇంజన్ ఉండకపోవచ్చు.

కానీ ఇప్పుడు మణిపూర్‌లో కానీ దేశంలో కానీ బహిరంగంగా ప్రకటించినటువంటి ఎమర్జెన్సీ లేదు. అయినా ఇక్కడ ప్రజలను కేవలం వ్యక్తిగత ఎన్‌కౌంటర్లలో చంపడం లేదు. వారి సొంత ఇళ్లల్లో, బయట సజీవ దహనం చేస్తున్నారు. మణిపూర్ ఘటన ఉద్దేశపూర్వకంగా ప్రేరేపించిన హింసాత్మక సంస్కృతి తాలూకు చివరి చర్య. ఈ హింసను, ఈ అనాగరక సంస్కృతిని ప్రపంచం ఎలా అర్థం చేసుకోవాలి?

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

మనం ఏ మాత్రం లౌకికవాదులం?

సందర్భం



కె. ఎన్. మల్లీశ్వరి

హమ్మయ్య... ఇన్నాళ్ళకి ఈ జాతీయ పండుగ రోజున దేశభక్తిని నిరూపించుకునే ఘనమైన అవకాశం మనకి దొరికింది. పొద్దున్నే రకరకాల పనుల మీద ఫోన్లు రింగ్ చేసినవారందరికీ ఒక గొంతు దిశా నిర్దేశం చేసింది. సెల్ఫీ ప్రియులయిన భారత ప్రజలంతా మువ్వన్నెల జెండా చేతబూని ఒక సెల్ఫీ దిగి అప్ లోడ్ చేయాలని. 'ఇదేమిటిది! మాకు ఈ సెల్ఫీ ఇష్టం లేదు, మా దేశభక్తి ఇదిగాదు, మేమెందుకు సెల్ఫీ దిగాలని?' గానీ అడిగావో అర్బన్ నక్సలైట్‌వో, ఆందోళన జీవివో అవుతావు తప్ప మరొకటి కాదు.

మరి సెల్ఫీ దేశభక్తి గురించి ఆలోచిస్తుంటే ఒక లెక్క కుదురుతుంది. ఒక్కో సెల్ఫీ ఒక్కో వోటు. అన్ని వోట్లని ఒక దగ్గర చేర్చి చూసుకునే అరుదైన అవకాశం పాలక పార్టీ దక్కించుకుంది. అయితే మనం ప్రశ్నించాల్సిన విషయం ఒకటుంది. జాతీయ జెండాని పట్టుకునే విధానం దగ్గర నుంచి దానిని ఎలా గౌరవించాలీ అనేవరకూ నియమావళి ఉంటుంది. పాలకపార్టీ తాము అత్యంత పవిత్రంగా చూస్తామని చెప్పుకునే 'జాతీయ జెండా'ను జనరంజక జిమ్మిక్కుల కోసం ఫ్యాషన్‌గా మార్చడంలో ఎవరికీ ఎలాంటి అభ్యంతరం లేకపోవడం విరోధాభాస.

దీపాలు వెలిగించడం, గిన్నెలు, తపేళాలు, దబరాలు మోగించడం మాదిరిగా 'సెల్ఫీ విత్ తిరంగా' కూడా త్రిముఖ వ్యూహం. సమస్యలను దారి మళ్లించడం, రోగ కారణాలకి దూరంగా ప్రజలకి తక్షణ ఉపశమన భ్రాంతిని కలుగజెయ్యడం, ఇన్ని కోట్ల మంది తమ వెనుక ఉన్నారని బలప్రదర్శన చేయడం. వీటివల్ల ప్రజలకి దీర్ఘకాలంలో కలిగే కీడు – ఇటువంటివి చేయడం ద్వారా మన సామాజిక బాధ్యతని చాలా గొప్పగా నిర్వహించామన్న తృప్తి కలగడం, పౌరులుగా ఏవి మన అసలు బాధ్యతలో పార్టీ ప్రభుత్వాలు నిర్ణయించడం, రాజకీయంగా చురుకైన మేధస్సుని చూపే అవకాశం లేకపోవడం, మన చుట్టూ జరుగుతున్న నిజమైన, ఘోరమైన అన్యాయాలకి మొహం తిప్పడం! ప్రజాస్వామ్యంలో ప్రజలు బంట్లుగా మారడమే ప్రభుత్వాలకి కావాలి. కత్తులతో నరుకుతున్నా, నగ్నంగా మార్చి ఊరేగిస్తున్నా, ప్రమాదాలలో చనిపోతున్నా నిబ్బరంగా వీడియోలు, సెల్ఫీలు తీసుకునే మన సమాజానికి 'సెల్ఫీ విత్ తిరంగా'నే కవితా న్యాయం.

నిజానికి కొన్ని తేదీలు మైలురాళ్ళ వంటివి. ఆయా చారిత్రక సందర్భాల మీద కొందరికి ఏకీభావం ఉండొచ్చు, మరికొందరికి విభేదంతో కూడిన ఆమోదం ఉండొచ్చు. కలవరాలు, సంతోషాలు, దుఃఖాలు ఉండొచ్చు. కానీ గుర్తించక తప్పని తేదీ ఆగస్ట్ పదిహేను. ఇక్కడ నిలబడి విప్లవాలు సరే, రాజ్యాంగబద్ధ హక్కులకి మన దేశంలో ఎంత విలువ ఉంది, అన్నది ఇపుడు ఆలోచించాలి. అనేక అంశాలతో పాటు అందరినీ కలవరపెడుతున్న విషయం భారతదేశపు లౌకిక తత్వానికి ముంచుకు వచ్చిన పెను ముప్పు.



లౌకిక వాద స్ఫూర్తిని భగ్నం చేసే అంశాలను గుర్తించడం కోసం ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక, 'మనం ఏ మాత్రం లౌకిక వాదులం?' పేరుతో ఒక ఆచరణ తీసుకుంది. ప్రజలుగా ప్రజలతో చర్చ చేయడానికి కార్యక్రమం రూపొందించుకుంటోంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగాలు చేస్తున్న యువత, ఇంటిని నిర్వహించేవారు, ఉద్యోగినులు, డాక్టర్లు, వాకర్లు, కార్మికులు, వ్యాపారస్తులు... ఇంకా ఇంకా అనేకులు. భిన్న రంగాల వారితో మాట కలుపుతుంది. అభిప్రాయాలు తెలుసుకుంటుంది, ఆలోచనలు పంచుకుంటుంది. సాహిత్యం మాకు వారధి, పనిముట్టు, ఆయుధం, అవసరం.

పరమ క్రూరమైన పద్ధతులతో మతతత్వం రాజకీయాలతో అంటగాగుతోంది. మనుషుల మధ్య మత ప్రాతిపదికన విభజన రేఖలు గీయబడుతున్నాయి. మతమూ, రాజకీయమూ చెట్టాపట్టాలెక్కిన చోట వ్యక్తులుగా మనమంతా అల్పులం కావొచ్చు. పౌరులుగా తగిన శక్తిమంతులం, బుద్ధిజీవులం. మనకి వచ్చిపడిన ముప్పుని మనమే కలిసికట్టుగా ఎదుర్కోవాలి. వ్యక్తులుగా మనలో మనమే గుర్తించలేనంత సూక్ష్మ స్థాయిలో ఉండే పరమత అసహనాలను వెతికి పట్టుకుందామన్న ప్రతిన పూనాలి. భిన్నమతాలకి చెందిన ఏ అంశం మనకి ఎదురైనా ప్రేమా, సహనాలే మన ఆలోచనలకి పునాది కావాలి. క్రికెట్‌లో గెలవాల్సింది హిందువులో, ముస్లిములో కాదని క్రీడా నైపుణ్యమని గ్రహింపునకు రావాలి. సముద్రంలో నీటి బిందువంత ఈ చిన్న ప్రయత్నానికి, సముద్రమంతటి లోతైన, గాఢమైన, భావస్ఫోరకమైన ప్రజాబాహుళ్యపు ఏకాగ్రతను కోరుతున్నాం.

వ్యాసకర్త జాతీయ కార్యదర్శి, ప్రరవే

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఆవిష్కరణా? ఎగురవేయడమా?

స్వతంత్ర దినోత్సవం, గణతంత్ర దినోత్సవాల నాడు మనం జెండా వందన కార్యక్రమంలో పాల్గొంటూ వస్తున్నాం. అయితే ఈ రెండు జాతీయ పర్వదినాల్లో విభిన్న పద్ధతుల్లో జెండాను గాలిలో రెపరెపలాడేలా చేస్తారు. అంటే ఆగస్ట్ 15న అనుసరించే పద్ధతిలో... జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవం నాడు జెండాను ఎగురవేయరు. ఈ తేడా తెలుసుకోవలసిన అవసరం సామాన్య పౌరుని దగ్గరి నుంచి ప్రభుత్వ ఉద్యోగులూ, టీచర్లు, మరీ ముఖ్యంగా విద్యార్థులకు ఎంతో ఉంది. అలా తెలియచేయవలసిన బాధ్యత ఉపాధ్యాయులకూ, మీడియాకూ ఉంది.



ముందుగా స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఏం చేయాలో చూద్దాం. ఆరోజు ప్రధానమంత్రి ఎర్రకోటపైనా, రాష్ట్రాల ముఖ్యమంత్రులు తమ తమ రాజధానుల్లోనూ జాతీయ జెండా (త్రివర్ణ పతాకం)ను ఎగురవేస్తారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, అన్ని పాఠశాలలూ, కళాశాలల్లోనూ, కూడలి స్థలాల్లో పౌరులూ జెండాను ఎగురవేస్తారు. దేశానికి బానిస సంకెళ్ల నుంచి విముక్తి కలిగి స్వాతంత్ర్యం వచ్చింది అనడానికి ప్రతీకగా జెండాను కింది నుంచి జెండా స్తంభం పైకి లాగి ఎగురవేస్తారు.

స్వతంత్ర భారత దేశం తనకంటూ ఒక రాజ్యాంగాన్ని రాసుకొని అమలులోకి తెచ్చుకుని 'రిపబ్లిక్' (సర్వసత్తాక గణతంత్ర రాజ్యం)గా అవతరించిన జనవరి 26వ తేదీన జెండాను ఎగురవేయడానికి బదులు ఆవిష్కరిస్తారు. అంటే... జెండా స్తంభం పైభాగాన త్రివర్ణ పతాకాన్ని మడతపెట్టి తాడుతో జారుముడి వేసి ఆవిష్కారానికి సిద్ధం చేస్తారు. జెండాను ఆవిష్కరించే వారు జెండా తాడును లాగితే ముడి విడివడి, జెండా గాలిలో రెపరెపలాడుతుంది. దీనినే 'జెండా ఆవిష్కారం' అంటారు. దేశ రాజధాని ఢిల్లీలోని రాజ్‌పథ్‌లో రాష్ట్రపతీ, వివిధ రాష్ట్రాల రాజధానులలో ఆ రాష్ట్రాల గవర్నర్లూ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. ఇదే పద్ధతిలో మిగతావారూ ఆవిష్కరించాలి.

మన త్రివర్ణ పతాకానికి సంబంధించిన ఈ అవగాహన లేకుండా రెండు జాతీయ పర్వదినాల్లో ఒకే విధమైన పద్ధతి అనుసరించినా, లేదా అనుసరించవలసిన పద్ధతికి భిన్నంగా వ్యవహరించినా అది నేరమవుతుంది. ఇటీవలి కాలంలో స్వాతంత్ర్య దినోత్సవాన్నీ, గణతంత్ర (రిపబ్లిక్) దినోత్సవాన్నీ జాతీయ పర్వదినాలుగా, జాతీయ పండుగలుగా జరుపుకోకుండా సెలవు దినాలుగా గడిపేయడం కనిపిస్తోంది. ఇది ఎంతైనా గర్హనీయం.

– డా॥ ఎస్. విజయ భాస్కర్, ఉపాధ్యాయుడు। 92908 26989

సాధించిన దానికి సంతృప్తి చెందుతూనే...

సందర్భం



ఎమ్.ఆర్.కె. కృష్ణారావు

'ఎందరో మహానుభావులు, అందరికీ వందనాలు'. అలుపెరగని మన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగఫలంగా 1947 ఆగష్టు 15న విదేశీ పాలనా శృంఖలాల నుండి ముక్తినొందిన మాతృదేశానికి ప్రణమిస్తూ మనం సాధించిన ప్రగతిని సమీక్షించుకుందాం, సంబరాలు జరుపుకొందాం.

ప్రగతిపథంలో ఏడున్నర దశాబ్దాల భారత్ ప్రయాణం భారతీయుల దృఢసంకల్పానికి ప్రతీకగా నిలుస్తుంది. దూరదృష్టి గల నాయకుల మార్గనిర్దేశంలో ప్రజాస్వామ్య స్ఫూర్తితో వివిధ రంగాలలో అద్భుతమైన మైలురాళ్లను సాధించాం. ఎప్పటికప్పుడు సామాజిక, సాంకేతిక, ఆర్థిక సంస్కరణలతో పురోగమన దిశలోనే పయనించాం.

సమానత్వం, సామాజిక న్యాయం, ప్రాథమిక హక్కులు రాజ్యాంగ సూత్రాలుగా పొందుపరుచుకున్నాం. మొదటి ఎన్నికలలోనే సార్వత్రిక ఓటునిచ్చిన అతితక్కువ దేశాలలో ఒకటిగా మన స్థానం ప్రశంసనీయం. అది సామాన్య మానవుని సాధికారతకు చిహ్నమై నిలిచింది.

అమానుషమైన అంటరానితనాన్ని దాదాపుగా నిర్మూలించడం స్వతంత్ర భారతదేశం సాధించిన అతిపెద్ద విజయం. బాల్యవివాహాలను దాదాపుగా రూపుమాపాం. అక్షరాస్యతను పెంపొందించాం, వితంతు వివాహాలను ప్రోత్సహించాం. మహిళా సాధికారత స్వతంత్ర భారతం సాధించిన ప్రగతికి సూచిక అయ్యింది. సాంకేతిక రంగంలో కల్పనా చావ్లా, క్రీడా రంగంలో సానియా మీర్జా, కళా రంగంలో అమృతా షేర్గిల్, యామినీ కృష్ణమూర్తి, రాజకీయ రంగంలో ఇందిరా గాంధీ, ప్రతిభా పాటిల్, ద్రౌపది ముర్ము వంటి ఎందరో మహిళామణులు భారతీయ మహిళా శక్తికి ప్రతిరూపంగా నిలిచారు.

'జాతీయ ఆరోగ్య మిషన్' తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, టీకాలను ప్రోత్సహించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నది. పోలియో వంటి వ్యాధులను నిర్మూలించడంలో భారతదేశం చేస్తున్న కృషి ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలనందుకున్నది. రెండు దశాబ్దాల క్రితం తెలుగునాట ఆవిర్భవించిన 'ఆరోగ్యశ్రీ' పథకం నేడు 'ఆయుష్మాన్ భారత్' పథకానికి ఆదర్శమై నిలిచింది. అది మనందరం గర్వించ దగిన విషయం.

ఎన్నో ప్రపంచ విశ్వవిద్యాలయాలలో పనిచేసిన అనుభవంతో చెబుతున్నమాట: మన విద్యారంగం స్వతంత్ర భారతానికి మకుటాయమానం. మనవారు లేకుంటే సంపన్న దేశాల విశ్వవిద్యాలయాలూ, వ్యాపార సంస్థలూ స్తంభించిపోతాయంటే వాస్తవ దూరం కాదు. అమెరికాలో మనవారు కనిపించని గొప్ప విశ్వవిద్యాలయాలూ లేవు, పెద్ద వ్యాపార సంస్థలూ లేవు. ఐఐటీలు, ఎన్ఐటీలు, సిల్వర్ జూబిలీ ఇనిస్టిట్యూట్‌లు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు మన దూర దృష్టికి తార్కాణాలు. ఇంతగా అభివర్ధిస్తున్న మన విద్యారంగానికి చీకటికోణాలు లేకపోలేదు. మూడు సంవత్సరాల ముద్దు బాలలను మోయలేని సంచులతో ఇంటి నుండి తరమడం అత్యంత శోచనీయం. అవసరం లేని విషయాలను బలవంతంగా కంఠస్థం చేయించడం అమానుషమంటే అతిశయోక్తి కాదు.

స్వాతంత్ర్యం వచ్చేనాటికి భారతదేశ ఆర్థిక పరిస్థితి దుర్భరంగా ఉండేది. స్వతంత్ర భారతం పారిశ్రామికీకరణకూ, వ్యవసాయ సంస్కరణలకూ శ్రీకారం చుట్టి స్వయం సమృద్ధిని లక్ష్యంగా చేసుకుని ఆర్థిక ప్రగతికి నాంది పలికింది. ఆధునిక దేవాలయాలుగా పిలువదగ్గ భాక్రా నంగల్ వంటి ప్రాజెక్టులు, భిలాయ్ ఉక్కు కర్మాగారం వంటి వాటితో ప్రగతిమార్గంలో అడుగులు వేసింది. 1960వ దశకంలో ప్రారంభమైన 'హరిత విప్లవం' ఆహార కొరత ఎదుర్కొన్న దశను దాటించి దేశాన్ని మిగులు ఉత్పత్తి దేశంగా మార్చింది.



సాంకేతిక ఆవిష్కరణలలో భారతదేశం పురోగతి అంతర్జాతీయ మన్ననలను పొందినది. 1969లో స్థాపించిన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) అంతరిక్ష పరిశోధనలో అద్భుత విజయాలకు మార్గం సుగమం చేసింది. నాటి 'ఆర్యభట్ట' నుండి నేటి 'చంద్రయాన్' వరకు అంతరిక్షంలో మన విజయ పరంపర కొనసాగుతున్నది.

1990 దశకంలో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు, మొదటినుంచీ విద్యారంగానికిచ్చిన ప్రాముఖ్యత, సహజ సిద్ధంగా గణితశాస్త్రంలో మనవారికున్న ప్రతిభ సాఫ్ట్‌వేర్ రంగంలో భారతదేశానికి తిరుగులేని స్థానం తెచ్చాయి. ఈ నేపథ్యంలో ఒకప్పుడు చెన్నై, హైదరాబాద్ నగరాలకన్నా చిన్నదైన బెంగళూరు వాటికన్నా పెద్దదై భారతదేశ సిలికాన్ వ్యాలీగా తయారయ్యింది. సైబరాబాద్ ఆవిర్భావంతో హైదరాబాద్ సైతం విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తున్నది. 'ఏ దేశమేగినా ఎందు కాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని' అన్నారు రాయప్రోలు. ఐతే, సాఫ్ట్‌వేర్ రంగంలో మనవారి నేర్పు, ప్రముఖ విశ్వవిద్యాలయాలలో, పెద్దపెద్ద వ్యాపార సంస్థలలో మన వారి నాయకత్వం విదేశీయులే మన భూమి భారతిని పొగిడేటట్లు చేసినవి.

ఇక నేడు మన దేశం ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి ఆలోచిస్తే, ఆర్థిక అసమానత, వాతావరణ కాలుష్యం, వ్యవస్థీకృత రంగంలో మహిళల భాగస్వామ్యం తగినంత లేకపోవడం, ఎన్నికలలో డబ్బు ప్రభావం ముఖ్యమైనవి. వీటిని త్వరలోనే దేశం అధిగమిస్తుందని ఆశిద్దాం. సమసమాజ నిర్మాణమే ధ్యేయంగా, సకల జనుల సౌభాగ్యమే లక్ష్యంగా ముందుకు సాగుదాం.

వ్యాసకర్త ప్రొఫెసర్; గాయత్రీ విద్యా పరిషద్, వైజాగ్ । 93924 81282

పోలీసింగ్‌లో సంస్కరణలు తీసుకొచ్చాం

ప్రొబేషనరీ ఐఏఎస్‌లతో డీజీపీ అంజనీకుమార్



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రం ఏర్పడిన తర్వాత పోలీస్‌ శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చినట్టు డీజీపీ అంజనీ కుమార్‌ తెలిపారు. తెలంగాణ కేడర్‌కు చెందిన నలుగురు ప్రొబేషనరీ ఐఏఎస్‌ అధికారులతో డీజీపీ సోమవారం తన కార్యాలయంలో సమావేశమయ్యారు. పోలీసింగ్‌ తీసుకొచ్చిన ఉత్తమ విధానాలు, ఫ్రెండ్లీ పోలీసింగ్‌, నేర నియంత్రణ, కేసుల దర్యాప్తులో సాంకేతికత వినియోగం, పోలీసుల క్షేత్రస్థాయి విధుల్లో తీసుకొచ్చిన మార్పులను ఆయన ఈ సందర్భంగా వారికి చెప్పారు. సంక్షేమ కార్యక్రమాల్లో ఇతర ప్రభుత్వ విభాగాలతో కలిసి పోలీసుల సమన్వయం, పోలీస్‌ సిబ్బంది సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలేమిటో వివరించారు. డీజీపీతో సమావేశమైన వారిలో ప్రొబేషనరీ అధికారులు రాధికగుప్తా, డా.పి శ్రీజ, ఫైజన్‌అహ్మద్‌, పి.గౌతమి, పింకేశ్‌ కుమార్‌, లెనిన్‌ వత్సల్‌తొప్పో, శివేంద్రప్రతాప్‌, సంచిత్‌ గంగ్వార్‌ ఉన్నారు.

అవార్డు గ్రహీతలను అభినందించిన డీజీపీ

రెండురోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యూనియన్‌ హోం మినిస్టర్స్‌ మెడల్‌ ఫర్‌ ఎక్సలెన్స్‌ అందుకున్న పోలీస్‌ అధికారులను డీజీపీ అంజనీకుమార్‌ సోమవారం తన కార్యాలయంలో సత్కరించారు. అవార్డులు పొందిన అడిషనల్‌ ఎస్పీ ఎం.తిరుపతన్న, డీఎస్పీలు ఆర్‌. సత్యనారాయణరాజు, ఎం. జితేందర్‌రెడ్డి, కేఎం.కిరణ్‌కుమార్‌, బి.శ్రీనివాసరావు ఉన్నారు. అధికారుల సత్కార కార్యక్రమంలో అడిషనల్‌ డీజీలు శివధర్‌రెడ్డి, మహేశ్‌భగవత్‌, ఐజీలు తరుణ్‌జోషి, చంద్రశేఖర్‌రెడ్డి, షానవాజ్‌ ఖాసి, రమేశ్‌రెడ్డిలు ఉన్నారు. కేంద్ర హోంశాఖ వెల్లడించిన రాష్ట్రపతి విశిష్ట సేవాపోలీస్‌, ప్రతిభాపోలీస్‌, పోలీస్‌ శౌర్యపతకాలకు ఎంపికైన అధికారులు, సిబ్బందిని డీజీపీ అభినందించారు. ఈ మేరకు డీజీపీ కార్యాలయంలో ఓ ప్రకటన విడుదల చేసింది.

అడిషనల్‌ డీజీ విజయ్‌కుమార్‌కు ప్రెసిడెంట్‌ పోలీస్‌ మెడల్‌

- ఉత్తమ సేవలకుగాను సంగారెడ్డి ఎస్పీ రమణకుమార్‌కు కూడా...
- మరో 32 మందికి పోలీస్‌ శౌర్య, ఉత్తమ పోలీస్‌ సేవా పతకాలు
- స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రకటించిన కేంద్ర హోంశాఖ

సాక్షి, హైదరాబాద్‌ / న్యూఢిల్లీ: పోలీస్‌శాఖలో విశిష్ట సేవలకుగాను సీనియర్‌ ఐపీఎస్‌ అధికారి గ్రేహౌండ్స్‌, ఆక్టోపస్‌ ఆపరేషన్స్‌ అడిషనల్‌ డీజీ విజయ్‌కుమార్‌, సంగారెడ్డి ఎస్పీ మదాడి రమణకుమార్‌లకు కేంద్ర ప్రభుత్వ అత్యుత్తమ పోలీస్‌ పతకాలు దక్కాయి. ఈ ఇద్దరు అధికారులకు రాష్ట్రపతి విశిష్ట సేవా పోలీస్‌ పతకం (ప్రెసిడెంట్‌ పోలీస్‌ మెడల్‌ ఫర్‌ డిస్టింగ్విష్డ్‌ సర్వీస్‌) కేంద్ర హోంశాఖ ప్రకటించింది. 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా వివిధ విభాగాలకు చెందిన 954 మందికి పోలీస్‌ పతకాలు సోమవారం కేంద్ర హోంశాఖ ప్రకటించింది. వీటిలో ఒకరికి రాష్ట్రపతి పోలీస్‌ శౌర్యపతకం, 229 మందికి పోలీస్‌ శౌర్యపతకాలు, 82 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పోలీస్‌ పతకాలు, 642 మందికి ప్రతిభా పోలీస్‌ పతకాలు దక్కాయి.

విజయ్‌కుమార్‌ :

తెలంగాణ నుంచి జాతీయస్థాయిలో పోలీస్‌ పతకాలు దక్కిన వారిలో సీనియర్‌ ఐపీఎస్‌ అధికారి విజయ్‌కుమార్‌ 1997 బ్యాచ్‌ ఐపీఎస్‌కు చెందినవారు. ప్రస్తుతం గ్రేహౌండ్స్‌ అడిషనల్‌ డీజీగా విధులు నిర్వర్తిస్తున్న ఈయన గతంలో కేంద్ర ప్రభుత్వ డిప్యుటేషన్‌పై ఇంటెలిజెన్స్‌లో పదేళ్లపాటు పనిచేశారు. హైదరాబాద్‌ సిటీ, మాదాపూర్‌ డీసీపీగా, కడప, నల్లగొండ జిల్లాల ఎస్పీగా కూడా పనిచేశారు.

రమణకుమార్‌:

రాష్ట్రపతి విశిష్ట సేవా పోలీస్‌ పతకం దక్కిన మరో అధికారి మదాడి రమణకుమార్‌ ప్రస్తుతం సంగారెడ్డి ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఆయన సుదీర్ఘకాలం పాటు ఏసీబీలో పనిచేశారు.

- కౌంటర్‌ ఇంటెలిజెన్స్‌ సెల్‌లో పనిచేస్తున్న ఎస్పీ భాస్కరన్‌కు పోలీస్‌ శౌర్య పతకం దక్కింది. భాస్కరన్‌ సహా మొత్తం 22 మందికి పోలీస్‌ శౌర్య పతకాలు(పోలీస్‌ మెడల్‌ ఫర్‌ గ్యాలెంట్రీ-పీఎంజీ) , ఉత్తమ ప్రతిభా పోలీస్‌ పతకాలు (పోలీస్‌ మెడల్‌ ఫర్‌ మెరిటోరియస్‌ సర్వీస్‌) పది మందికి దక్కాయి.

నలుగురు జైలు అధికారులకు కూడా...

నలుగురు జైలు అధికారులకు కూడా పతకాలు లభించాయి. డిప్యూటీ సూపరింటెండెంట్‌ గౌరి రామచంద్రన్‌, డిప్యూటీ జైలర్‌ చెరుకూరి విజయ, అసిస్టెంట్‌ డిప్యూటీ జైలర్‌ సీ.హెచ్‌.కైలాశ్‌, హెడ్‌వార్డర్‌ జి.మల్లారెడ్డిలు ప్రతిభా పతకాలకు ఎంపికయ్యారు.

- జహీరాబాద్‌ ఫైర్‌స్టేషన్‌కు చెందిన లీడింగ్‌ ఫైర్‌మ్యాన్‌ శ్రీనివాస్‌కు ఫైర్‌ సర్వీస్‌ ప్రతిభా పురస్కారం దక్కింది.
- హోంగార్డులు కె.సుందర్‌లాల్‌, చీర్ల కృష్ణ సాగర్‌లకు హోమ్‌గార్డ్స్‌ - సివిల్‌ డిఫెన్స్‌ పతకాలను కేంద్ర హోంశాఖ ప్రకటించింది. వీరిద్దరూ బీచ్‌పల్లి వద్ద కృష్ణా నదిలో కొట్టుకుపోతున్న తల్లి, ఇద్దరు పిల్లలను రక్షించడంతో ఈ అవార్డుకు ఎంపిక చేశారు.

పోలీసు శౌర్య పతకాలకు ఎంపికైంది వీరే

ఆర్‌.భాస్కరన్‌	ఎస్పీ, కౌంటర్‌ ఇంటెలిజెన్స్‌
జి.రమేశ్‌	డిప్యూటీ అసాల్ట్‌ కమాండర్‌, గ్రేహౌండ్స్‌
దివంగత బి.సుశీల్‌	జూనియర్‌ కమాండో, గ్రేహౌండ్స్‌
టి.మహేశ్‌	అసిస్టెంట్‌ అసాల్ట్‌ కమాండ్‌ గ్రేహౌండ్స్‌
షేక్‌ నాగుల్‌మీరా	అసిస్టెంట్‌ అసాల్ట్‌ కమాండ్‌, గ్రేహౌండ్స్‌
కె.ఆదినారాయణ	సీనియర్‌ కమాండో, గ్రేహౌండ్స్‌
ఆర్‌.సునీల్‌కుమార్‌	జూనియర్‌ కమాండో, గ్రేహౌండ్స్‌
హెచ్‌.సుకుమార్‌	జూనియర్‌ కమాండో, గ్రేహౌండ్స్‌
ఎం.కళ్యాణ్‌కుమార్‌	జూనియర్‌ కమాండో, గ్రేహౌండ్స్‌
జి.శ్రీధర్‌	జూనియర్‌ కమాండో, గ్రేహౌండ్స్‌
సీహెచ్‌.రవీంద్రబాబు	జూనియర్‌ కమాండో, గ్రేహౌండ్స్‌
రాథోడ్‌ రమేశ్‌	జూనియర్‌ కమాండో, గ్రేహౌండ్స్‌
కె.పురుషోత్తమ్‌రెడ్డి	ఇన్‌స్పెక్టర్‌, ఎస్‌ఐబీ (ప్రస్తుతం డీఎస్పీగా పనిచేస్తున్నారు)
తీగల మహేందర్‌రావు	హెడ్‌కానిస్టేబుల్‌, ఎస్‌ఐబీ
కగితోజు శివప్రసాద్‌	ఇన్‌స్పెక్టర్‌, జయశంకర్‌భూపాలపల్లి
బండారి కుమార్‌	ఎస్‌ఐ, జయశంకర్‌భూపాలపల్లి
బక్కెర శివకుమార్‌	హెడ్‌కానిస్టేబుల్‌, జయశంకర్‌ భూపాలపల్లి
కె.అశోక్‌	సీనియర్‌ కమాండో
కె.సందీప్‌కుమార్‌	జూనియర్‌ కమాండో
ఎం.కార్తీక్‌	జూనియర్‌ కమాండో
వి.మధు	జూనియర్‌ కమాండో
సీహెచ్‌.సంపత్‌	జూనియర్‌ కమాండో

ఉత్తమ ప్రతిభా పోలీస్‌ పతకాలకు ఎంపికైన మన అధికారులు

సాయిన వెంకటేశ్వర్లు	ఏఎస్‌ఐ (హైదరాబాద్‌)
బండి వెంకటేశ్వరరెడ్డి	అడిషనల్‌ ఎస్పీ (ఖైరతాబాద్‌)
కొమిశెట్టి రామకృష్ణ ప్రసాద్‌రావు,	అడిషనల్‌ ఎస్పీ(అడ్మిన్‌)
ఆత్మకూరు వెంకటేశ్వర్లు,	అడిషనల్‌ ఎస్పీ(స్క్వాడ్రన్‌ కమాండర్‌)
అందోజు సత్యనారాయణ	అసిస్టెంట్‌ రిజర్వ్‌ సబ్‌ఇన్‌స్పెక్టర్‌
కాశెర్ల శ్రీనివాస్‌	ఏఎస్‌ఐ(వరంగల్‌)
అజెల్ల శ్రీనివాసరావు	ఆర్‌ఐ (రంగారెడ్డి)
రసముని వెంకటయ్య	సీనియర్‌ కమాండో, గ్రేహౌండ్స్‌
అరవెట్టి భానుప్రసాద్‌రావు	ఇన్‌స్పెక్టర్‌ (హైదరాబాద్‌)
మహంకాళి మధు	అసిస్టెంట్‌ రిజర్వ్‌ సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ (హైదరాబాద్‌)

పంద్రాగస్టు వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన సీఎస్‌



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎస్‌ శాంతికుమారి

గోల్కొండ: గోల్కొండ కోటలో జరుగుతున్న పంద్రాగస్టు వేడుకల ఏర్పాట్లను సీఎస్‌ శాంతికుమారి సోమవారం పరిశీలించారు. ముందుగా ఆమె ముఖ్యమంత్రి పతాకావిష్కరణ చేసే వేదికను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. మరోవైపు మంత్రులు, ఇతర వీఐపీల కోసం ఏర్పాటు చేసిన గ్యాలరీలను పరిశీలించారు. ముఖ్యమంత్రి కోటలో పతాకావిష్కరణ వేదికకు వచ్చే రూట్‌మ్యాప్‌ను కూడా చూశారు. అనంతరం పలువురు పోలీసు అధికారులతో మాట్లాడారు. కాగా, మంగళవారం జరిగే పతాకావిష్కరణ వేడుకలకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఇందుకు వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

సమర్థవంతంగా జువెనైల్‌ జస్టిస్‌

- జువెనైల్‌ జస్టిస్‌ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించిన జస్టిస్‌ శ్యామ్‌ కోషి
- హాజరైన జస్టిస్‌ అభినంద్‌కుమార్‌ షావిలీ, జస్టిస్‌ వినోద్‌కుమార్‌



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జస్టిస్‌ శ్యామ్‌ కోషి. చిత్రంలో జస్టిస్‌ అభినంద్‌కుమార్‌ షావిలీ, జస్టిస్‌ వినోద్‌కుమార్‌, హోళికేరి తదితరులు

సాక్షి, హైదరాబాద్‌: పిల్లల సంరక్షణ, పునరావాసం కోసం జువెనైల్‌ జస్టిస్‌ చట్టాలను సమర్థవంతంగా అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం, యూనిసెఫ్‌ పలు చర్యలు తీసుకుంటున్నాయని తెలంగాణ లీగల్‌ సర్వీసెస్‌ అథారిటీ ఎగ్జిక్యూటివ్‌ చైర్మన్‌, న్యాయమూర్తి జస్టిస్‌ శ్యామ్‌ కోషి పేర్కొన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని.. వారి అభివృద్ధే సమాజ ప్రగతి అన్నారు. లీగల్‌ సర్వీసెస్‌ అథారిటీ, జ్యుడీషియల్‌ అకాడమీ సంయుక్తంగా ఇలాంటి అవగాహన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు. జువెనైల్‌ జస్టిస్‌పై రాష్ట్ర జ్యుడీషియల్‌ అకాడమీలో ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ శ్యామ్‌ కోషి, తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్‌ అకాడమీ అధ్యక్షుడు, న్యాయమూర్తి జస్టిస్‌ అభినంద్‌కుమార్‌ షావిలీ, జ్యువెనైల్‌ జస్టిస్‌ బోర్డు చైర్మన్‌, న్యాయమూర్తి జస్టిస్‌ టి.వినోద్‌కుమార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్‌ శ్యామ్‌ కోషి మాట్లాడారు. పాఠశాలల్లో, నివాస ప్రాంతాల్లో ఆట స్థలాలను ఏర్పాటు చేయాలని, పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించాలని జస్టిస్‌ అభినంద్‌కుమార్‌ షావిలీ ఉద్ఘాటించారు. బాల నేరస్తులను సంస్కరించడం, పునరావాసం కల్పించడం లాంటి అంశాలను చట్టంలో పొందుపరిచారని జస్టిస్‌ వినోద్‌కుమార్‌ పేర్కొన్నారు. జువెనైల్‌కు న్యాయ సేవలను అందించడంలో లీగల్‌ సర్వీసెస్‌ అథారిటీ కీలక పాత్ర పోషిస్తుందని తెలంగాణ స్టేట్‌ లీగల్‌ సర్వీసెస్‌ అథారిటీ మెంబర్‌ సెక్రటరీ ఎస్‌.గోవర్ధన్‌రెడ్డి వివరించారు. జువెనైల్‌ జస్టిస్‌ బలోపేతానికి ఈ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి భారతి హోళికేరి తదితరులు పాల్గొన్నారు.

స్టే ఎత్తివేసి టీచర్ల బదిలీలకు అనుమతించండి


హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం వినతి

సాక్షి, హైదరాబాద్‌: 'దంపతులిద్దరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులైతే ఒకేచోట లేదా స్వల్ప దూరంలో పనిచేసేలా నిబంధనల్లో మార్పులు చేశాం. బదిలీల సమయంలో వారికి ప్రత్యేక పాయింట్లు ఇచ్చాం. ఈ మార్పులను అసెంబ్లీ, కోర్టు ముందు ఉంచాం. ఈ పిటిషన్లకు చెందిన న్యాయవాదులకు కూడా మెమో ద్వారా కాపీ అందించాం. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని ఉపాధ్యాయ బదిలీలపై గతంలో ఇచ్చిన స్టేను ఎత్తివేయండి. బదిలీలు వెంటనే చేపట్టే అవకాశం ఇవ్వండి'అని హైకోర్టును రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి జారీ చేసిన జీవో నంబర్‌ 9 చట్టవ్యతిరేకమని, రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌ మండలం ఖేల్‌కట్టకు చెందిన సక్కుబాయితోపాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేసిన విషయం తెలిసిందే. జీవో నంబర్‌ 5ను కూడా సవాల్‌ చేస్తూ మరో పిటిషన్‌ దాఖలైంది. ఇలా పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ జీవోలను కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై ప్రధానన్యాయమూర్తి జస్టిస్‌ అలోక్‌ అరాధే, జస్టిస్‌ వినోద్‌ కుమార్‌ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున ఏఏజీ రామచందర్‌రావు వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం తది వాదనల కోసం విచారణను వాయిదా వేసింది.

క్లుప్తంగా...

చంద్రయాన్‌-3కి నాలుగోసారి కక్ష్య తగ్గింపు

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) గత నెల 14న ప్రయోగించిన చంద్రయాన్‌-3 మిషన్‌ లూనార్‌ ఆర్బిట్‌ (చంద్రుడి కక్ష్య)లో చంద్రుడికి దగ్గరగా 177 కిలోమీటర్లు, దూరంగా 150 కిలోమీటర్ల ఎత్తులోకి చేరుకుంది. దీర్ఘ వృత్తాకార కక్ష్యలో తిరుగుతున్న చంద్రయాన్‌-3 మిషన్‌కు నాలుగోసారి సోమవారం మధ్యాహ్నం కక్ష్య దూరాన్ని తగ్గించే ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. కక్ష్య దూరాన్ని వంద కిలోమీటర్లకు తగ్గించే ప్రక్రియను ఈనెల 17న చేపట్టనున్నారు. అయితే రష్యా ప్రయోగించిన లూనా–25 అనే మిషన్‌ చంద్రుడిపైన దిగింది. చంద్రుని ఉపరితలంపై ఈ నెల 23న దక్షిణ ధృవంలో దిగబోయే మొట్టమొదటి మిషన్‌ చంద్రయాన్‌–3దేపై చేయి అవుతుంది.



సెప్టెంబర్‌లో ఆదిత్య-ఎల్‌1 ప్రయోగం!

సూర్యుడిపై అధ్యయనం చేయనున్న ఇస్రో

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): చందమామపై పరిశోధనల కోసం చంద్రయాన్‌-3 మిషన్‌ను ప్రయోగించిన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఇక సూర్యుడిపై అధ్యయనం కోసం ఏర్పాట్లు చేస్తోంది. ఆదిత్య-ఎల్‌1 పేరిట అంతరిక్ష నౌకను ప్రయోగించనుంది. సెప్టెంబర్‌ మొదటివారంలో ప్రయోగం ఉటుందని ఇస్రో సోమవారం వెల్లడించింది. ఆదిత్య-ఎల్‌1 స్పేస్‌ క్రాఫ్ట్‌ బెంగళూరులోని యూఆర్‌ రావు శాటిలైట్‌ సెంటర్‌ నుంచి శ్రీహరి కోటలో ఉన్న 'షార్‌'కు చేరుకుంది. షార్‌లోని రెండో ప్రయోగవేదిక నుంచి పీఎస్‌ఎల్‌వీ సీ57 రాకెట్‌ ద్వారా ఆదిత్య-ఎల్‌1 స్పేస్‌క్రాఫ్ట్‌ను ప్రయోగిస్తారు. ఇక్కడి వెహికల్‌ అసెంబ్లింగ్‌ బిల్డింగ్‌లో మూడు దశల రాకెట్‌ అనుసంధానం పనులు పూర్తి చేశారు. ఆదిత్య-ఎల్‌1కు క్లీన్‌రూంలో పరీక్షల అనంతరం రాకెట్‌ శిఖరభాగంలో అమర్చుతారు. ప్రయోగం ద్వారా సూర్యుడు-భూమి వ్యవస్థలోని లాంగ్‌రేంజ్‌ పాయింట్‌ 1(ఎల్‌1) చుట్టూ ఉన్న కక్ష్యలోకి ప్రవేశపెడతారు. ఇది భూమికి 10.5 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడి నుంచి సూర్యుడిపై అధ్యయనానికి అడ్డంకులుండవని సైంటిస్టులు చెబుతున్నారు.



షిమ్లాలో కొండచరియలు పడకముందు శివాలయం(ఎడమ). పడ్డాక శిథిలాల కింద ముమ్మర గాలింపు దృశ్యం

హిమాచల్, ఉత్తరాఖండ్‌లో భీకర వర్షం

- విరిగిపడుతున్న కొండచరియలు
- కూలుతున్న ఇళ్లు
- హిమాచల్‌లో 51 మంది మృతి
- షిమ్లాలో శివాలయం ధ్వంసం
- ఏడుగురి సజీవ సమాధి
- చార్‌ధామ్‌ యాత్ర రెండు రోజులపాటు రద్దు

షిమ్లా/డెహ్రాడూన్‌: హిమాచల్‌ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌ రాష్ట్రాలను భీకర వర్షాలు ముంచెత్తుతున్నాయి. కొంచరియలు విరిగిపడుతుండడంపై పలు రహదారులపై రాకపోకలు నిలిచిపోయాయి. ఇళ్లు సైతం కూలిపోతున్నాయి. హిమాచల్‌ ప్రదేశ్‌లో ఆదివారం సాయంత్రం మొదలైన వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నాయి. వర్షాలు, కొండచరియల ధాటికి రాష్ట్రంలో కనీసం 51 మంది మరణించారని అధికారులు సోమవారం ప్రకటించారు. వీరిలో ఏడుగురు రాజధాని షిమ్లాలోని సమ్మర్‌ హిల్‌ ప్రాంతంలో శివాలయంపై కొండచరియలు విరిగిపడడంతో రాళ్ల కింద చిక్కుకొని సజీవ సమాధి అయ్యారని వెల్లడించారు. ఆలయం కూడా ధ్వంసమైంది. ఈ రాళ్ల కింద మరికొంత మంది ఉండొచ్చని భావిస్తున్నట్లు తెలిపారు. షిమ్లాలో ఈ శివాలయం ఎంతగానో ప్రసిద్ధిగాంచింది. నిత్యం పద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అలాగే షిమ్లాలోని ఫగ్లీ ప్రాంతంలో కొండచరియల వల్ల ఐదుగురు మరణించారు. ఇక్కడ శిథిలాల కింద చిక్కుకున్న 17 మందిని అధికారులు రక్షించారు. అంతేకాకుండా చాలా ఇళ్లు బురదలో కూరుకుపోయాయి. వర్షాల కారణంగా హిమాచల్‌ ప్రదేశ్‌లో సోమవారం కాలేజీలు, స్కూళ్లకు సెలవు ప్రకటించారు. ముందుజాగ్రత్తగా 752 రహదారులపై రాకపోకలను నిలిపివేశారు. సైన్యంతోపాటు ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్డీఆర్‌ఎఫ్, ఐటీబీపీ సిబ్బంది, రాష్ట్ర పోలీసులు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. రాష్ట్రంలో అత్యధికంగా కాంగ్రాలో 273 మిల్లీమీటర్లు, ధర్మశాలలో 250 మిల్లీమీటర్లు, సుందర్‌నగర్‌లో 168 మిల్లీమీటర్లు, మండీలో 140 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో 12 జిల్లాలకుగాను 9 జిల్లాల్లో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఎల్లో అలర్ట్‌ జారీ చేసింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.



ప్రవాహంలో కూలిపోతున్న ప్రైవేట్‌ డిఫెన్స్‌ శిక్షణకేంద్రం



మట్టి కొట్టుకుపోయి గాల్లో వేలాడుతున్న షిమ్లా-కల్కా హెరిటేజ్‌ రైల్వే ట్రాక్‌

అమిత్‌ షా దిగ్భ్రాంతి

షిమ్లాలో కొండచరియలు విరిగిపడడం వల్ల ధ్వంసమైన శివాలయాన్ని ముఖ్యమంత్రి సుఖ్వీందర్‌సింగ్‌ సుఖూ సందర్శించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని క్షేమంగా బయటకు తీసుకురావడానికి సహాయక చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. హిమాచల్‌ ప్రదేశ్‌లో వర్షాల వల్ల పెద్ద సంఖ్యలో జనం మరణించడం పట్ల కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌ షా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఎన్డీఆర్‌ఎఫ్‌ అధికారులను ఆదేశించారు.

కేదార్‌నాథ్‌కు రాకపోకలు బంద్‌

ఎడతెరిపిలేని భారీ వర్షాలతో ఉత్తరాఖండ్‌ రాష్ట్రం చిగురుటాకులా వణికిపోతోంది. కొండచరియలు విరిగి పడడంతో పలు ఇళ్లు నేలకూలాయి. రహదారులు దెబ్బతిన్నాయి. వర్షాల ధాటికి రాజధాని డెహ్రాడూన్‌ సమీపంలోని ప్రైవేట్‌ డిఫెన్స్‌ ట్రైనింగ్‌ సెంటర్‌ ధ్వంసమైంది. వర్ష బీభత్సం వల్ల రాష్ట్రంలో నలుగురు మరణించారు. మరో 10 మంది గల్లంతయ్యారు. పలుచోట్ల జాతీయ రహదారులు ధ్వంసం కావడంతో ప్రఖ్యాత పుణ్యక్షేత్రాలైన బద్రీనాథ్, కేదార్‌నాథ్, గంగోత్రికి రాకపోకలు నిలిచిపోయాయి. చార్‌దామ్‌ యాత్రను రెండు రోజుల పాటు రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఫలితంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాహనాలు కొట్టుకుపోయాయి. రుద్రప్రయాగ్, దేవప్రయాగ్, రిషికేశ్‌లో అలకనంద, మందాకినీ, గంగా నదులు ప్రమాదకర స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. రిషికేశ్‌లో 435 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఆండ్రాయిడ్‌ ఆపరేటింగ్‌ సిస్టంలో చాలా లోపాలు

ఇండియన్‌ కంప్యూటర్‌ ఎమర్జెన్సీ టీమ్‌ హెచ్చరిక

న్యూఢిల్లీ: ఆండ్రాయిడ్‌ ఆపరేటింగ్‌ సిస్టంలో చాలా లోపాలున్నాయని కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇండియన్‌ కంప్యూటర్‌ ఎమర్జెన్సీ టీమ్‌ పేర్కొంది. ఆండ్రాయిడ్‌- 13 సహా పలు వెర్షన్లు వైరస్‌ల బారిన పడే ప్రమాదం చాలా ఉందని ఆందోళన వెలిబుచ్చింది. వాటి వినియోగంలో జాగ్రత్తగా ఉండాలంటూ యూజర్లకు సోమవారం 'అతి తీవ్ర' హెచ్చరికలు జారీ చేసింది. లేదంటే మొబైల్స్‌ తదితరాల్లో సున్నిత సమాచారం హాకర్ల బారిన పడే ప్రమాదం పొంచి ఉందని వివరించింది. ఆండ్రాయిడ్‌ 10, 11, 12, 12ఎల్, 13 వెర్షన్లలో వీటిని ప్రధానంగా గమనించినట్టు చెప్పింది. వీటివల్ల ఫ్రేంవర్క్, ఆండ్రాయిడ్‌ రన్‌ టైం, సిస్టం కంపోనెంట్, గూగుల్‌ ప్లే సిస్టమ్‌ అప్డేట్స్, కెర్నల్, ఆర్మ్‌ కంపోనెంట్స్, మీడియా టీ కంపోనెంట్, కలోకాం క్లోజ్డ్‌ సోర్స్‌ కంపోనెంట్స్‌ వంటివాటి పనితీరు లోపభూయిష్టంగా మారుతుందని వివరించింది.

అప్‌డేషన్‌ ఇలా...

ఆండ్రాయిడ్‌ ఆధారిత డివైస్‌ల భద్రత కోసం లేటెస్ట్‌ సెక్యూరిటీ ప్యాచెస్‌కు తక్షణం అప్డేట్‌ చేసుకోవాలని సూచించింది. ఇందుకు డివైస్‌ సెట్టింగ్స్‌లోకి వెళ్లి సిస్టమ్‌పై క్లిక్‌ చేయాలి..సిస్టమ్‌ అప్‌ డేట్స్‌పై క్లిక్‌ చేయండి. అప్డేట్స్‌ ఉంటే డౌన్‌ లోడ్‌ చేసుకోండి.

కుజునిపై జీవముండేదా?

- ఉపరితలంపై పురాతన పగుళ్లు
- భూమిపై జీవం పుట్టుకలో అవే కీలకం




కుజ గ్రహం మీద పరిశోధనల కోసం అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా పంపిన క్యూరియాసిటీ రోవర్‌ తాజాగా కీలకమైన విశేషాలను సేకరించింది. కుజుని ఉపరితలంపై పురాతన పగుళ్లను కనిపెట్టింది. ఇప్పటికీ ఏ మాత్రం చెక్కు చెదరకుండా ఉన్న ఆ పగుళ్లను ఫొటోలు, వీడియోలు తీసి భూమికి పంపింది. వాటిని చూసి సైంటిస్టులే ఆశ్చర్యపోతున్నారు. ఒకదాని తరువాత ఒకటిగా వచ్చి పోయే తడి, పొడి ఆవర్తనాలకు సూచికలైన ఈ తరహా పగుళ్ల జీవం పుట్టుకకు అత్యంత అనుకూలమని చెబుతారు.

..ఎండా, వానా కాలాలు

కుజ గ్రహంపై అత్యంత పురాతన కాలం నాటి బురదమయమైన పగుళ్లను క్యూరియాసిటీ రోవర్‌ కనిపెట్టింది. షట్కోణాకృతిలోని ఆ పగుళ్ల ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉండటం విశేషం. వీటిని తొలినాటి కుజునిపై తడి, పొడి ఆవర్తనాల తాలూకు ఆనవాళ్లుగా భావిస్తున్నారు. జీవం పుట్టుకకు ఇవి అత్యంత కీలకమే గాక ఎంతో అనుకూలం కూడా. భూమిపై మాదిరిగా కుజునిపై క్రమానుగతంగా తడి, పొడి ఋతువులు, మరోలా చెప్పాలంటే వేసవి, వానాకాలాలు ఒకదాని తర్వాత ఒకటిగా వస్తూ పోతూ ఉండేవనేందుకు ఈ ఆవర్తనాలు నిదర్శనమని పరిశోధనకు సారథ్యం వహించిన విలియం రేపిన్‌ అభిప్రాయపడ్డారు. మట్టి పొర, లవణ ఖనిజాలతో సమృద్ధమైన వాటిపై పొరల మధ్య జోన్‌లో ఈ చక్రాలను కనిపెట్టారు. బురద ఎండిపోయినకొద్దీ కుంచించుకుపోయి, పగుళ్లిచ్చి టీ ఆకారపు జంక్షన్‌ మాదిరిగా ఏర్పడ్డాయి. పదేపదే నీరు పారిన మీదట వై ఆకృతిలోకి, అంతిమంగా షట్కోణాకృతిలోకి మారి గట్టిపడ్డాయి. భూమ్మీద మాదిరిగానే ఎండా, వానా కాలాలు క్రమం తప్పకుండా వచ్చేవని కచ్చితంగా చెప్పవచ్చని రేపిన్‌ చెప్పారు. 'పైగా భూమి మాదిరిగా కుజునిపై టెక్టానిక్‌ ఫలకాలు లేవు. కనుక ఆ గ్రహం తాలూకు పురాతన చరిత్ర సురక్షితంగా ఉంది'అని అన్నారు. ఈ పరిశోధన ఫలితాలను నేచర్‌ జర్నల్‌లో తాజాగా ప్రచురించారు.

– సాక్షి, నేషనల్‌ డెస్క్‌

> జీవం తాలూకు ఆనవాళ్లు ఇప్పటికీ ఇంత సురక్షితంగా ఉన్న కుజుని వంటి గ్రహం భూమికి ఇంత సమీపంగా ఉండటం ఒక రకంగా మన అదృష్టం. విశ్వ రహస్యాలను ఛేదించే క్రమంలో ఇదో పెద్ద ముందడుగు కాగలదు'
>
> – విలియం రేపిన్, పరిశోధన సారథి



క్యూరియాసిటీ రోవర్‌ పంపిన ఫొటోలో షట్కోణాకృతి పగుళ్లు కనిపిస్తున్న దృశ్యం

పాక్‌ ఆపద్ధర్మ ప్రధానిగా కకర్‌ ప్రమాణం

ఇస్లామాబాద్‌: పాకిస్తాన్‌ ఆపద్ధర్మ ప్రధానమంత్రిగా అన్వరుల్‌ హక్‌ కకర్‌(52) సోమవారం పదవీ ప్రమాణం చేశారు. సోమవారం అధ్యక్ష భవనంలో నిరాడంబరంగా జరిగిన కార్యక్రమంలో కకర్‌తో అధ్యక్షుడు ఆరిఫ్‌ అల్వీ ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ప్రధాని పదవి నుంచి వైదొలగిన షెహబాజ్‌ షరీఫ్‌ తదితరులు పాల్గొన్నారు. మరికొద్ది నెలల్లో జరగాల్సిన నేషనల్‌ అసెంబ్లీ(దిగువసభ) ఎన్నికలను నిష్పాక్షికంగా నిర్వహించడం, దేశాన్ని ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించడం కకర్‌ ముందున్న ప్రధాన లక్ష్యాలు. త్వరలోనే ఆయన తన మంత్రివర్గాన్ని ప్రకటించనున్నారు.

'నీట్‌' భయంతో చెన్నై విద్యార్థి ఆత్మహత్య

- కుమారుడి మరణాన్ని తట్టుకోలేక తండ్రి సైతం బలవన్మరణం
- విద్యార్థులకు 'నీట్‌' అవరోధంగా మారిందని సీఎం స్టాలిన్‌ ఆగ్రహం



చెన్నై: దేశవ్యాప్తంగా మెడికల్‌ కాలేజీల్లో ప్రవేశానికి ఉద్దేశించిన నేషనల్‌ ఎలిజిబిటీ-కమ్‌-ఎంట్రన్స్‌ టెస్ట్‌(నీట్‌) తమిళనాడులో అగ్గిరాజేస్తోంది. ఈ పరీక్షలో అర్హత సాధించలేనన్న భయంతో జగదీశ్వరన్‌ అనే 19 ఏళ్ల విద్యార్థి ఉరివేసుకున్నాడు. తనయుడి మరణాన్ని తట్టుకోలేక తండ్రి సెల్వశేఖర్‌(48) సైతం బలవన్మరణానికి పాల్పడ్డాడు. జగదీశ్వరన్‌ సీబీఎస్‌ఈ స్కూల్‌లో 2021లో ప్లస్‌ టూ పూర్తిచేశాడు. 500 మార్కులకు గాను 427 మార్కులు సాధించాడు. రెండుసార్లు 'నీట్‌' రాశాడు. అర్హత సాధించలేకపోయాడు. మూడోసారి పరీక్ష రాయడానికి సన్నద్ధమవుతున్నాడు. ఈసారి కూడా విఫలమవుతానన్న ఆందోళనతో శుక్రవారం చెన్నైలోని కురింజీలో తన ఇంట్లో ఉరివేసుకొని ప్రాణం విడిచాడు. కుమారుడి మృతిని తండ్రి సెల్వశేఖర్‌ జీర్ణించుకోలేపోయాడు. ఆదివారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకముందు మీడియాతో మాట్లాడాడు. విదేశాల్లో చదువుకోవాలని తన కుమారుడికి సూచించినా వినిపించుకోలేదని, ఇక్కడే మెడికల్‌ కాలేజీలో సీటు సంపాదిస్తానని చెప్పాడని, ఇంతలోనే ఘోరం జరిగిందని బోరుమన్నాడు. మన దేశంలో 'నీట్‌' వ్యవస్థ సరిగ్గా లేదని ఆరోపించాడు.

'నీట్‌'ను రద్దు చేస్తాం: స్టాలిన్‌

తండ్రికొడుకుల మృతి పట్ల తమిళనాడు సీఎం స్టాలిన్‌ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నీట్‌ను రద్దు చేస్తామని, ఈ దిశగా న్యాయ పోరాటం సాగిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులెవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. 'నీట్‌' నుంచి తమిళనాడును మినహాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేస్తూ రాష్ట్ర అసెంబ్లీలో గతంలోనే తీర్మానం చేశారు. ఇదిలా ఉండగా స్టాలిన్‌ సర్కారు తీసుకొచ్చిన యాంటీ-నీట్‌ బిల్లుపై సంతకం చేయబోనని గవర్నర్‌ రవి తేల్చిచెప్పారు. అలాగైతే పదవి నుంచి తప్పుకోవాలని స్టాలిన్‌ అన్నారు.

స్కూలు సిలబస్‌లో 'పోక్సో' చట్టం

- హైకోర్టుకు తెలిపిన కేరళ ప్రభుత్వం
- ఇప్పటికే 12 ఏళ్లు ఆలస్యమైందన్న న్యాయస్థానం

తిరువనంతపురం: పోక్సో చట్టాన్ని పాఠ్యాంశంగా తీసుకువచ్చేందుకు తాజాగా కేరళ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను రాష్ట్ర హైకోర్టు ప్రశంసించింది. పాఠశాల స్థాయి విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించడంలో ఇప్పటికే 12 ఏళ్లు ఆలస్యమైందని ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. ఈ చట్టంపై అవగాహన లేకపోవడంతోనే స్కూలు విద్యార్థులు, టీనేజర్లపై లైంగిక దాడులు జరుగుతున్నాయని పేర్కొంది. ఇటీవల ఓ పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్‌ బెచు కురియన్‌ థామస్‌ ఈ వ్యాఖ్యలు చేశారు. చిన్నారులు, ముఖ్యంగా టీనేజర్లపై లైంగిక నేరాలు ఇటీవల పెరిగి పోయాయని ఆయన అన్నారు. పోక్సో చట్టంలోని తీవ్రమైన శిక్షల గురించి తెలియకనే చాలా మంది విద్యార్థులు పరస్పరం లైంగిక సంబంధాలు పెట్టుకుంటున్నారన్నారు. పోక్సో చట్టంపై వారికి ఎలాంటి అవగాహన లేదన్నారు. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకుని రాజ్యాంగంలోని ఆర్టికల్‌ 226 ప్రకారం.. లైంగిక నేరాలు, వాటి పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు గాను పాఠశాల సిలబస్‌లో పోక్సో చట్టం చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని కేరళ రాష్ట్ర ప్రభుత్వం, సెంట్రల్‌ బోర్డ్‌ ఆఫ్‌ సెకండరీ ఎడ్యుకేషన్‌(సీబీఎస్‌ఈ), కేరళ రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. కేరళ రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర విద్యాశాఖ కలిసి బడికి వెళ్లే బాలల్లో లైంగిక నేరాలపై అవగాహన కల్పించేందుకు తీసుకుంటున్న చర్యలను హైకోర్టు ప్రశంసించింది.

జలుబుతో రక్తం గడ్డకట్టే ప్రమాదం?

న్యూఢిల్లీ: శ్వాస ప్రక్రియను ఇబ్బంది పెట్టే సాధారణ జలుబు ఒక్కోసారి రక్తాన్ని గడ్డకట్టేలా చేసే ప్రమాదకర వ్యాధికి దారి తీయగలదట! దీనివల్ల ప్లేట్లెట్లు తగ్గే ప్రమాదం సైతం ఉందని యూనివర్సిటీ ఆఫ్‌ నార్త్‌ కరోలినా స్కూల్‌ ఆఫ్‌ మెడిసిన్‌ చేసిన అధ్యయనంలో తేలింది. ముందుగానే గుర్తించిచర్యలు తీసుకునేందుకు తాజా ఫలితాలు దోహదపడతాయని అధ్యయన బృందం చెబుతోంది. ఈ పరిశోధన వివరాలు న్యూ ఇంగ్లాండ్‌ జర్నల్‌ ఆఫ్‌ మెడిసిన్‌లో పబ్లిష్‌ అయ్యాయి.

ఇథియోపియాలో వైమానిక దాడి.. 26 మంది మృతి

నైరోబీ: ఇథియోపియాలోని కల్లోలిత అంహారా ప్రాంతంలోని ఓ పట్టణ కూడలిలో జరిగిన వైమానిక దాడిలో 26 మంది చనిపోగా మరో 55 మంది గాయాలపాలయ్యారు. స్థానిక మిలీషియా మూకలను నిర్వీర్యం చేసేందుకు దేశ ఆర్మీ ప్రయత్నాలు చేస్తోంది. ఇదే క్రమంలో ఫినోట్‌ సెలామ్‌లోని కమ్యూనిటీ సెంటర్‌పై ఆదివారం ఉదయం వైమానిక దాడి జరిపింది.

ఇద్దరికి యావజ్జీవ కారాగారం

లఖీంపూర్‌ ఖేరి: దాదాపు ఏడాది క్రితం సంచలనం సృష్టించిన దళిత బాలికలపై గ్యాంగ్‌ రేప్, హత్య కేసులో దోషుల్లో ఇద్దరికి జీవిత ఖైదు, మరో ఇద్దరికి ఆరేళ్ల జైలు శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు సోమవారం తీర్పునిచ్చింది. 2022 సెప్టెంబర్‌ 14న నిఘాసన్‌ గ్రామంలో తోబుట్టువులు విగతజీవులై ఓ చెట్టుకు వేలాడుతూ కనిపించారు. దీనిపై సిట్‌ అధికారులు దర్యాప్తు జరిపి ఆరుగురిని అరెస్ట్‌ చేశారు. 2022 సెప్టెంబర్‌ 22న పోక్సో కోర్టులో చార్జిషీటు వేశారు. అదనపు జిల్లా జడ్జి రాహుల్‌ సింగ్‌ దోషుల్లో నలుగురిపై శుక్రవారం వివిధ నేరారోపణలను నిర్ధారించి, సోమవారం తీర్పును ప్రకటించారు. సునీల్, జునాయిద్‌ అనే వారికి జీవిత ఖైదుతోపాటు రూ.46 వేల జరిమానా విధించారు. కరీముద్దీన్, ఆరిఫ్‌ అనే వారికి ఆరేళ్ల కఠిన కారాగారంతోపాటు రూ.5 వేల చొప్పున జరిమానా విధించారు.

కశ్మీర్‌లో మూడంచెల భద్రత

న్యూఢిల్లీ/శ్రీనగర్‌: స్వాతంత్య్ర వేడుకలు ప్రశాంతంగా కొనసాగేందుకు కశ్మీర్‌లో మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఉత్సవాలు జరిగే బక్షీ స్టేడియంతోపాటు దాల్‌ సరస్సు పరిసరాల్లో జమ్మూకశ్మీర్‌ ప్రత్యేక పోలీసు బలగాలు, ఇతర భద్రతా సిబ్బంది సోమవారం కవాతు చేపట్టారు. 'స్వాతంత్య్ర వేడుకల రోజున ఇంటర్నెట్‌ సర్వీసులు యథా ప్రకారం కొనసాగుతాయి'అని అదనపు డీజీపీ విజయ్‌ పేర్కొన్నారు. కాగా, బారాముల్లా జిల్లా కనిస్పోరా వద్ద ఓ ఐఈడీని గుర్తించి, నిర్వీర్యం చేసినట్లు పోలీసులు తెలిపారు.

41 కెమెరాలతో ప్రసారభారతి లైవ్‌ కవరేజ్‌

స్వాతంత్య్ర వేడుకల ప్రత్యక్ష ప్రసారానికి ప్రభుత్వ రంగ ప్రసారభారతి అయిదు రోబోటిక్‌ కెమెరాలు సహా 41 కెమెరాలను వినియోగించనుంది. వేడుకలను దూరదర్శన్, ప్రాంతీయ చానెళ్లతోపాటు ఆల్‌ ఇండియా రేడియో జాతీయ చానళ్లన్నీ ప్రత్యక్ష ప్రసారం చేయనున్నాయి.



స్వాతంత్య్రదినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని రైసినాహిల్స్‌లో జెండా రంగుల విద్యుత్‌దీప వెలుగుల్లో వెలిగిపోతున్న భవనాలు

సామరస్య స్ఫూర్తిని పాటిద్దాం

- పౌరులంతా కలిసిమెలిసి జీవనం సాగించాలి
- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పిలుపు
- దేశ ప్రజలకు స్వాతంత్య్ర దినోత్సవ సందేశం

న్యూఢిల్లీ: విభిన్నమైన గుర్తింపులు ఉన్నప్పటికీ భారతీయులంతా సమాన అవకాశాలు, సమాన హక్కులు, సమాన విధులు ఉన్న సమాన పౌరులేనని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉద్ఘాటించారు. దేశ ప్రజలంతా ఒక్కటేనని స్పష్టం చేశారు. సామరస్యం, సౌభ్రాతృత్వ స్ఫూర్తితో కలిసిమెలిసి జీవనం సాగించాలని, ఉమ్మడిగా ముందుకు ప్రజలకు పిలుపునిచ్చారు. 77వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ముర్ము సోమవారం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. స్వాతంత్య్ర దినోత్సవ సందేశం ఇచ్చారు. ఆమె ఏం చెప్పారంటే..

జాతి నిర్మాతల కలలు సాకారం కావాలంటే..

''ప్రతి భారతీయుడికి కులం, మతం, జాతి, భాష, ప్రాంతం, కుటుంబం, వృత్తి తదితర గుర్తింపులు ఉంటుంది. వీటన్నింటికంటే మరో ముఖ్యమైన గుర్తింపు ఉంది. అదే 'భారతదేశ పౌరుడు'. దాన్ని మించిన గుర్తింపు మరొకటి లేదు. మనమంతా సమానమే. మన దేశం ప్రజాస్వామ్యానికి తల్లిలాంటిది. ప్రాచీన కాలం నుంచి చూసినా ఇక్కడ ప్రజాస్వామ్య వ్యవస్థలు బలంగా ఉన్నాయి. బ్రిటిష్‌ వలస పాలన ఆ విలువలను తుడిచిపెట్టేసింది. 1947 ఆగస్టు 15న భరతమాత స్వాతంత్య్రం పొందింది. అదొక నూతన ఉషోదయం. విదేశీ పాలన నుంచి మాత్రమే కాకుండా మన విధిరాతను తిరిగి రాసుకోవడానికి స్వాతంత్య్రం లభించింది. మన జాతి నిర్మాతల కలలు సాకారం కావాలంటే మనమంతా కలిసికట్టుగా ముందుకు నడవాలి. స్వాతంత్య్ర పోరాటంలో మహిళల పాత్ర మరువలేనిది. దేశాభివృద్ధిలో, ప్రజలకు సేవ లందించడంలో వారి భాగస్వామ్యం ప్రశంసనీయం. మహిళలు కచ్చితంగా ఆర్థిక సాధికారిత సాధించాలి'' అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వెల్లడించారు.

స్విచ్‌బోర్డ్‌లో రూ. 15 కోట్ల గోల్కొండ వజ్రం

కోల్‌కతా: సత్యజిత్‌ రే దర్శకత్వంలో 1979లో వచ్చిన 'జోయ్‌ బాబా ఫెలూనాథ్‌' అనే బెంగాలీ సినిమాలో అత్యంత ఖరీదైన వజ్రం దుర్గామాత అధిష్ఠించిన సింహం బొమ్మ నోటిలో చాలాకాలం తర్వాత దొరుకుతుంది. మిస్టరీ వీడిపోతుంది. అలాంటి సంఘటనే పశ్చిమ బెంగాల్‌ రాజధాని కోల్‌కతాలో జరిగింది. ఇక్కడ కరెంటు స్విచ్‌బోర్డులో రూ.15 కోట్ల విలువైన 32 క్యారెట్ల బరువైన గోల్కొండ వజ్రం దొరికింది. అసలు విషయమేమిటంటే.. ప్రణబ్‌ కుమార్‌ రాయ్‌ అనే వ్యక్తి వద్ద ఈ వజ్రం ఉండేది. 2002లో దాని నాణ్యత, ధర తెల్సుకునేందుకు ఇంద్రజిత్‌ తపాదార్‌ అనే వజ్రాల మధ్యవర్తిని సంప్రదించాడు. 2002 జూన్‌లో ఇంద్రజిత్‌ మరొకడిని తీసుకొని ప్రణబ్‌ ఇంటికి వచ్చాడు. వారిద్దరూ కలిసి ప్రణబ్‌ను పిస్టోల్‌తో బెదిరించి వజ్రంతో ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదులో పోలీసులు రంగంలోకి దిగారు. ఇంద్రజిత్‌ ఇంట్లో గాలింపు చేపట్టారు. వజ్రం ఆచూకీ దొరకలేదు. మరోవైపు తనకేమీ తెలియదని ఇంద్రజిత్‌ బుకాయించాడు. వజ్రం కచ్చితంగా అతడి ఇంట్లోనే ఉంటుందున్న నమ్మకంతో పోలీసులు అన్వేషణ కొనసాగించారు. అయినాదొరకలేదు. చిట్టచివరకు చాలా రోజుల తర్వాత అదే ఇంట్లో మెట్ల కింద కరెంటు స్విచ్‌బోర్డు లోపలున్న చిన్న సొరంగంలో వజ్రం లభ్యమైంది. నిందితుడు ఇంద్రజిత్‌కు ట్రయల్‌ కోర్టు రెండేళ్ల జైలుశిక్ష విధించింది. ఇంకోవైపు వజ్రం యజమాని ప్రణబ్‌ కుమారేనా కాదా అనే దానిపై న్యాయ వివాదం కొనసాగింది. ఆ వజ్రం అసలు సొంతదారు అతడేనని సిటీ సెషన్స్‌ కోర్టు గతవారం తీర్పునిచ్చింది. వజ్రం రూపురేఖలు మార్చొద్దని, ఇందుకోసం రూ.2 కోట్ల విలువైన బాండ్‌ సమర్పించాలని ప్రణబ్‌ను ఆదేశించింది. ప్రపంచ ప్రఖ్యాత కోహినూర్, షాజహాన్‌ వజ్రాలు సైతం గోల్కొండ ప్రాంతానికి చెందినవే.

వరుసగా పదోసారి..



న్యూఢిల్లీ: వరుసగా పదోసారి ప్రధాని మోదీ నేడు స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగం చేయనున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఇదే ఆయన చివరి ప్రసంగం కానుంది. ఈ వార్షిక ప్రసంగంలో ప్రధాని మోదీ తన ప్రభుత్వ ప్రగతి రిపోర్టు, కీలక కార్యక్రమాలను ప్రకటించడంతోపాటు రానున్న సంవత్సరాల్లో దేశాన్ని ఎలా ముందుకు నడిపించాలనుకుంటున్నారో కూడా వివరిస్తారు. 2014 మొదలుకొని వివిధ రంగాల్లో దేశం సాధించిన ప్రగతిని వివరించడంతోపాటు భవిష్యత్‌ కార్యాచరణను ప్రధాని ప్రకటించనున్నారు. రాజకీయ పరమైన అంశాలను కూడా ఆయన స్పృశిస్తారని పరిశీలకులు భావిస్తున్నారు.

ఎక్కువ ఫాలోయర్లు ఉన్నారని..

భార్యను చంపేసిన భర్త

లక్నో: సోషల్‌ మీడియా ఇన్‌స్టాగ్రామ్‌లో ఎక్కువ మంది ఫాలోయర్లు ఉండటంతో భార్యపై అసూయ చెందిన ఓ భర్త ఆమెను కన్నబిడ్డల ఎదుటే గొంతు పిసికి చంపేశాడు. యూపీలో ఈ దారుణం చోటుచేసుకుంది. లక్నోలోని పారా ప్రాంతంలో నివాసం ఉండే ఓ ట్రావెల్‌ ఏజెంట్‌(37)కి 15 ఏళ్ల క్రితం పెళ్లయ్యింది. ఆ దంపతులకు 12 ఏళ్ల కూతురు, 5 ఏళ్ల కొడుకు ఉన్నారు. భార్య గృహిణి. ఇంటి వద్ద ఉంటూనే ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులు పెట్టేవారు. ఆమె ఎకౌంట్‌కు భారీగా ఫాలోయర్లున్నారు. ఎవరో ఒక ఫాలోయర్‌తో ఆమె అక్రమ సంబంధం నడుపుతోందని భర్తకు అనుమానం. ఇదే విషయంలో వారి గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల తన ఇన్‌స్టా ఎకౌంట్‌లో భర్తను బ్లాక్‌ చేసింది. దీంతో, అతడి అనుమానం ఎక్కువైంది. ఆదివారం ఆ దంపతులు పిల్లలిద్దరినీ తీసుకుని కారులో రాయ్‌బరేలీకి బయలుదేరారు. అయితే, భర్త కారును పూర్వాంచల్‌ ఎక్స్‌ప్రెస్‌ వేపైకి మళ్లించాడు. ఉదయం 5 గంటల సమయంలో సుల్తాన్‌పూర్‌ వద్ద ఇద్దరి మధ్యా గొడవ తీవ్ర స్థాయికి చేరుకుంది. తీవ్ర కోపంతో ఉన్న భర్త భార్యను గొంతు నులిమి చంపేశాడు. ఈ హఠాత్పరిణామంతో పిల్లలిద్దరూ వణికిపోయారు. వారు ఏడుస్తూ ఉండటంతో కారును లోపలి నుంచే లాక్‌ చేశాడు నిందితుడు. పోలీసులు అనుమానంతో అక్కడికి చేరుకుని ప్రశ్నించగా దారుణం వెలుగులోకివచ్చింది. ఇన్‌స్టాగ్రామ్‌లో భార్యకు ఎక్కువ ఫాలోయర్లు ఉండటంతో ఆత్మన్యూనత వల్లే అతడు దారుణానికి తెగబడ్డాడని పోలీసులు తెలిపారు.



మీరే భారత భాగ్య విధాతలు

కాంగ్రెస్‌ నేత రాహుల్‌ గాంధీతో కలిసి భోజనం చేస్తున్న ఈ వ్యక్తి పేరు రామేశ్వర్‌. ఢిల్లీలో తోపుడు బండిపై కూరగాయల ముక్కునే వ్యక్తి. ద్రవ్యోల్బణం దెబ్బకు కూరగాయలు కొనలేని పరిస్థితి ఉందంటూ ఖాళీ తోపుడుబండి చూపిస్తూ రామేశ్వర్‌ రోదిస్తున్న వీడియో ఇటీవల వైరల్‌ మారింది. విషయం తెల్సుకున్న రాహుల్‌ ఈయనను సోమవారం ఢిల్లీలో ఇంటికి పిలిచి భోజనం పెట్టారు. కష్టాల్లోనూ చిరునవ్వుతూ ముందుకు సాగే ఇలాంటి వారే 'భారత భాగ్య విధాతలు' అంటూ సోషల్‌ మీడియా 'ఎక్స్‌'లో రాహుల్‌ ట్వీట్‌చేశారు.

క్లుప్తంగా...

బీఆర్‌ఎస్‌లో 'క్రాంతికారి షేత్కారి పార్టీ' విలీనం

సాక్షి, హైదరాబాద్‌: దేశవ్యాప్తంగా రైతుల హక్కుల సాధన కోసం పోరాటం చేస్తున్న 'క్రాంతికారి షేత్కారి పార్టీ'భారత్‌ రాష్ట్ర సమితిలో విలీనమైంది. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షుడు సతీశ్‌ సాల్వే సోమవారం హైదరాబాద్‌లో తమ పార్టీ నేతలతో కలిసి బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్‌ను కలిశారు. వారికి కేసీఆర్‌ గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, ఇతర అణగారిన వర్గాల కోసం పూర్తిస్థాయిలో పనిచేసే లక్ష్యంతో క్రాంతికారి షేత్కారి పార్టీని స్థాపించినట్లు సతీశ్‌ సాల్వే తెలిపారు. అయితే రైతాంగ సంక్షేమం–వ్యవసాయాభివృద్ధి ఎజెండాగా ఏర్పాటైన బీఆర్‌ఎస్‌ పార్టీలో తాము విలీనం అవుతున్నట్లు ప్రకటించారు. క్రాంతికారి షేత్కారీ పార్టీ విలీనంతోపాటు చరణ్‌ వాఘ్మరే నేతృత్వంలో బీజేపీ, కాంగ్రెస్‌, శివసేన, పలు ఇతర పార్టీల నేతలు సోమవారం కేసీఆర్‌ సమక్షంలో బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరారు.

'భారత్‌ జాగృతి'లో అరుదైన బతుకమ్మ పాటలు

బతుకమ్మ పాట పాడిన ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్‌: ప్రజల నుంచి అరుదైన బతుకమ్మ పాటలను సేకరించి భారత్‌ జాగృతి యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నట్లు ఎమ్మెల్సీ కవిత తెలిపారు. బతుకమ్మ సంబురాల సన్నాహాల్లో భాగంగా భారత్‌ జాగృతి ఆధ్వర్యంలో రూపొందుతున్న పాటకు సంబంధించిన వీడియోను కవిత సోమవారం సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. గాయకులు తేలు విజయ, పద్మావతి, మౌనిక యాదవ్‌, సౌమ్యతో పాటు భారత్‌ జాగృతి సాంస్కృతిక విభాగం జాతీయ కన్వీనర్‌ కొడారి శ్రీనుతో కలిసి కవిత ఆ పాటను ఆలపించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఇప్పటికే 150 బతుకమ్మ పాటలు సేకరించామని, ప్రజల సహకారంతో అరుదైన, ప్రాచీన, కొత్త పాటలను సేకరించి జాగృతి యాప్‌లో నిక్షిప్తం చేస్తామని తెలిపారు. బతుకమ్మ పాటలు, పాటల సమాచారాన్ని +91 89856 99999 నంబర్‌కు వాట్సాప్‌ ద్వారా పంపాలని కవిత విజ్ఞప్తి చేశారు.

ఎస్సీల వర్గీకరణకు మద్దతివ్వండి: మందకృష్ణ



సాక్షి, హైదరాబాద్‌: ఎస్సీల వర్గీకరణకు మద్దతిస్తేనే కాంగ్రెస్‌ పార్టీకి మాదిగలు అండగా నిలుస్తారని మాదిగ రిజర్వేషన్‌ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్‌) అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ వ్యాఖ్యానించారు. సోమవారం గాంధీభవన్‌కు వచ్చిన మంద కృష్ణ రాష్ట్ర కాంగ్రెస్‌ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్‌ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కలకు వినతిపత్రం అందజేశారు. ఎస్సీల వర్గీకరణకు దేశంలోని దాదాపు అన్ని రాజకీయ పార్టీలు మద్దతిస్తున్నాయని, కాంగ్రెస్‌ పక్షాన కూడా మద్దతివ్వాలని ఆ వినతిపత్రంలో కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్‌ అధికారంలో ఉన్నప్పుడే బిల్లు పెట్టి ఆమోదించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. ఈసారి ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్‌ పార్టీ ఎస్సీ వర్గీకరణపై స్పష్టతనిచ్చి పార్టీ విధానాన్ని ప్రకటించాలని మంద కృష్ణ డిమాండ్‌ చేశారు.

'నిధులు తేవడం రాదుకానీ.. నిందలు వేస్తారు'

సాక్షి, హైదరాబాద్‌: బీజేపీ నేతలు అప్పు గురించి మాట్లాడితే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని తెలంగాణ ఫుడ్స్‌ చైర్మన్‌ మేడే రాజీవ్‌సాగర్‌ అన్నారు. తెలంగాణ అప్పు గురించి మాట్లాడే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి మోదీ తొమ్మిదేళ్లలో చేసిన 100 లక్షల కోట్ల అప్పు గుర్తులేదా అని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రానికి ఒక్క రూపాయి నిధులు తీసుకురావడం తెలియని కిషన్‌రెడ్డికి.. నిందలు వేయడం మాత్రం బాగా వచ్చని ఎద్దేవా చేశారు. రాష్ట్ర సర్కార్‌ తీసుకువచ్చిన అప్పుతో అద్భుతంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అప్పుతో బీజేపీ ప్రభుత్వం ఏం సాధించిందో చెప్పగలరా అని ప్రశ్నించారు.

గెలుపు గుర్రాలపై ఫోకస్‌!

వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ప్రారంభించిన కాంగ్రెస్‌

- స్క్రీనింగ్‌ కమిటీ చైర్మన్‌ నేతృత్వంలో ఎన్నికల కమిటీ సమావేశం
- అభ్యర్థుల ఎంపిక, దరఖాస్తుల స్వీకరణకు మార్గదర్శకాలపై ఏఐసీసీ పరిశీలకులు, ముఖ్య నేతల చర్చ
- ఈ నెల 17లోపు మార్గదర్శకాలు..
- 18 నుంచి దరఖాస్తుల స్వీకరణ..



పీఈసీ సమావేశంలో రేవంత్‌రెడ్డి, మాణిక్‌రావ్‌ ఠాక్రే, జిగ్నేశ్‌ మేవానీ తదితరులు

సాక్షి, హైదరాబాద్‌: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల కోసం కాంగ్రెస్‌ పార్టీ కసరత్తు ప్రారంభించింది. గెలుపు గుర్రాలను ఎంపిక చేయడమే లక్ష్యంగా మార్గదర్శకాలను సిద్ధం చేయడంపై దృష్టిపెట్టింది. ఈ మేరకు సోమవారం గాంధీభవన్‌లో స్క్రీనింగ్‌ కమిటీ చైర్మన్‌ మురళీధరన్‌ నేతృత్వంలో బాబా సిద్దిఖీ, జిగ్నేశ్‌ మేవానీల సమక్షంలో ప్రదేశ్‌ ఎన్నికల కమిటీ (పీఈసీ) సమావేశం జరిగింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్‌ ఠాక్రే, పీసీసీ చీఫ్‌ రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, స్క్రీనింగ్‌ కమిటీ సభ్యుడు ఉత్తమ్‌ కుమార్‌రెడ్డి, పీఈసీ సభ్యులు బలరాం నాయక్‌, రోహిత్‌చౌదరి, మహేశ్‌కుమార్‌గౌడ్‌, దామోదర రాజనర్సింహ, పొన్నాల లక్ష్మయ్య, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రేమ్‌సాగర్‌రావు, అంజన్‌కుమార్‌ యాదవ్‌, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, మన్సూర్‌ అలీఖాన్‌, వంశీచంద్‌రెడ్డి, శివసేనారెడ్డి, సంపత్‌ కుమార్‌, జగ్గారెడ్డి, రేణుకా చౌదరి, జానారెడ్డి, జీవన్‌రెడ్డి, అజారుద్దీన్‌, సీతక్క, సునీతారావు తదితరులు ఇందులో పాల్గొని చర్చించారు.

18 నుంచి దరఖాస్తులు

వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న నేతల నుంచి దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియ ప్రారంభించాలని పీఈసీ సమావేశం నిర్ణయించింది. ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు గాంధీభవన్‌లో దరఖాస్తులను స్వీకరించనుంది. అయితే ఈ దరఖాస్తుల స్వీకరణకు సంబంధించిన మార్గదర్శకాలను ఖరారు చేసేందుకు.. పీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ చైర్మన్‌ దామోదర రాజనర్సింహ, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి, టీపీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మహేశ్‌కుమార్‌గౌడ్‌లతో సబ్‌కమిటీ ఏర్పాటు చేశారు. ఇక దరఖాస్తు రుసుము కింద ఓసీల నుంచి రూ.10 వేలు, ఇతర వర్గాల నుంచి రూ.5వేలను డీడీ రూపంలో తీసుకోవాలని సమావేశంలో అభిప్రాయపడినా.. ఓసీలకు రూ.50 వేలు, ఇతరులకు రూ.25 వేలుగా ఫీజును ఖరారు చేయాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఫీజు ఎంతన్నది సబ్‌కమిటీ ఖరారు చేయనుంది. దరఖాస్తుల స్వీకరణ ముగిశాక సెప్టెంబర్‌ మొదటివారంలో మరోమారు సమావేశం కావాలని.. మూడో వారానికల్లా తొలి విడత జాబితా సిద్ధం చేయాలని కూడా నిర్ణయించారు. ఆశావహులు దరఖాస్తు చేసుకునే సమయంలోనే.. పార్టీలో అనుభవం, గత నాలుగేళ్లలో చేసిన కార్యక్రమాలను వివరించాలని పేర్కొననున్నట్టు తెలిసింది. బీసీలకు ప్రతి పార్లమెంటు స్థానం పరిధిలో కనీసం 2 అసెంబ్లీ సీట్లకు తగ్గకుండా కేటాయించాలనే అంశంపైనా చర్చించినట్టు సమాచారం. అనంతరం స్క్రీనింగ్‌ కమిటీ చైర్మన్‌ మురళీధరన్‌ మీడియాతో మాట్లాడుతూ.. సెప్టెంబర్‌ మూడో వారంలో తొలి జాబితా ప్రకటిస్తామని, అభ్యర్థుల ఖరారులో సామాజిక న్యాయాన్ని పాటిస్తామని చెప్పారు.

అడిగిన అందరికీ టికెట్లివ్వడం కుదరదు: మహేశ్‌కుమార్‌గౌడ్‌

పీఈసీ సమావేశం అనంతరం టీపీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మహేశ్‌కుమార్‌గౌడ్‌ మీడియాతో మాట్లాడారు.పార్టీ టికెట్‌ కోసం దరఖాస్తు చేసుకునే హక్కు అందరికీ ఉంటుందని.. అయితే అందరికీ టికెట్లు ఇవ్వడం కుదరనందున సర్వేలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. ఒక్క సర్వేలు మాత్రమే ఆధారం కాదని, పీఈసీ అనేక అంశాల్లో వడపోత చేపట్టి అభ్యర్థుల ఎంపికలో కీలకంగా వ్యవహరిస్తుందని వివరించారు. ఆ జాబితాలను స్క్రీనింగ్‌ కమిటీ పరిశీలిస్తుందని, తర్వాత సీడబ్ల్యూసీ ఆమోదం తీసుకుని టికెట్లను ప్రకటిస్తారని చెప్పారు.

రేవంత్‌ వర్సెస్‌ పొన్నాల

పీఈసీ సమావేశం అనంతరం ఏఐసీసీ గదిలో పీసీసీ చీఫ్‌ రేవంత్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య మధ్య వాగ్వాదం జరిగినట్టు తెలిసింది. వరంగల్‌ జిల్లా రాజకీయాలపై చర్చించేందుకు సమయం ఇవ్వాలని తాను చాలా కాలం నుంచి కోరుతున్నా.. సమయం ఇవ్వడం లేదని, ఇష్టారాజ్యంగా పార్టీ జిల్లా అధ్యక్షులను నియమిస్తున్నారని పొన్నాల ప్రశ్నించినట్టు సమాచారం. దీంతో వరంగల్‌లో జరిగిన సమావేశానికి పొన్నాల వచ్చి మాట్లాడి ఉండాల్సిందని రేవంత్‌ పేర్కొన్నట్టు తెలిసింది. దీనిపై పొన్నాల ఆగ్రహంగా స్పందిస్తూ.. ఎవరు పిలిచారని వరంగల్‌ మీటింగ్‌కు రావాలని నిలదీశారని, బీజేపీలోకి వెళ్లాలని చూసిన నాయకులను తీసుకొచ్చి అందలం ఎక్కించారని మండిపడినట్టు సమాచారం. పార్టీలో 45 ఏళ్లుగా పనిచేస్తున్న తమ లాంటి నేతలకు కనీస మర్యాద ఇవ్వకుండా వ్యవహరిస్తే ఎలాగని నిలదీసినట్టు తెలిసింది. ఈ సమయంలో అన్ని విషయాలు తర్వాత మాట్లాడుదామంటూ మాణిక్‌రావ్‌ ఠాక్రే సర్దిచెప్పే ప్రయత్నం చేయగా.. తానేమీ అబద్ధం చెప్పడం లేదని, పీసీసీ అధ్యక్షుడి ముందే అన్నీ ప్రస్తావిస్తున్నానని పొన్నాల గట్టిగా మాట్లాడినట్టు సమాచారం.



పంద్రాగస్టు సందర్భంగా జెండా రంగుల విద్యుత్‌ దీపాలతో అలంకరించిన అసెంబ్లీ భవనం

ఎంపీ ఇంటిపైనే రాళ్ల దాడి జరిగితే.. సామాన్యుడి పరిస్థితేంటి?

అసదుద్దీన్‌ ఒవైసీ ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్‌: నాలుగు పర్యాయాలు ఎంపీ అయిన తన ఇంటిపైనే రాళ్ల దాడి జరిగితే.. ఇక సామాన్యుడి పరిస్థితి ఏంటని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్‌ ఎంపీ అసదుద్దీన్‌ఒవైసీ ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్‌ దారుస్సలాంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఢిల్లీలోని తన ఇంటిపై రాళ్ల దాడి జరగడంపై తీవ్రంగా మండిపడ్డారు. ఒక వైపు ముస్లింల ఇళ్లపై బుల్డోజర్లు ప్రయోగిస్తూనే, మరోవైపు ఎంపీ ఇంటిపై రాళ్లు రువ్వుతున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బుల్డోజర్లతో కూల్చివేతలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అయినా రాళ్ల దాడులకు, తాటాకు చప్పుళ్లకు భయపడేదిలేదన్నారు. ఇలాంటి ఘటన బీజేపీ నేత ఇంటిపై జరిగితే స్పందన మరోలా ఉండేదని ఒవైసీ అన్నారు. దేశంలో జరుగుతున్న హింసాకాండపై ప్రధాని మోదీ నోరు మెదపడం లేదని, కనీసం స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోనైనా స్పందిస్తారా? కనీసం ఖండిస్తారా? అని ప్రశ్నించారు. ప్రధానమంత్రి సబ్‌కా సాథ్‌, సబ్‌కా వికాస్‌, సబ్‌కా విశ్వాస్‌ ఎక్కడ ఉంది? అంటూ నిలదీశారు.

విధేయతకు పెద్దపీట వేయండి..

- వ్యక్తిగత స్వార్థపరులకు టికెట్లు ఇవ్వొద్దు.. అవకాశవాదులకు చెక్‌ పెట్టండి
- ఏఐసీసీ అగ్రనేత సోనియాకు టీపీసీసీ ప్రధానకార్యదర్శి అద్దంకి దయాకర్‌ లేఖ



సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణలో పార్టీ ప్రయోజనాలను కాపాడటంతోపాటు రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌ పార్టీకి అండగా నిలిచేలా భరోసా కల్పించాలని టీపీసీసీ ప్రధానకార్యదర్శి అద్దంకి దయాకర్‌ అధిష్టానాన్ని కోరారు. ఈ మేరకు ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీకి సోమవారం లేఖ రాశారు. వ్యక్తిగత స్వార్థం కోసం పార్టీ పట్ల విధేయులుగా వ్యవహరించలేనివారికి ఎన్నికల్లో టికెట్లు రాకుండా చూడాలని, పార్టీ అధికారంలోకి వచ్చాక అలాంటి వారిని పూర్తిస్థాయిలో నియంత్రించాలని కోరారు. అలా చేసినప్పుడే అవకాశవాదనేతలకు చెక్‌ పెట్టి పార్టీ ప్రయోజనాలను కాపాడుకోవచ్చని తెలిపారు. కాంగ్రెస్‌ పార్టీ నుంచి కొందరిని లాక్కునేందుకు బీజేపీ, బీఆర్‌ఎస్‌ పన్నుతున్న కుట్రలను ఛేదించడం కోసం పార్టీ విధేయులతో విజిలెన్స్‌ నెట్‌వర్క్‌ ఏర్పాటు చేయాలని, పార్టీ కోసం అకుంఠిత దీక్షతో పనిచేస్తున్న వారికి పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. అమరవీరుల కుటుంబాలు, ఉద్యమ కారులను అక్కున చేర్చుకోవాలని, పార్టీని నమ్ముకొని ఉన్న నేతలు, క్యాడర్‌కు విశ్వాసం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పీసీసీ, సీఎల్పీకి మార్గనిర్దేశం చేయాలని కోరారు. ఎన్నికల్లో గెలిచిన తరువాత ఇతర పార్టీల్లోకి వెళ్లకుండా ఉండే నేతలకు ప్రాధాన్యం ఇవ్వాలని, పార్టీ పురోగమనంపై చర్చించేందుకు రాష్ట్ర కాంగ్రెస్‌ నేతలతో త్వరలోనే ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయించాలని కోరారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, ఉద్యోగాల భర్తీతోపాటు తెలంగాణ కోసం పోరాడి ప్రాణాలను త్యజించిన అమరవీరుల కుటుంబాలకు భరోసానిచ్చే విధంగా మేనిఫెస్టోలో హామీ ఇవ్వాలని, మీరే ఈ హామీని స్వయంగా ప్రకటించాలని సోనియాకు రాసిన లేఖలో దయాకర్‌ విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం
- ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారు
- కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ కార్యాలయాలకు వందల కోట్ల విలువైన భూములు
- బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆ జీవోలు రద్దు



మాట్లాడుతున్న కిషన్‌ రెడ్డి. చిత్రంలో జయసుధ

సాక్షి, హైదరాబాద్‌: సుమారు రూ.6 లక్షల కోట్ల అప్పుతో మిగులు రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అప్పులకుప్పగా మార్చిందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. అనేక రాష్ట్రాలు తమ ఆదాయం పెంచుకుంటుంటే.. ఇక్కడి ప్రభుత్వం మాత్రం మోసపూరితంగా వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రియల్‌ ఎస్టేట్‌ సంస్థలా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వద్ద.. ప్రభుత్వ సంస్థల నిర్మాణానికి, పేద ప్రజల డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్లకు మాత్రం స్థలం ఉండదని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం తరఫున తాను స్వయంగా అనేక ఉత్తరాలు రాసి రైల్వే టర్మినళ్లకు, చర్లపల్లిలో రైల్వే స్టేషన్‌విస్తరణకు భూమి కావాలన్నా ఇవ్వడం లేదని విమర్శించారు. కోకాపేట, బుద్వేల్‌, ఖాజాగూడ, మన్నెగూడ, ఆదిభట్ల లాంటి అనేకచోట్ల ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారని విమర్శించారు.

పార్టీల పేరుతో పంచుకున్నారు..

కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌రెండు పార్టీలు కుమ్మక్కై వందల కోట్ల విలువ చేసే భూములను పార్టీలకు కేటాయింపుల పేరుతో అక్రమంగా తీసుకున్నాయని కిషన్‌రెడ్డి ఆరోపించారు. విలువైన భూములను కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌లు పంచుకున్నాయని, కాంగ్రెస్‌ పార్టీకి ఏ ప్రాతిపదికనైతే భూమి ఇచ్చామో, బీఆర్‌ఎస్‌కు అదే ప్రాతిపదికన తీసుకున్నామని సిగ్గు లేకుండా జీవోలో చెప్పుకున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కుటుంబం, వాళ్ల అనుచరులు, బినామీల పేర్లమీద భూములు కొల్లగొడుతున్నారని ఆరోపించారు. భావితరాల కోసం భూములను రక్షించాల్సిన అవసరం ఉందని కిషన్‌రెడ్డి చెప్పారు. 4 నెలల తర్వాత అధికారంలోకి వచ్చే బీజేపీ ప్రభుత్వం.. బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ పార్టీలకు భూమి కేటాయింపులకు సంబంధించిన జీవోలను రద్దు చేయనున్నట్లు వెల్లడించారు. భూముల వేలాన్ని కూడా బీజేపీ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. కాగా సోమవారం బీజేపీ కార్యాలయానికి వచ్చిన సినీనటి జయసుధను ఈ సందర్భంగా సత్కరించారు.

దళిత ముద్ర నుంచి బయటపడటం కష్టం

- 'దళితులకు మూడెకరాల భూమి' హామీ 40 శాతం నెరవేర్చినా అణగారిన వర్గాల సాధికారత సాధ్యమయ్యేది
- మీడియాతో చిట్‌చాట్‌లో గుజరాత్‌ కాంగ్రెస్‌ ఎమ్మెల్యే జిగ్నేశ్‌ మేవానీ

సాక్షి, హైదరాబాద్‌: భారతదేశ రాజకీయాల్లో దళిత ముద్ర నుంచి బయటపడటం చాలా కష్టమని గుజరాత్‌ కాంగ్రెస్‌ ఎమ్మెల్యే, టీపీసీసీ స్క్రీనింగ్‌ కమిటీ సభ్యుడు జిగ్నేశ్‌ మేవానీ అన్నారు. 'నేను ఎమ్మెల్యేను. గుజరాత్‌ పీసీసీకి వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ను. కానీ నా గురించి మాట్లాడేటప్పుడు, మీడియాలో రాసేటప్పుడు దళిత నేత అని ముందు ప్రస్తావిస్తారు. నేను ఎమ్మెల్యేనని, పీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌నని మర్చిపోతారు. అదే ఓ బ్రాహ్మణ వర్గానికి చెందిన నాయకుడి గురించి రాయాల్సి వచ్చినప్పుడు మాత్రం ఆయన కులం గురించి ఆయన పేరు ముందు ప్రస్తావించరు. దళిత వర్గాల నాయకుల పేర్ల ముందు మాత్రం దళిత నేత అని చేరుస్తారు. అంబేడ్కర్‌ లాంటి మహోన్నత వ్యక్తి పేరు ముందు కూడా దళిత నేత అని చేరుస్తారు'అని వ్యాఖ్యానించారు. ప్రదేశ్‌ ఎన్నికల కమిటీ (పీఈసీ) సమావేశంలో పాల్గొనేందుకు హైదరాబాద్‌ వచ్చిన ఆయన గాంధీ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. పార్టీ పట్ల విధేయత, ప్రజాసేవలో నిబద్ధతతో పాటు గెలుపు గుర్రాలను ప్రాతిపదికగా తీసుకుని పార్టీ అభ్యర్థులను ఎంపిక చేస్తామని, సామాజిక న్యాయం అమలు కష్టమేనని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో భూమిలేని దళిత పేద కుటుంబాలకు మూడెకరాల భూమి ఇస్తామని సీఎం కేసీఆర్‌ ఇచ్చిన హామీ నిజంగా సామాజిక విప్లవం లాంటిదేనని, ఆ హామీలో 30–40 శాతం నెరవేరినా అణగారిన వర్గాల సాధికారత సాధ్యమయ్యేదని చెప్పారు. కానీ, తెలంగాణలో అలా జరగకపోవడం దురదృష్టకరమన్నారు.

ఆస్తులు అమ్ముకుని వెళ్లిపోయేందుకు కేసీఆర్‌ ప్లాన్‌

పాలమూరు పార్టీ నేతల చేరికల కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్‌ రేవంత్‌

- వందల ఎకరాల ప్రభుత్వ భూమిని ఎందుకు అమ్ముతున్నారు?
- ఈసారి వచ్చేది కాంగ్రెస్‌ ప్రభుత్వమే.. ఆ నిర్ణయాలన్నీ తిరగదోడుతాం

సాక్షి, హైదరాబాద్‌: వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ ఓటమి ఖాయమని సర్వేలు చెప్తున్నాయని, అందుకే ఆస్తులన్నీ అమ్ముకుని విదేశాలకు వెళ్లిపోయేందుకు సీఎం కేసీఆర్‌ ప్లాన్‌ చేసుకుంటున్నారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో డబుల్‌ బెడ్రూం ఇళ్లు కట్టడానికి స్థలం లేదంటున్న సీఎం కేసీఆర్‌.. వందల ఎకరాల ప్రభుత్వ భూమిని ఎలా అమ్ముతున్నారని నిలదీశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన అలంపూర్‌, దేవరకద్ర, మహబూబ్‌నగర్‌ ప్రాంతాలకు చెందిన పలు పార్టీల నేతలు సోమవారం గాంధీభవన్‌లో రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా రేవంత్‌ మాట్లాడారు. కాంగ్రెస్‌ పార్టీ పేదలకు పట్టా భూములిస్తే.. బీఆర్‌ఎస్‌ సర్కారు అభివృద్ధి ముసుగులో వాటిని గుంజుకోవాలని చూస్తోందని ఆరోపించారు. నాడు కాంగ్రెస్‌ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది ప్రజల ఆకాంక్షల కోసమని.. అంతేతప్ప ఔటర్‌ రింగురోడ్డును, దళితుల భూములను అమ్ముకునేందుకు కాదని పేర్కొన్నారు.

వాళ్లంతా జాగ్రత్తగా ఉండాలి..

ఓటమి భయంతోనే కేసీఆర్‌ రాష్ట్రంలో అన్నీ అమ్మేస్తున్నారని, పనులు చక్కబెట్టుకుంటున్నారని రేవంత్‌ ఆరోపించారు. భూములు కొనేవాళ్లు కొంచెం జాగ్రత్తగా ఉండాలని, ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని, రాష్ట్రంలో ఏర్పడేది కాంగ్రెస్‌ ప్రభుత్వమేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని వ్యాఖ్యానించారు. ఇక కేసీఆర్‌ తన సొంత మనుషులకు అప్పగించుకునేందుకే వైన్‌షాపుల టెండర్లను నాలుగు నెలల ముందు నిర్వహిస్తున్నారని ఆరోపించారు.

కాంగ్రెస్‌ నేతలపై అక్రమ కేసులు

పాలమూరు జిల్లాలో కాంగ్రెస్‌ పార్టీ కార్యకర్తల జోలికి ఎవరు వచ్చినా సహించేది లేదని రేవంత్‌ పేర్కొన్నారు. తమ కార్యకర్తలపై మంత్రి శ్రీనివాస్‌ గౌడ్‌ అక్రమ కేసులు పెట్టిస్తున్నారని మండిపడ్డారు. కొందరు పోలీసు అధికారులు బీఆర్‌ఎస్‌ నేతలకు తొత్తుల్లా పనిచేస్తూ.. కేసులు పెడుతున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక అలాంటి పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శులు సంపత్‌కుమార్‌, వంశీచంద్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రెజర్ బాంబు పేలి ఇద్దరు మావోయిస్టుల మృతి?

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లాలో ప్రెజర్ బాంబు పేలి ఇద్దరు మావోయిస్టులు మృతి చెందినట్లు తెలుస్తోంది. కాంకేర్ జిల్లా కోయిలి బేడా సమీపంలోని అల్పారస్ సమీపంలో నూతనంగా నిర్మించిన రహదారిపై మావోయిస్టులు బాంబులను అమరుస్తుండగా అందులో ఒకటి పేలిందని, ఈ ఘటనలో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారని సమాచారం. కాగా, దీన్ని ఆ రాష్ట్ర పోలీసులు అధికారికంగా ప్రకటించలేదు.

నెలాఖరులోగా గ్రిడ్‌కు 'సూపర్ థర్మల్'!

- 27 నుంచి ఎన్టీపీసీ యూనిట్-1లో పూర్తి సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి
- విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేసేందుకు స్లాట్లను కేటాయించిన ఎల్డీసీ
- వచ్చే అక్టోబర్‌లో రెండో యూనిట్‌కు సీఓడీ ప్రక్రియ

సాక్షి, హైదరాబాద్: ఎన్టీపీసీ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా రామగుండంలో నిర్మిస్తున్న 1,600 (2x800) మెగావాట్ల తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు తొలి దశలోని 800 మెగావాట్ల యూనిట్‌ను ఈ నెలాఖరులోగా గ్రిడ్‌కు అనుసంధానం చేసేందుకు సంస్థ యాజమాన్యం కసరత్తు చేస్తోంది. తొలి యూనిట్ ద్వారా గత రెండు వారాలుగా 650 మెగావాట్ల వరకు నిరంతరం విద్యుదుత్పత్తి చేస్తున్నారు. నిబంధనల ప్రకారం కొత్తగా నిర్మించిన థర్మల్ విద్యుత్ కేంద్రాల పనితీరు, సామర్థ్యం పరీక్షల్లో భాగంగా నిరంతరంగా 72 గంటల పాటు పూర్తి స్థాపిత సామర్థ్యంతో విద్యుదుత్పత్తి చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాతే వాణిజ్యపరమైన ఉత్పత్తికి అర్హత సాధించిన తేదీ(కమర్షియల్ ఆపరేటింగ్ డేట్/సీఓడీ)ని ప్రకటిస్తారు. సీఓడీ ప్రకటన తర్వాత విద్యుత్ కేంద్రాన్ని గ్రిడ్ కు అనుసంధానం చేస్తారు. ఈ నేపథ్యంలో ఈ నెల 27 నుంచి 800 మెగావాట్ల పూర్తి స్థాపిత సామర్థ్యంతో తొ లి యూనిట్‌లో విద్యుదుత్పత్తి చేసేందుకు ఎన్టీపీసీ ఏ ర్పాట్లు చేస్తోంది. ఈ సందర్భంగా ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను 27 నుంచి గ్రిడ్‌కు సరఫరా చేసేందుకు తెలంగాణ ట్రాన్స్‌కోలోని లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎల్డీసీ) నుంచి ఇటీవల స్లాట్లను పొందింది. అంతా సవ్యంగా జరిగితే ఈ నెలాఖరులోగా తొలి యూనిట్ సీఓడీ ప్రకటన ప్రక్రియ పూర్తి చేసుకుని గ్రిడ్‌కు అనుసంధానం కానుంది. వచ్చే అక్టోబర్‌లో రెండో యూనిట్‌కు సీఓడీ ప్రక్రియ నిర్వహించాలని ఎన్టీపీసీ లక్ష్యంగా పెట్టుకుంది.



నిర్మాణంలో మూడున్నరేళ్ల జాప్యం !

ఎన్టీపీసీ తొలి యూనిట్ నుంచి జూన్ 2020, రెండో యూనిట్ నుంచి నవంబర్ 2020 నాటికి వాణిజ్యపరంగా విద్యుదుత్పత్తి (సీఓడీ) ప్రారంభం కావాల్సి ఉంది. అయితే నిర్మాణంలో జాప్యంతో తొలి యూనిట్ గడువును 2023 మార్చి, రెండో యూనిట్ గడువును జూలై 2023కు పొడిగించారు. యూనిట్-1 నిర్మాణం దాదాపు 8 నెలల కిందటే పూర్తయింది. కాగా, బాయిలర్‌లోని రీహీటర్ ట్యూబ్స్‌కు పగుళ్లు రావడంతో గత డిసెంబర్‌లో జరగాల్సిన సీఓడీ ప్రక్రియను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. మరమ్మతుల్లో భా గంగా ట్యూబ్స్‌కు పగుళ్లు వచ్చి న చోట కట్ చేసి వెల్డింగ్‌తో మళ్లీఅతికించారు. ఏకంగా 7,500 చోట్లలో వెల్డింగ్ చేయాల్సి రావడంతో తీవ్ర జాప్యం జరిగింది. రాష్ట్ర విభజన చట్టంలో కేంద్రం ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 4,000 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించాల్సి ఉండగా, తొలి దశ కింద 1,600 మెగావాట్ల కేంద్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. రూ.10,599 కోట్ల అంచనా వ్యయంతో తొలి దశ ప్రాజెక్టును చేపట్టగా, గత మార్చి నాటికి రూ.10,437 కోట్ల వ్యయం జరిగింది. పనుల్లో జాప్యంతో అంచనా వ్యయాన్ని రూ.10,998 కోట్లకు పెంచారు.

డిస్కంలకు ఊరట..!

ఎన్టీపీసీ తొలి యూనిట్ అందుబాటులోకి వస్తే నిరంతరం పెరుగుతున్న రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చేందుకు వీలుపడుతుంది. విద్యుత్ డిమాండ్ గరిష్టంగా పెరిగే వేళల్లో అవసరమైన అదనపు విద్యుత్‌ను రాష్ట్ర పంపిణీ సంస్థ (డిస్కం)లు అధిక ధరలతో పవర్ ఎక్స్ఛేంజీల నుంచి కొనుగోలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తొలి యూనిట్ అందుబాటులోకి వస్తే విద్యుత్ కొనుగోళ్ల భారం కొంత వరకు తగ్గుతుందని అధికారులు చెప్తున్నారు.



మూడు రంగుల విద్యుత్‌దీపాలతో వెలుగులీనుతున్న ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలంలోని ప్రసిద్ధ రామప్ప ఆలయం

20న గద్దర్ సంస్మరణ సభ

సాక్షి, హైదరాబాద్: ప్రజా యుద్ధనౌక గద్దర్ సంస్మరణ సభను ఈ నెల 20న ఉదయం 10 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంస్మరణ సభలో వామపక్ష పార్టీలు, లౌకిక, ప్రజాతంత్ర శక్తులు, విప్లవ శక్తులు, కవులు, కళాకారులు, గద్దర్ అభిమానులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని కోరారు.

'గోవధ నిషేధంపై ఏం చర్యలు తీసుకున్నారు'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గోవధ నిషేధ చట్టం అమలుకు ఏం చర్యలు తీసుకున్నారో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు జీహెచ్ఎంసీకి ఆదేశాలు జారీ చేసింది. బక్రీద్ సందర్భంగా గోవులను పాతబస్తీలో అక్రమంగా నిర్బంధించారని, వాటిని గోశాలలకు తరలించేలా పోలీసులకు, ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలని కోరుతూ వచ్చిన లేఖను హైకోర్టు సుమోటో పిల్‌గా విచారణకు స్వీకరించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది.

'ఇక నుంచి బీసీల రాజకీయ పోరాటం'



అభివాదం చేస్తున్న జాజుల, బీసీ సంఘాల నాయకులు

పంజగుట్ట (హైదరాబాద్): ఇప్పటివరకు బీసీలు సంక్షేమ పథకాల పోరాటాలు చేశారని, ఇకపై రాజకీయ పోరాటం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రాజకీయాల్లో బీసీలు 60 శాతం వాటా సంపాదించేవరకు ఈ పోరాటం ఆగదని తెలిపారు. సోమవారం బీసీ కులసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్ చారి అధ్యక్షతన కులానికో సీటు.. బీసీలకే ఓటు అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాజుల మాట్లాడుతూ రాజకీయ అధికారం లేకుండా ఏమీ సాధించలేం అని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అప్పుడే చెప్పారని, బీసీలకు రాజకీయ వాటా దక్కేవరకు ఉద్యమం ఆపేదే లేదని తేల్చిచెప్పారు. సామాజిక న్యాయం.. సబ్బండ వర్గాలకే రాజ్యాధికారం పేరుతో సెప్టెంబర్ 10న సరూర్‌నగర్ స్టేడియంలో 5 లక్షల మందితో 'బీసీల సింహగర్జన' నిర్వహిస్తున్నట్లు జాజుల తెలిపారు. 60 శాతం జనాభా ఉన్న బీసీలకు ఎన్ని టికెట్లు ఇస్తారనేది ఏ పార్టీ కూడా చెప్పడంలేదన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరు రవికృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్, గౌడ సంఘం నాయకుడు బాలగోని బాల్‌రాజ్, మదన్ కుమార్, తాటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యామ్ కురుమ, పిట్ల నగేశ్, శంకర్, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఇద్దరు మంత్రులను బర్తరఫ్ చేయాలి

- రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- స్పోర్ట్స్ స్కూల్‌లో లైంగిక వేధింపులపై పూర్తిస్థాయి విచారణ జరపాలని డిమాండ్



నాంపల్లి (హైదరాబాద్): క్రీడా శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, హోంమంత్రి మహమూద్ అలీలను తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఏసీగార్డ్స్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్పోర్ట్స్ స్కూల్‌లో విద్యార్థినులపై జరిగిన లైంగిక వేధింపులపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరపాలని కోరారు. ఓ వెటర్నరీ డాక్టర్ హరికృష్ణను హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఎలా స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తారని, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకుడనే మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆయనకు డిప్యుటేషన్ ఇచ్చారని ఆరోపించారు. కీచకుడు హరికృష్ణపై ప్రభుత్వం సిట్‌వేసి స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన లైంగిక వేధింపులపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని కోరారు. హరికృష్ణ క్రీడా మంత్రికి ప్రధాన అనుచరుడైనందుకే ప్రభుత్వం అతడిని కాపాడుతోందని ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. హైదరాబాదులోని జల్‌పల్లి మున్సిపాలిటీలో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న పాతబస్తీకి చెందిన సామాజిక కార్యకర్త షేక్ సయీద్ బావజీర్‌ను బండ్లగూడలో హత్య చేయడం దారుణమని వాపోయారు. హత్యకు ముందే హోంమంత్రికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినా అతడి ప్రాణాలు కాపాడలేకపోయారని విమర్శించారు. పోలీసుల నిర్లక్ష్యంతోనే రామాయంపేటలో ఖదీర్ ఖాన్‌ను లాకప్‌డెత్ చేశారని పేర్కొన్నారు. తుంగతుర్తిలో నిందితులను చంపేస్తామని బెదిరించినా, బెల్లంపల్లిలో బీఎస్పీ కార్యకర్తపై స్థానిక ఎమ్మెల్యే అనుచరులు దాడులకు పాల్పడినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రవీణ్‌కుమార్ విమర్శించారు.

యాదాద్రిలో త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి పూజలు



త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయాధికారి రాజన్‌బాబు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని త్రిపుర రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.అమర్‌నాథ్‌గౌడ్ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూలకు ప్రత్యేక పూజలు చేశారు. అమర్‌నాథ్‌కు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

శివసేన ప్రధాన కార్యదర్శిగా పూస శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: శివసేన తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పూస శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలోనే అడ్‌హక్ కమిటీ నిర్ణయం మేరకు పదాధికారులను నియమించనున్నట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే చిన్నయ్య క్యాంపు ఆఫీస్ ఎదుట శేజల్ ధర్నా



క్యాంపు కార్యాలయం గేట్ ముందు ధర్నా చేస్తున్న శేజల్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఏఎంసీ ఏరియాలోని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య క్యాంపు కార్యాలయం ప్రధాన గేట్ ఎదుట ఆరిజిన్ డెయిరీ సీఈవో శేజల్ సోమవారం ధర్నాకు దిగింది. హైదరాబాద్ నుంచి ఒంటరిగా వచ్చిన ఆమె గేటు ఎదుట బైఠాయించి న్యాయం చేయాలంటూ నినదించింది. ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే లైంగికంగా వేధించారని, మరెందరో మహిళల పట్ల అదే తీరుగా వ్యవహరించారని ఆరోపించింది. ఏడు నెలలుగా చిన్నయ్య అనుచరులు బెదిరిస్తున్నారని, తన ప్రాణానికి హాని ఉందని భయాందోళన వ్యక్తం చేసింది. ఆరిజిన్ డెయిరీకి ఇచ్చిన స్థలాన్ని అమ్మకానికి పెడుతున్నారని, ఇలా ఎంతమందికి దాన్ని కట్టబెడతారని ఆమె ప్రశ్నించింది. ఎమ్మెల్యే చిన్నయ్య ఇక్కడికి వచ్చి తనతో మాట్లాడాలని డిమాండ్ చేసింది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో శంకరయ్య, ఎస్సై ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో వచ్చి శేజల్‌ను వన్‌టౌన్‌కు తరలించారు. శేజల్‌ను అరెస్టు నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్, టీఆర్ఎస్ శ్రేణులు వన్‌టౌన్ స్టేషన్‌కు చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులు అందరినీ పాత బస్టాండ్ చౌరస్తా వరకు పంపించి పికెటింగ్ ఏర్పాటు చేశారు.

భార్యను చంపి.. తానూ ఆత్మహత్య చేసుకుని..

- కుటుంబ కలహాలకు రెండు ప్రాణాలు బలి
- కరీంనగర్‌లో ఘటన



ప్రవీణ్-లావణ్య (ఫైల్)

కరీంనగర్ క్రైం: కుటుంబ కలహాలతో రెండు నిండు ప్రాణాలు బలైపోయాయి. భార్యను బండరాయితో కొట్టి హత్య చేసిన భర్త అనంతరం తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మార్కండేయనగర్ కాలనీకి చెందిన వేముల ప్రవీణ్ (50), లావణ్య(42)కు 18 ఏళ్ల క్రితం వివాహం అయింది. వీరికి కూతురు కల్యాణి ఉంది. ప్రవీణ్ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా, లావణ్య టైలరింగ్ పని చేసేవారు. కూతురు కరీంనగర్‌లోని ఓ పాఠశాలలో హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి చదువుతుండగా ఇంట్లో దంపతులు ఇద్దరే ఉండేవారు. వీరి ఇంటిపైన అంతస్తులో ప్రవీణ్ తల్లిదండ్రులు ఉంటున్నారు. కాగా కొన్నేళ్ల నుంచి ప్రవీణ్ దంపతులు తరచూ గొడవలు పడుతుండటంతో పెద్దలు సర్దిచెప్పారు. ఈ క్రమంలో శనివారం రాత్రి మరోసారి గొడవ తీవ్రంగా జరగడంతో ఆవేశానికి లోనైన ప్రవీణ్, భార్య తలపై సిమెంట్ ఇటుకతో బలంగా కొట్టడంతో ఆమె మృతిచెందింది. ఆ తర్వాత ప్రవీణ్ ఆదివారం వేకువజామున హాస్టల్‌కు వెళ్లి తన కూతురును చూసి వచ్చాడు. అనంతరం సూసైడ్ నోట్ రాసి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ క్రమంలో ప్రవీణ్‌కు స్నేహితులు పలుమార్లు ఫోన్ చేయగా, లిఫ్ట్ చేయకపోవడంతో వారు ఇంటికి వచ్చి పరిస్థితిని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. టూటౌన్ సీఐ రాంచందర్ రావు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మా శవాలను మెడికల్ కాలేజీకి ఇవ్వండి

'మా శవాలను మెడికల్ కాలేజీకి ఇవ్వండి. ఎలాంటి సంస్కారాలు చేయాల్సిన అవసరం లేదు. ఎవరూ ఇబ్బంది పడొద్దు. మనిషి పుట్టుక ఎంత సహజమో, మరణం కూడా అంతే సహజం. కానీ విధిని బట్టి వేర్వేరు విధాలుగా వస్తుంది. దయచేసి అర్థం చేసుకోండి. జరిగిన ఘటనకు ఎవరినీ తప్పుపట్టాల్సిన అవసరం లేదు' అని ప్రవీణ్ తన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు.

సాక్షి హైదరాబాద్

మంగళవారం। 15। ఆగస్టు। 2023

మోకిలా రెండో దశ ప్లాట్ల వేలం

మోకిలాలో మరోసారి ప్లాట్‌లు వేలం వేసేందుకు హెచ్‌ఎండీఏ సన్నాహాలు చేపట్టింది. ఇటీవల 50 ప్లాట్‌లకు బిడ్డింగ్ నిర్వహించిన విషయం విదితమే. -10లో



సెల్ఫీ ఫెస్ట్

స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో దేశ పురోగతిని ఘనంగా ప్రదర్శించడం కోసం రూపొందించిన సెల్ఫీ కాంటెస్ట్‌కు ప్రత్యేక ఆదరణ లభిస్తోంది. -10లో

నేడు బస్సు టికెట్లపై ఆర్టీసీ రాయితీ

సాక్షి, సిటీబ్యూరో: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రయాణికులకు ఆర్టీసీ ప్రత్యేక రాయితీని ప్రకటించింది. మంగళవారం నగరంలో సిటీబస్సుల్లో 24 గంటల అపరిమిత ప్రయాణానికి సంబంధించిన టీ-24 టికెట్ కేవలం రూ.75కే ఇవ్వనున్నట్లు అధికారులు ప్రకటించారు. పిల్లలకు టీ-24 టికెట్‌ను రూ.50కే లభించనుంది. మంగళవారం ఒక్కరోజే ఈ సదుపాయం లభించనుంది.

న్యూస్‌రీల్

ఎస్టీపీ పనుల్లో వేగం పెంచండి: జలమండలి ఎండీ



సాక్షి, సిటీబ్యూరో: ఎస్టీపీల నిర్మాణ పనుల్ని వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని జలమండలి ఎండీ దానకిశోర్ ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఎస్టీపీల ప్రాజెక్టు ప్యాకేజీ- 2 లో భాగంగా మీరాలం చెరువు వద్ద నిర్మిస్తున్న మురుగు నీటి శుద్ధి కేంద్రాన్ని హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, నీటిపారుదల శాఖల అధికారులతో కలిసి సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా దానకిశోర్ మాట్లాడుతూ.. మొత్తం 41.5 ఎంఎల్డీల సామర్థ్యంతో మీరాలం ఎస్టీపీని నిర్మిస్తున్నామన్నారు. చెరువులోకి మురుగు చేరకుండా అక్కడున్న పైపులైన్లను అనుసంధానం చేసి కొత్తగా నిర్మిస్తున్న ఎస్టీపీలోకి మళ్లించడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వీటిని హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, నీటిపారుదల శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు పూర్తి చేయాలన్నారు. పని జరిగే ప్రదేశంలో రక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఎస్టీపీ పనులు తుది దశకు చేరుకున్నందున.. పనుల్లో వేగం పెంచి తొందరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని తెలిపారు. ఈ నెలాఖరులోగా ట్రయల్ రన్ పనులు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట ఈడీ డా.ఎం.సత్య నారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, ఎస్టీపీ సీజీఎం సుదర్శన్ తదితరులు ఉన్నారు.

ప్రజావాణి దరఖాస్తులకు సత్వరమే పరిష్కారం

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సాక్షి, సిటీబ్యూరో: ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. సోమవారం కలెక్టరేటులోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల నుంచి అందిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి సమస్యలను పరిష్కారించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో సోమవారం 190 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో హౌసింగ్‌కు సంబంధించినవి 159, ఆసరా పెన్షన్‌లు 19, ఇతర శాఖలకు సంబంధించినవి 12 దరఖాస్తులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్, డీఆర్‌ఓ వెంకటాచారి పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత



శంషాబాద్: అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సోమవారం ఉదయం షార్జా నుంచి వచ్చిన ప్రయాణికుడి లగేజీని తనిఖీ చేయగా బ్యాగు జిప్పులకు ఉన్న తొడుగులు తొలగించగా అందులో 246 గ్రాముల బంగారం ముక్కలు బయటపడ్డాయి. వీటి విలువ రూ.14.86 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

త్రివర్ణ శోభితం



సచివాలయం




పబ్లిక్ గార్డెన్స్



చార్మినార్ వద్ద యువతి సెల్ఫీ



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్



మొజంజాహీ మార్కెట్

నేటి పంద్రాగస్టు వేడుకలకు నగరం ముస్తాబైంది. స్వాతంత్ర్య దినోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. గోల్కొండ కోట, చార్మినార్, మొజంజాహీ మార్కెట్, అసెంబ్లీ భవనం, సచివాలయం, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మువ్వన్నెల విద్యుద్దీపాలతో సోమవారం రాత్రి ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి.

– సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు

కుప్పలు.. తెప్పలు..

ఒక్కో ఇంట్లో అధిక సంఖ్యలో ఓటర్లు

- గేటెడ్ కమ్యూనిటీల్లోనూ అంతే
- అన్ని నియోజకవర్గాల్లో అదే వరుస
- సక్రమ జాబితా సాధ్యమయ్యేనా?



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో ఒకే ఇంట్లో పదుల సంఖ్యలో ఓటర్లుండటం, వందమంది కంటే ఎక్కువ మంది ఓటర్లుండటం కూడా తెలిసిందే. ఈ పరిస్థితి నివారించి, సరైన ఓటరు జాబితాను రూపొందిస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ, ఎన్నికల లోపున అది సాధ్యమవుతుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. కొన్ని నియోజకవర్గాల్లోని గేటెడ్ కమ్యూనిటీల్లోనూ భారీ సంఖ్యలో ఓటర్ల పేర్లు జాబితాలో నమోదైనట్లు తెలుస్తోంది.

ఒక్క నియోజకవర్గంలోనే..

గ్రేటర్ పరిధిలోని ఒక్క శేరిలింగంపల్లి నియోజకవర్గంలోనే దాదాపు 185 గేటెడ్ కమ్యూనిటీలు, సొసైటీలకు సంబంధించిన కాలనీల్లోని ఇళ్లలోనే ఒకే డోర్ నంబర్‌తో ఎక్కువమంది ఓటర్లున్న ఇళ్లు దాదాపు 40 వేలు ఉన్నట్లు ఒక రాజకీయ పార్టీ పరిశీలనలో వెల్లడైంది. ఒకే ఇంట్లో సీరియల్ నంబరు 914 నుంచి 943 వరకు ఓటర్లుండటం తదితర సమాచారాన్ని అది సేకరించింది. 40 వేల ఇంటి నంబర్లలో దాదాపు 2,88,000 మంది ఓటర్లున్నట్లు గుర్తించింది. దీంతో ఏ పార్టీ వారైనా, లేదా వారి అభిమానులైనా తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో అధిక సంఖ్యలో ఓటర్లుగా నమోదు చేయించారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఇంకా ఎన్ని ఉంటాయో చెప్పలేం. ఇది సైతం ఈ ఒక్క నియోజకవర్గానికే పరిమితం కాలేదు. గ్రేటర్ పరిధిలోని దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికలొచ్చేలోపున అన్ని ఇళ్లు తనిఖీలు చేసి, ఎక్కువమంది ఉంటే తొలగించి పొరపాట్లకు తావులేని కచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు అధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

కోర్‌సిటీలోనూ ఎక్కువే..

శివార్లలోని నియోజకవర్గాలతోపాటు కోర్‌సిటీ పరిధిలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోనూ ఒకే ఇంట్లో ఎక్కువ ఓట్లున్నట్లు ఆరోపణలున్నాయి. జాబితాలోని పొరపాట్లను సరిచేసేందుకు ఎక్కువ మంది ఓటర్లున్న ఇళ్లతోపాటు కొత్తగా ఓటరు జాబితాలో నమోదవుతున్న ఓటర్లపైనా దృష్టి సారించినట్లు అధికారులు చెబుతున్నారు. ఇటీవలి కాలంలో ఏ ప్రాంతం నుంచైతే అధిక సంఖ్యలో ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకున్నారో ఆయా ప్రాంతాలపై ఓ కన్నేసినట్లు చెబుతున్నారు. నమోదు చేసుకున్న ఓటర్ల ఇళ్లలో పదిశాతం ఇళ్లను ఇతర విభాగాల అధికారులతో ర్యాండమ్‌గా తనిఖీలు చేయిస్తున్నారు.

తప్పుల నివారణకు పార్టీ కమిటీలు

ఓటర్ల జాబితాలో పొరపాట్లు లేకుండా ఉండేందుకు కొన్ని పార్టీలు ప్రత్యేకంగా కమిటీలను కూడా ఏర్పాటు చేసుకుంటున్నాయి. తమ దృష్టికి వచ్చిన వివరాలను ఆధారాలతో సహా కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసేందుకు అవి సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే వివిధ నియోజకవర్గాల్లో ఎక్కువమంది ఓటర్లున్నట్లు ఆయా పార్టీల ప్రతినిధులు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదులు చేయడం తెలిసిందే.

ముందస్తుగా దరఖాస్తు చేసుకోవచ్చు..

ఈ సంవత్సరం అక్టోబర్ ఒకటి నాటికి 18 సంవత్సరాలు నిండేవారు ముందస్తుగానే ఓటరు జాబితాలో పేరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ తెలిపారు. ఇప్పటికే 18 సంవత్సరాల నిండి ఓటరు జాబితాలో పేర్లు లేని వారు పేరు నమోదు చేసుకొని, ఓటు హక్కు పొందాలని సూచించారు. పూర్తి వివరాల కోసం హెల్ప్‌లైన్ నంబర్ 1950ను కార్యాలయ పని వేళల్లో సంప్రదించవచ్చని ఒక ప్రకటనలో తెలిపారు.

2047 నాటికి మన దేశమే నంబర్ వన్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



కాచిగూడ: అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాల సరసన 2047 నాటికి భారత్‌ను నంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. రానున్న 25 ఏళ్లను అమృత కాలంగా పరిగణిస్తూ రాజకీయాలకతీతంగా దేశ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగం, పేదరికం లేనటువంటి దేశంగా అభివృద్ధి దిశగా ముందుకెళుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు ఆధ్వర్యంలో సోమవారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయం వద్ద తిరంగా ర్యాలీని కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఎంతో మంది స్వాతంత్ర్య సమరయోధులు దేశం కోసం ప్రాణాలను త్యాగం చేశారని, అలాంటి వారిలో వెలుగులోకి రానివారి జీవిత చరిత్రను, ఆధ్యాత్మికమైన ప్రముఖ వ్యక్తుల చరిత్రను రేపటి తరానికి అందించడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గత ఏడాది దేశంలో 25 కోట్ల మంది ప్రజలు తమ ఇళ్లపై జాతీయ జెండాలను ఎగురవేశారని, అదే స్ఫూర్తితో ఆగస్టు 15, జనవరి 26న ప్రతి భారతీయుడి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. 75 మీటర్ల జాతీయ జెండాతో బర్కత్‌పురా చమన్ నుంచి కాచిగూడ చౌరస్తాలోని వీరసావర్కర్ విగ్రహం వరకు తిరంగా ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి జి.కావ్యారెడ్డి, బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి, నీరజ, కార్పొరేటర్లు బి.పద్మ వెంకట్‌రెడ్డి, కన్నె ఉమారమేష్ యాదవ్, వై.అమృత, పార్టీ నేతలు అట్లూరి సుభాషిణి, కృష్ణాగౌడ్, ఎ.సూర్య ప్రకాష్ సింగ్, ఎడెల్లి అజయ్ కుమార్, సి.నందకిషోర్ యాదవ్, సి.వినోద్ యాదవ్, వనం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



తిరంగా ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

కోట పరిసరాల్లో నేడు ట్రాఫిక్ ఆంక్షలు

గోల్కొండ: పంద్రాగస్టు సందర్భంగా మంగళవారం గోల్కొండ కోటలో ముఖ్యమంత్రి పతాకావిష్కరణ చేయనుండటంతో ఇటువైపు వెళ్లే దారిలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు అధికారులు తెలిపారు. నేటి ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయి. రాందేవ్‌గూడ నుంచి గోల్కొండ కోట వరకు వెళ్లే రోడ్డుపై ఉదయం 7 నుంచి 12 గంటల వరకు వాహనాలను అనుమతించరు. సాధారణ అన్ని రకాల వాహనాలకు ఈ ఆంక్షలు వర్తిస్తాయి. రాందేవ్‌గూడ నుంచి కోటలో జరిగే వేడుకలకు వచ్చే ఎ-గోల్డ్, ఎ-పింక్, బి-బ్లూ కారు పాసులు ఉన్న వాహనాలను ఉదయం 7 నుంచి 11 గంటల వరకు అనుమతిస్తారు. ఈ వాహనాదారులు సికింద్రాబాద్ వైపు నుంచివచ్చే వారు బంజారా హిల్స్, మాసబ్‌ట్యాంక్, మెహిదీపట్నం, రేతిబౌలి, నానల్‌నగర్ జంక్షన్‌ల మీదుగా బాలికాభవన్ నుంచి లంగర్‌హౌజ్, టిపుఖాన్ బ్రిడ్జి, రాందేవ్‌గూడ జంక్షన్ నుంచి మక్కై దర్వాజా మీదుగా కోటకు రావాలి. వీరిలో 'ఎ' గోల్డ్ పాసులు ఉన్న వారు కోట మెయిన్ గేట్ ఫతేదర్వాజ మెయిన్‌రోడ్డుపై వాహనాలు పార్కు చేయాలి. ఎ-పింక్ పాసులు ఉన్న వారు గోల్కొడ బస్‌స్టాప్ వద్ద వాహనాలను పార్కుచేయాలి. బి-బ్లూ పాసులు ఉన్న వాహనాదారులు తమ వాహనాలను సెవన్ టూమ్స్ బంజారా దర్వాజ మీదుగా ఓవైసీ ప్లే గ్రౌండ్‌లో తమ వాహనాలను పార్కు చేయాలి. సి-కారు పాస్‌లు ఉన్నవారు లంగర్‌హౌజ్ నుంచి ఫతేదర్వాజ మీదుగా జీహెచ్‌ఎంసీ ఐల్యాండ్ నుంచి ఓవైసీ పార్కింగ్‌కు వెళ్లాలి. డి కారు పాస్‌లు ఉన్న వారు షేక్‌పేట్ నాలా, టోలిచౌకీ, సెవన్ టూమ్స్ మీదుగా బంజారాదర్వాజ ప్రియదర్శిని స్కూల్‌లో తమ వాహనాలను పార్కు చేయాలి. ఈ నలుపు రంగు పాసులు ఉన్న వారు లంగర్‌హౌజ్ ఫ్లై ఓవర్ నుంచి హెచ్‌ఎండీఏ చెరువు, ఫతేదర్వాజ సమీపంలోని హుడా పార్కులో వాహనాలను పార్కు చేయాలి. వేడుకలు ముగిసిన అనంతరం ఎ-గోల్డ్, ఎ-పింక్, బి-బ్లూ కారు పాస్‌లు ఉన్న వారు మక్కై దర్వాజ నుంచి రాందేవ్‌గూడ మీదుగా తిరిగి వెళ్లాలి. తమ పాసులను కారు అద్దాలపై స్పష్టంగా కనిపించేలా అతికించాలి. స్థానికులు ట్రాఫిక్ ఆంక్షలను అర్థం చేసుకొని తమకు సహకరించాలని ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ జి.సుధీర్‌బాబు కోరారు.

ఆనంద్ @3



ఇప్పటికే నగర కొత్వాల్, టీ-నాబ్ చీఫ్‌గా బాధ్యతలు

- తాజాగా టీఎస్‌ఐసీసీసీ డైరెక్టర్‌గానూ విధుల్లోకి..

సాక్షి, సిటీబ్యూరో: సిటీ కొత్వాల్ సీవీ ఆనంద్ ఏకకాలంలో మూడు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2021 డిసెంబర్ నుంచి నగర పోలీసు కమిషనర్‌గా పని చేస్తున్న ఆయన ఈ ఏడాది మే 31న తెలంగాణ స్టేట్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (టీఎస్-నాబ్) డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. తాజాగా సోమవారం బంజారాహిల్స్‌లోని రోడ్ నెం.12లో ఉన్న తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీఎస్‌ఐసీసీసీ) డైరెక్టర్‌గానూ మారారు. గత ఏడాది ఆగస్టు 5 నుంచి అందుబాటులోకి వచ్చిన ఈ భవనాల సముదాయంలోనే టీఎస్-నాబ్, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలతో పాటు హైదరాబాద్ పోలీసు కమిషనర్ కార్యాలయం కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు ఐసీసీసీకి డైరెక్టర్ పోస్టు ఖాళీగానే ఉంది. దీంతో ఆనంద్ సోమవారం ఈ బాధ్యతలూ స్వీకరించారు. ఐసీసీసీకి ప్రభుత్వం 400 పోస్టులు కేటాయించింది. ఇప్పటి వరకు వివిధ హోదాలకు చెందిన 81 మంది నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఆనంద్ ఐసీసీసీలోని విభాగాలను పరిశీలించి, అక్కడ అమలవుతున్న విధానాలు, అవసరమైన అంశాలను తెలుసుకున్నారు. జీహెచ్‌ఎంసీ సహా వివిధ విభాగాలతో మల్టీ ఏజెన్సీస్ ఆపరేషన్స్ నిర్వహణకు చర్యలు తీసుకోనున్నారు. కేవలం నగరంలో కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఎలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తినా ఐసీసీసీ ద్వారా నిర్వహిస్తారు. డయల్-100 వ్యవస్థ కూడా త్వరలో కొంపల్లి నుంచి ఈ భవనంలోకే మారనుంది.

10 రోజులు రూ.12 కోట్లు



మద్యం దుకాణాలకు దరఖాస్తుల కిక్కు

రిజర్వేషన్ల వారీగా వైన్‌షాపుల కేటాయింపు ఇలా..

ఎక్సైజ్ జిల్లా	గౌడ్స్	ఎస్సీ	ఎస్టీ	ఓపెన్ కేటగిరీ
హైదరాబాద్	5	4	1	70
సికింద్రాబాద్	6	7	1	85
మల్కాజిగిరి	12	7	1	68
మేడ్చల్	11	5	1	97
సరూర్‌నగర్	25	11	2	96
శంషాబాద్	9	6	-	85
వికారాబాద్	6	9	2	42

జిల్లాలో మద్యం షాపులు.. దరఖాస్తులు

ఎక్సైజ్‌జిల్లా	షాపులు	వచ్చిన దరఖాస్తులు
సరూర్‌నగర్	134	2,700
శంషాబాద్	100	3,300

పలు షాపులకు పోటాపోటీ

- మరో మూడు రోజుల్లో ముగియనున్న గడువు
- దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం
- పది రోజుల్లో రూ.12 కోట్ల ఆదాయం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: మద్యం షాపులకు దరఖాస్తులు పోటెత్తుతున్నాయి. మరో నాలుగు రోజుల్లో గడువు ముగియనుండడంతో దరఖాస్తులు దాఖలు చేసేందుకు సోమవారం క్యూకట్టారు. సరూర్‌నగర్ ఎక్సైజ్ జిల్లా పరిధిలో 134 షాపులు ఉండగా, వీటిలో ఇప్పటి వరకు 2,700పైగా దరఖాస్తులు వచ్చాయి.

శంషాబాద్ ఎక్సైజ్ జిల్లా పరిధిలో వంద షాపులు ఉండగా, 3,300 వచ్చాయి. ఇన్నర్‌రింగ్‌రోడ్డుకు అటు ఇటుగా ఉన్న ఒక్కో షాపునకు సగటున 25 దరఖాస్తులు రావడం విశేషం. ఎలాగైనా షాపులను దక్కించుకోవాలనే ఉద్దేశంతో కొంతమంది వ్యాపారులు సిండికేట్‌గా మారి.. బినామీ పేర్లతో ఒకే షాపుపై టెండర్లు దాఖలు చేస్తున్నారు. ఒకరు టెండరు వేసిన చోట మరొకరు వేయకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇలా ఇప్పటి వరకు కేవలం ఈ దరఖాస్తుల ద్వారానే ప్రభుత్వానికి సుమారు రూ.12 కోట్ల ఆదాయం సమకూరినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ నెల 18తో దరఖాస్తుకు గడువు ముగియనుంది. వచ్చే చివరి మూడు రోజుల్లో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని షాపులకు దరఖాస్తులు భారీగా వచ్చాయి. ఈ ఒక్క స్టేషన్ పరిధిలోనే 1,700 పైగా రావడం గమనార్హం.

21న లక్కీడ్రా

మద్యం షాపుల లైసెన్సుల గడువు నవంబర్ 30తో ముగియనుంది. డిసెంబర్ నుంచి కొత్త లైసెన్సుల విధానం అమల్లోకి రావాల్సి ఉంది. అంతకు ముందే సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉండడంతో ప్రభుత్వం అప్రమత్తమై ముందస్తు లైసెన్సుల జారీకి నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 4న దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించింది. ఒక్కో దరఖాస్తుకు ఫీజు రూ.2 లక్షలుగా(నాన్ రిఫండబుల్) నిర్ణయించింది. ఈ పది రోజుల్లోనే 234 షాపులకు 6,000 దరఖాస్తుల అందడం విశేషం. గతంలో మాదిరే ఈసారి కూడా గౌడ, ఎస్సీ, ఎస్టీ కులాలకు రిజర్వేషన్లు వర్తింపజేసింది. ఈ మేరకు లాటరీ ద్వారా ఆయా కులాలకు కేటాయించే షాపుల సంఖ్యను నిర్ధారించింది. ఈ నెల 21న శంషాబాద్‌లోని మల్లికా కన్వెన్షన్‌లో లక్కీడ్రా నిర్వహించనుంది. ఈ డ్రా ద్వారా దరఖాస్తుదారులకు షాపులను కేటాయించి, ఆయా షాపులకు 30న కొత్త సరుకును అందజేయనుంది.

కూకట్‌పల్లిలో సరికొత్త ట్రయంఫ్ షోరూమ్

కూకట్‌పల్లి: వాహన ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ట్రయంఫ్ షోరూమ్ కూకట్‌పల్లిలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రో బైకింగ్ ప్రెసిడెంట్ సుమీత్ నారంగ్ ట్రయంఫ్ షోరూమ్‌ను ప్రారంభించగా, వర్క్ షాపును ప్రో బైకింగ్ సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ పింగ్లే ప్రారంభించారు. కొత్త ట్రయంఫ్ స్పీడ్ 400 బైక్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా సుమీత్ నారంగ్ మాట్లాడుతూ ఈ ఈవెంట్ భారతీయ మోటార్ సైకిల్ పరిశ్రమకు ప్రతిష్టాత్మకంగా నిలుస్తుందన్నారు.

వాటర్ ట్యాంకు కూలి వ్యక్తి దుర్మరణం

కుత్బుల్లాపూర్: ఇంటి మిద్దెపైనున్న వాటర్ ట్యాంకు కూలి..ఒక్కసారిగా పక్కనే ఉన్న రేకుల ఇంటిపై పడడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..జీడిమెట్ల ప్రశాంత్‌నగర్‌కు చెందిన రమేష్ (36), చిట్టెమ్మలు భార్యాభర్తలు. వీరు ఓ ఇంట్లో రేకులు వేసిన గదిలో అద్దెకు ఉంటున్నారు. సోమవారం భార్యాభర్తలిద్దరూ ఇంట్లో ఉండగా..పక్కనున్న ఇంటి మిద్దెపైనున్న సింటెక్స్ వాటర్ ట్యాంక్ పగిలి వీరి ఇంటిపై పడింది. ఈ ఘటనలో రమేష్ తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటి యజమాని నిర్లక్ష్యం వల్లే తన భర్త చనిపోయాడని మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెల్ఫీ ఫెస్ట్

- సాలార్‌జంగ్ మ్యూజియం, రైల్వే స్టేషన్‌లు తదితర ప్రాంతాల్లో సెల్ఫీ పాయింట్లు
- జాతీయతను పెంపొందించేందుకు కాంటెస్ట్



సాక్షి, సిటీబ్యూరో: స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో దేశ పురోగతిని ఘనంగా ప్రదర్శించడం కోసం రూపొందించిన సెల్ఫీ కాంటెస్ట్‌కు ప్రత్యేక ఆదరణ లభిస్తోంది. ఇందులో భాగంగా నగరంలోని సాలార్‌జంగ్ మ్యూజియం, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, కాజీపేట్ రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో కేంద్ర సమాచార శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యునికేషన్ ఆధ్వర్యంలో సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఈ సెల్ఫీ పాయింట్లను స్వచ్ఛ భారత్, స్టార్టప్ ఇండియా, అంతరిక్ష పరిశోధనలు ప్రతిబింబించేలా పోస్టర్లతో రూపొందించారు. ఈ వేదికల వద్ద పౌరులు సెల్ఫీలు తీసుకుని సోషల్ మీడియా వేదికగా షేర్, పోస్టులు చేస్తూ తమ దేశభక్తిని చాటుకుంటున్నారు. ఈ వేదికల్లో తాజాగా చంద్రయాన్-3తో అంతర్జాతీయ ఖ్యాతిని సంపాదించుకుని, దేశ ప్రతిష్టతను మంరింత పెంచిన అంతరిక్ష పరిశోధనలను ప్రతిబింబించే పోస్టర్లు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

మోకిలా రెండో దశ ప్లాట్ల వేలం

- 300 ప్లాట్‌లకు ఆన్‌లైన్ బిడ్డింగ్
- ఈ నెల 23 నుంచి 29 వరకు వేలం
- నోటిఫికేషన్ విడుదల చేసిన హెచ్‌ఎండీఏ

సాక్షి, సిటీబ్యూరో: మోకిలాలో మరోసారి ప్లాట్‌లు వేలం వేసేందుకు హెచ్‌ఎండీఏ సన్నాహాలు చేపట్టింది. ఇటీవల 50 ప్లాట్‌లకు నిర్వహించిన బిడ్డింగ్‌లో అత్యధికంగా గజం రూ.లక్షకు పైగా అమ్ముడైన సంగతి తెలిసిందే. కనిష్టంగా రూ.72 వేలకు గజం చొప్పున విక్రయించారు. ఈ క్రమంలోనే మరో 300 ప్లాట్‌లను ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా విక్రయించేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 23వ తేదీ నుంచి 29 వరకు ఈ ప్లాట్‌లకు బిడ్డింగ్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. తాజాగా రిజిస్ట్రేషన్‌లను కూడా ఆహ్వానించారు. ఈ ప్లాట్‌లలో ఒక్కోటి కనిష్టంగా 300 చదరపు గజాల నుంచి గరిష్టంగా 500 చదరపు గజాల విస్తీర్ణం వరకు ఉన్నాయి. 300 గజాల చొప్పున మొత్తం 195 ప్లాట్‌లు, 400 గజాల చొప్పున 20 ప్లాట్‌లు అమ్మకానికి ఉన్నాయి. 500 గజాల విస్తీర్ణం కలిగినవి 6 ప్లాట్లు ఉన్నాయి. ఇలా వివిధ సైజుల్లో ఉన్న మొత్తం 300 ప్లాట్‌లపైన చదరపు గజానికి రూ.25 వేల చొప్పున కనీస ధరను నిర్ణయించారు. బిడ్డింగ్ సమయంలో గజానికి రూ.1000 చొప్పున పెంచేందుకు అవకాశం ఉంటుంది. ఆరు రోజుల పాటు నిర్వహించనున్న ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో రోజుకు రెండు సెషన్‌లలో వేలం ఉంటుంది. ఒక్కో సెషన్‌లో 30 ప్లాట్‌ల చొప్పున రోజుకు 60 ప్లాట్లు విక్రయించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆసక్తి గల కొనుగోలుదారులు ఈ నెల 21వ తేదీ వరకు రూ.లక్ష డిపాజిట్ చెల్లించవచ్చు. మోకిలా మొదటి దశలో సుమారు 15,800 చదరపు గజాలను విక్రయించగా, రెండో దశలో 300 ప్లాట్‌లలో సుమారు 98,975 చదరపు గజాల వరకు విక్రయించనున్నట్లు అంచనా. మొదటి దశలో అమ్ముడైన 50 ప్లాట్‌లపైన రూ.121.40 కోట్ల ఆదాయం లభించింది. ఈ ప్లాట్‌లపైన సుమారు రూ.800 కోట్ల వరకు ఆదాయం రావచ్చునని అధికారులు అంచనా వేశారు. నార్సింగి-శంకర్‌పల్లి మార్గంలో ఉన్న మోకిలాలో భూములు హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నాయి. హెచ్‌ఎండీఏకు ఇక్కడ మొత్తం 165 ఎకరాల భూములు ఉన్నాయి. కోకాపేట్‌లో నియోపోలిస్ రెండో దశ భూముల తరువాత మోకిలాలోనూ హెచ్‌ఎండీఏ ప్లాట్‌లకు భారీ డిమాండ్ కనిపించడం గమనార్హం.

hmda Growing Global

సొమ్ము చెల్లించని ప్లాట్‌లకు మరోసారి వేలం...

నగరంలోని వివిధ ప్రాంతాల్లో గతంలో నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో పాల్గొని వివిధ స్థాయిలో సొమ్ము చెల్లించకుండా ఎగవేసిన కొనుగోలుదార్ల ప్లాట్‌లకు మరోసారి ఆన్‌లైన్ బిడ్డింగ్ నిర్వహించనున్నారు. బాచుపల్లి, మేడిపల్లి, ఉప్పల్ భగాయత్, మోకిలా తదితర చోట్ల కొన్ని డిఫాల్టర్ ప్లాట్లు ఉన్నట్లు ఒక అధికారి తెలిపారు. కొందరు డిపాజిట్ మాత్రమే చెల్లించగా, మరి కొందరు 25 శాతం చెల్లించి సకాలంలో బ్యాంకు రుణాలు లభించకపోవడం, ఇతరత్రా వ్యక్తిగత కారణాల వల్ల వదిలేసుకున్నట్లు సమాచారం. అలా బాచుపల్లిలో సుమారు 50 ప్లాట్‌ల వరకు ఉన్నాయి. మేడిపల్లిలోనూ ఇంచుమించు 50 వరకు ఉన్నాయి. ఇటీవల మోకిలాలో నిర్వహించిన వేలంలో ఇద్దరు కొనుగోలుదారులు నిబంధనలకు విరుద్ధంగా బిడ్డింగ్ సొమ్మును అధికంగా వేయడంతో 2 ప్లాట్‌ల బిడ్డింగ్‌ను రద్దు చేశారు. వాటికి కూడా త్వరలో వేలం జరుగనుంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన సాయిరాం

రాజేంద్రనగర్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..శివరాంపల్లి న్యూవీకర్ సెక్షన్ కాలనీకి చెందిన పి.సాయిరాం (20) కాళీమందిర్ ప్రాంతంలోని కోడిగుడ్ల షాపులో పనిచేస్తుంటాడు. సోమవారం ఉదయం శివరాంపల్లి నుంచి రాజేంద్రనగర్ మీదుగా హిమాయత్‌సాగర్ ఔటర్‌రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు నుంచి బైక్‌పై వెళ్తున్నాడు. ఔటర్ రింగ్‌రోడ్డు సర్వీస్ రోడ్డు కూడలి వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో సాయిరాం కిందపడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్



సాయితేజ మహేష్ ధీరజ్

అడ్డగూడూరు : ముగ్గురు గంజాయి విక్రేతలను యాదాద్రి జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 300 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్‌లోని వారాసిగూడకు చెందిన కనుకు సాయితేజ, మహేష్, ధీరజ్‌లు కొంత కాలంగా నిషేధిత గంజాయి వ్యాపారం చేస్తున్నారు. వీరు యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలో గంజాయిని విక్రయించేందుకు సోమవారం సికింద్రాబాద్ నుంచి బస్సులో బయలుదేరారు. అడ్డగూడూరు మండలం చిర్రగూడూరు స్టేజీ వద్ద బస్సు దిగి వస్తుండగా అప్పటికే పక్కా సమాచారంతో కాపుగాస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

మేడిపల్లి పోలీస్ స్టేషన్‌కు కేంద్రం గుర్తింపు



మేడిపల్లి: దేశం మొత్తం మీద ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీస్ స్టేషన్ల జాబితాలో మేడిపల్లి పోలీస్ స్టేషన్ చోటు దక్కించుకుంది. హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ నుంచి మొత్తం మూడు పోలీస్‌స్టేషన్‌లు ఎంపికయ్యాయి. కాగా రాచకొండ కమిషనరేట్ పరిధిలో మేడిపల్లి పోలీస్ స్టేషన్‌ను కేంద్ర హోం మంత్రిత్వశాఖ నుండి ముగ్గురు సభ్యులు గల బృందం ఈ నెల 13న సందర్శించారు. దీనిలో భాగంగా స్టేషన్ పరిసర ప్రాంతాలు, స్టేషన్ మేనేజ్‌మెంట్, అడ్మినిస్టేషన్ వ్యవహారాలు, కేసుల దర్యాప్తు తీరుతెన్నులు, మహిళలు, చిన్నపిల్లలపై జరిగే నేరాలపట్ల దర్యాప్తు తీరును పరిశీలించారు. కేంద్రబృందం సభ్యులు పోలీసులకు..ప్రజలతో గల సత్సంబంధాల గురించి ఆరా తీశారని స్టేషన్ సీఐ గోవర్ధనగిరి తెలిపారు.

మెడికల్ షాపు ముందే కుప్పకూలి..

- గుండెపోటుతో వ్యక్తి మృతి
- డాక్టర్ ఇచ్చిన ఇంజెక్షన్ వల్లేనని బంధువుల ఆరోపణ



మెడికల్ షాపు వద్ద పడి మృతి చెందిన శ్రీనివాస్

రాజేంద్రనగర్: ఛాతిలో నొప్పిగా ఉందని.. ఆసుపత్రికి వెళ్లొస్తానని భార్యకు చెప్పి బయటకు వెళ్లిన వ్యక్తి మెడికల్ షాపుముందే కుప్పకూలాడు. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మౌనిక తెలిపిన వివరాల ప్రకారం చేవెళ్ల గుండాల గ్రామానికి చెందిన శ్రీనివాస్(40), సబిత భార్యాభర్తలు. వీరికి ముగ్గురు సంతానం. బతుకుదెరువు కోసం శ్రీనివాస్ కొన్ని నెలల క్రితం బుద్వేల్ ప్రాంతానికి వలస వచ్చి ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం పది గంటల ప్రాంతంలో ఛాతిలో నొప్పిగా ఉందని భార్యకు చెప్పి...స్థానిక హరిజన బస్తీలోని ఆర్‌ఎంపీ వైద్యుడు సి.హెచ్.రఘురావు వద్దకు వెళ్లాడు. పరీక్షించిన రఘురావు చీటిపై మందులు రాసి తీసుకురావాలని పంపించాడు. ఆసుపత్రి ప్రాంగణంలోనే ఉన్న నిత్య మెడికల్ హాల్ వద్దకు వెళ్లిన శ్రీనివాస్ మందుల చీటీ మెడికల్ షాపు యజమానికి ఇచ్చి..అక్కడే అలాగే కుప్పకూలాడు. దీంతో మెడికల్‌షాపు యజమాని పక్కనే ఉన్న డాక్టర్‌కు వెళ్లి తెలిపాడు. డాక్టర్ వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. అతడి వద్ద ఉన్నఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ ఎస్ఐ మౌనిక సంఘటన స్థలానికి చేరుకోని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. ఎస్ఐ మౌనిక మాట్లాడుతూ డాక్టర్ ఇంజెక్షన్ ఇవ్వడం వల్లనే తన భర్త చనిపోయాడని శ్రీనివాస్ భార్య సబిత ఆరోపించిందని, పోస్టుమార్టం నివేదిక వచ్చిన అనంతరం కేసు నమోదు చేస్తామన్నారు. కాగా ఈ విషయం తెలుసుకున్న చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం బుద్వేల్ ప్రాంతానికి వచ్చారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఆర్‌ఎంపీ డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి...

ఆర్‌ఎంపీ డాక్టర్ రఘురావు కారణంగానే తన భర్త మృతి చెందాడని శ్రీనివాస్ భార్య సబిత ఆరోపించింది. ఆయన ఇచ్చిన ఇంజెక్షన్ వల్లే ఈ ఘటన జరిగిందని, తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేసింది.

నగరం నుంచి వెళ్లి పుణేలో చోరీలు!

- అక్కడి బస్సుల్లో తిరుగుతూ సెల్‌ఫోన్లు తస్కరణ
- నలుగురు సభ్యుల ముఠాలో ఇద్దరు నగర వాసులు
- అరెస్టు చేసిన అక్కడి బండ్ గార్డెన్ పోలీసు అధికారులు
- ఆ ఫోన్లు తీసుకువచ్చి సిటీలో విక్రయించారనే అనుమానం

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు..ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లకు చెందిన ఒక్కొక్కరు కలిసి ఓ ముఠాగా ఏర్పడ్డారు. మహారాష్ట్రలోని పుణే నగరాన్ని టార్గెట్‌గా చేసుకుని సెల్‌ఫోన్ చోరీలు ప్రారంభించారు. ఈ ముఠాను శనివారం అరెస్టు చేసిన అక్కడి బండ్‌గార్డెన్ పోలీసులు 12 సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. వీళ్లు అక్కడి బస్సుల్లో సంచరిస్తూ ప్రయాణికులను వద్ద ఉన్న ఫోన్లు తస్కరిస్తున్నట్లు గుర్తించారు. ఈ గ్యాంగ్ చోరీ చేసిన హైఎండ్ ఫోన్లలో కొన్నింటిని నగరానికి తీసుకువచ్చి విక్రయించారనే అనుమానంతో ఆ కోణంలో ఆరా తీస్తున్నారు. నగరంలోని పార్శిగుట్ట, టోలిచౌకి ప్రాంతాలకు చెందిన మదుగోలు సతీష్, దాస్ విక్రమ్ స్నేహితులు. దాస్ డిగ్రీ వరకు చదవగా.. సతీష్ పాఠశాల దశలోనే చదువుకు స్వస్తి చెప్పారు. ఈ ద్వయానికి కొన్నాళ్ల క్రితం ఏపీలోని పార్వతీపురం ప్రాంతానికి చెందిన అవల జగదీష్‌తో పరిచయం ఏర్పడింది. అతడి ద్వారా ఛత్తీస్‌గఢ్ వాసి గోండు గణేష్ వీరితో జట్టుకట్టాడు. ఈ నలుగురూ ఓ ముఠాగా ఏర్పడి మహారాష్ట్రలోని పుణే నగరాన్ని టార్గెట్‌గా చేసుకున్నారు.

గత వారం పుణే చేరుకున్న ఈ నలుగురూ మరోసారి తమ చేతులకు 'పని' చెప్పారు. కేవలం మూడు రోజుల్లోనే 12 ఖరీదైన ఫోన్లు తస్కరించారు. వీటిని విక్రయించడం కోసం శనివారం అక్కడి మాల్‌ధక్కా చౌక్‌కు చేరుకున్నారు. ఈ నలుగురూ కొత్త వారుగా కనిపించడం, వీళ్ల వద్ద అనేక సెల్‌ఫోన్లు ఉండటం గమనించిన స్థానికులు అనుమానించారు. వెంటనే బండ్ గార్డెన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకున్న పోలీసులు నలుగురినీ అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

కుష్టు వ్యాధి నివారణకు సర్వే

- ఈ నెల 16 నుంచి 31 వరకు
- ఆశా కార్యకర్తలతో బృందాల ఏర్పాటు
- అనుమానిత లక్షణాలు ఉంటే వైద్యాధికారులకు చూపించుకోవాలి

గడచిన మూడు సంవత్సరాలుగా కుష్టువ్యాధి నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. వైద్య, ఆరోగ్య శాఖాధికారులు కుష్టువ్యాధిగ్రస్తుల గుర్తింపు కోసం ప్రత్యేక సర్వే చేపడుతున్నారు. ప్రతి సంవత్సరం రెండుసార్లు వ్యాధిగ్రస్తులను గుర్తిస్తూ వారికి ఉచితంగా మందుల పంపిణీతో పాటు ఆస్పత్రులను సిఫారసు కూడా చేస్తున్నారు. ఇందు కోసం ఆయా పీహెచ్‌సీల పరిధిలో ఆశా కార్యకర్తలు సిబ్బందితో బృందాలను ఏర్పాటుచేసి సర్వేచేపడుతున్నారు.



సర్వేలో పాల్గొన్న ఆశా వర్కర్లు (ఫైల్)

బంజారాహిల్స్: ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో ఉన్న 10 ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఈ నెల 16 నుంచి 31 వరకు ఇంటింటి సర్వే చేపట్టనున్నారు. ఇప్పటికే నోడల్ అధికారులకు శిక్షణ పూర్తయింది. ఈ కీలక సర్వేకు ఆశా వర్కర్లతో కూడిన బృందాలు సిద్ధమవుతున్నాయి. తగిన సామగ్రిని కూడా అధికారులు వీరికి అందజేశారు.

వ్యాధిగ్రస్తుల సంఖ్య తగ్గించండి...

కుష్టువ్యాధిగ్రస్తుల సంఖ్య తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది. ప్రాథమికంగా లక్షణాలు గుర్తించడం, వ్యాధి తీవ్రత ఉన్నవారికి సరైన వైద్యం చేయించడమే ఈ ప్రత్యేక కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. శరీరంపై స్పర్శలేని మచ్చలను గుర్తించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేపడతారు.

- మూడంచెల విధానంలో ఈ పరీక్షలు జరుగుతాయని బంజారాహిల్స్ రోడ్ నెం. 7లోని యూపీహెచ్‌ఎస్ డాక్టర్ నాగ కార్తీక్ తెలిపారు. అనుమానితులకు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు, లెప్రసీ విభాగం అధికారులు క్షేత్ర స్థాయిలో పరీక్షలు నిర్వహిస్తారు. పాజిటివ్ వస్తే ఎండీటీ కొనసాగిస్తూ మందులు సమయానుకూలంగా పంపిణీ చేస్తారు. అవసరమైన వారికి సామగ్రిని అందజేస్తారు.
- ప్రస్తుతం ఈ రెండు నియోజకవర్గాల్లో కలిపి 64 మంది నమోదై ఉన్నారు. బాధితుల సంఖ్య పెరగకుండా ఎప్పకటిప్పుడు సర్వేలో చేపడుతూ నియంత్రణ చర్యలు తీసుకుంటున్నారు. మూడేళ్లుగా వరుస కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో ఈ వ్యాధికి గురవుతున్న వారి సంఖ్య తగ్గుతూ వస్తుందని వైద్యాధికారులు తెలిపారు. 2020–21లో కోవిడ్ విజృంభణతో సర్వే ఆగిపోగా ఆ తర్వాత ఏడాది నుంచి ప్రతిఏటా రెండు దఫాలుగా నిర్వహిస్తున్నారు.

సిబ్బందికి సహకరించాలి

చాలా మంది కుష్టువ్యాధి బాధితులు లక్షణాలు గుర్తించలేని స్థితిలో ఉంటున్నారు. అందుకే ఇంటింటికి వెళ్ళి సర్వే చేపట్టేలా ప్రణాళికలు రూపొందించడం జరిగింది. ఈసర్వే కోసం వచ్చే బృందాలకు సహకరించాలి. ఇంట్లోకి ఆహ్వానించ వారికి పూర్తి వివరాలు అందజేయాలి. లక్షణాల నిర్ధారణ కోసం పరిశీలన నిమిత్తం వారిని అనుమతించాలి.

- ఎవరికీ ఇబ్బందులు లేకుండా ఈ బృందంలో స్త్రీ, పురుష వైద్య సిబ్బంది ఉంటారనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. అనుమానిత లక్షణాలు ఉంటే స్థానిక వైద్యాధికారి లేదా లెప్రసీ విభాగం అధికారులు, వైద్యులు, చర్మవ్యాధి నిపుణులు పరీక్షలు చేస్తారు.

16 నుంచి ఈ సర్వే ప్రారంభం..



ఈ నెల 16వ తేదీ నుంచి ఈ సర్వే ప్రారంభం అవుతుంది. ప్రతి గడపను తట్టే విధంగా సర్వే చేయాలని ఇప్పటికే ఆశా కార్యకర్తలకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. పూర్తి శిక్షణ పొందిన వారు ఈ సర్వేలో పాల్గొంటున్నారు.

– డాక్టర్ కార్తీక్, బంజారాహిల్స్ యూపీహెచ్‌సీ

క్లుప్తంగా...

కాశీవిశ్వేశ్వరుడికి ప్రత్యేక పూజలు



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నేత కీర్తిరెడ్డి

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని శ్రీకాశీవిశ్వేశ్వర ఆలయంలో సోమవారం బీజేపీ సీనియర్ నాయకురాలు కీర్తిరెడ్డి జూటూరు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. పూజల్లో నేతలు సతీష్, సూర్య, సురేష్, శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కనులపండువగా ఫలహారం బండి ఊరేగింపు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని జవహర్‌నగర్‌లో అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపు కనులపండువగా సాగింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఈ ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు. అంతకుముందు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. స్థానికులు వందలాదిగా తరలి రావడంతో ఆ ప్రాంతమంతా జాతరను తలపించింది. పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఇంటింటికీ జాతీయ జెండాల పంపిణీ



ఇందిరానగర్‌లో జాతీయ జెండాలను అందజేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

బంజారాహిల్స్: పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకొని ఘర్ ఘర్‌కు తిరంగా కార్యక్రమంలో భాగంగా జీహెచ్ఎంసీ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ సర్కిళ్ళ పరిధిలో ఉన్న బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్ డివిజన్లలోని నివాసితులకు ఇంటింటికి తిరుగుతూ జాతీయ జెండాలను అందజేస్తున్నారు. ప్రంద్రాగస్టున ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ సిబ్బంది సూచించారు. ప్రజల్లో జాతీయ భావాలను పెంపొందించే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ జాతీయ జెండాలను పంపిణీ చేస్తున్నట్లు వారు తెలిపారు.

గ్రీనరీ ఎప్పుడో?



చెత్తాచెదారంతో నిండిన పంజగుట్ట ఫ్లై ఓవర్ కింది భాగం

బంజారాహిల్స్: పంజగుట్ట చౌరస్తాలో సుందరీకరించాలని లక్షలాది రూపాయలు విడుదల చేశారు. సోమాజిగూడ వైపు నుంచి పంజగుట్ట వైపు వెళ్లే వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వెనుక ఇప్పటికే రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసి ఫుట్‌పాత్ కూడా వేశారు. అయితే సుందరీకరణ అంటే ఇదే అనుకున్న ఇంజినీర్లు మాత్రం చౌరస్తాకు నాలుగు వైపులా ఉన్న సెంట్రల్ మీడియన్లను గాలికి వదిలేశారు. అప్పటికే ఉన్న మొక్కలను తొలగించి ఇంకా కొత్తవి నాటకపోవడంతో చెత్తా చెదారంతో పాటు ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలతో సెంట్రల్ మీడియన్లు కంపు కొడుతున్నాయి. పనులు ప్రారంభించడంలో జీహెచ్ఎంసీ ఇంజినీర్లు మీన మేషాలు లెక్కిస్తున్నారు. చౌరస్తాలో పారిశుద్ధ్య సమస్య తీవ్ర రూపదాల్చి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి సెంట్రల్ మీడియన్‌లో మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రామకృష్ణానగర్‌బస్తీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా..



రామకృష్ణానగర్ బస్తీ మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బంజారాహిల్స్: ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలతో లబ్ధి పొందుతున్న తాము బీఆర్ఎస్‌కు అండగా నిలబడకపోతే కృతజ్ఞత లేనివారం అవుతామని అందుకే బీఆర్ఎస్‌కు జై కొడుతూ ఆ పార్టీలో చేరుతున్నట్లు ఖైరతాబాద్ డివిజన్ రామకృష్ణానగర్ బస్తీ మహిళలు స్పష్టం చేశారు. బస్తీకి చెందిన వంద మంది వివిధ పార్టీలకు చెందిన మహిళలు సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దానం సమక్షంలో పార్టీలో చేరారు. వీరందరికీ గులాబీ కండువాలు కప్పిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు సముచిత స్థానం, సంక్షేమ పథకాలు అమలవుతాయన్నారు. రాబోయేది సీఎం కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వమేనని వెల్లడించారు. రామకృష్ణానగర్ బస్తీని తన సొంత బస్తీగా చూసుకుంటానని ఏ సమస్య వచ్చినా ముందుంటానని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో మహిళల అండదండలు పూర్తిగా దానంకే ఉంటాయని మహిళలు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొయ్యాడ అరుణ్‌కుమార్‌తో పాటు మహిళా నేతలు మంగ, నవనీత, రుక్మిణి, సరిత, తదితరులు పాల్గొన్నారు.

అసాంక్రమిక వ్యాధుల నివారణపై శిక్షణ ప్రారంభం

బంజారాహిల్స్: అసాంక్రమిక వ్యాధుల (నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్)ను ప్రారంభంలోనే గుర్తించి వైద్య అందించేలా కేంద్ర ప్రభుత్వం రెండో దశ స్క్రీనింగ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. హైదరాబాద్‌లోని ప్రభుత్వ ప్రాథమిక కేంద్రాల వైద్యాధికారులు, స్టాఫ్‌నర్స్‌లు, ఏఎన్ఎంలు యూపీహెచ్‌సీ అకౌంటెంట్ డీఈవోలకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ నెల 14, 17, 18, 21వ తేదీల్లో నాలుగు రోజులపాటు ఈ శిక్షణ ఇచ్చేందుకు యశోదా ఆస్పత్రి, అపోలో ఆస్పత్రి ఆడిటోరియంలోను ఎంపిక చేశారు. సోమవారం ఈ శిక్షణ ప్రారంభమైంది. ఈ శిక్షణ కోసం నగరానికి చెందిన ముగ్గురు వైద్యాధికారులకు ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కోసం ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా డాక్టర్ అశ్రితా రెడ్డి వెంగళరావునగర్ రీజనల్ హెల్త్ అండ్ ప్లానింగ్ వెల్ఫేర్ టీచింగ్ సెంటర్ వైద్యుడు డాక్టర్ మనోజ్ రెడ్డి, బంజారాహిల్స్ రోడ్ నెం–7 పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నాగ కార్తీక్ రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొంది జిల్లా స్థాయిలో వైద్యాధికారులు, ఇతర సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వీరితో పాటు డేటా ఎంట్రీ ఆపరేటర్ శరత్ కూడా హాజరయ్యారు. వైద్యాధికారులు, సిబ్బందిని ఉద్దేశించి డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి మాట్లాడారు.

మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మేయర్ చొరవ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 12లోని ఎన్‌బీటీ నగర్‌లో మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కృషి చేసిన గ్రేటర్ మేయర్ గద్వాల విజయలక్ష్మిని బస్తీవాసులు అభినందించారు. గడిచిన ఏడు సంవత్సరాలుగా ఆమె ఒకవైపు ఈ స్థలాన్ని కాపాడడంతోపాటు మరోవైపు అధికారులతో సమీక్షలు నిర్వహించి నిధులు మంజూరు చేయించారని బస్తీవాసుల కోరిక నెరవేర్చడంలో ఆమె చూపిన శ్రద్ధ ప్రశంసనీయమన్నారు. పేదల కోసం ఫంక్షన్ హాల్‌ను నిర్మించడమే కాకుండా ఈ స్థలాన్ని రెవెన్యూ నుండి జీహెచ్ఎంసీకి అప్పగించడంలో కలెక్టర్‌తో ఎన్నో సార్లు సమావేశమయ్యారు. స్థాయి సంఘానికి ఈ ప్రతిపాదనలను తెప్పించుకుని బడ్జెట్ కేటాయించి పనులు ప్రారంభించే సమయంలోనే కొంతమంది కబ్జాదారులు, అసాంఘిక శక్తులు ఆక్రమించేందుకు యత్నించగా ఆ కుట్రలను తిప్పికొట్టడంలో మేయర్ కృషి ఎంతో ఉందని బస్తీ మహిళలు వెల్లడించారు. ఇటీవల ఈ స్థలాన్ని కాపాడుకునేందుకు ప్రహరీ నిర్మించగా మేయర్ దగ్గరుండి పనులు పర్యవేక్షించారని, స్థలం కబ్జాదారుల పరం కాకుండా చూశారని మహిళా సంఘాలు బస్తీ యువత హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేయర్‌కు ఎన్‌బీటీ నగర్, ఎమ్మెల్యే కాలనీవాసుల నుంచి కృతజ్ఞతలు వెల్లువెత్తాయి.

సంక్షేమ పథకాలకు ప్రజాదరణ

ఫిలింనగర్: ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మహిళలు పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరుతున్నారని, రానున్న రోజుల్లో ఈ చేరికలు మరింతగా జరుగుతాయని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జూబ్లీహిల్స్ డివిజన్ ప్రశాసన్‌నగర్ కాలనీలో నివాసాల్లో పనిచేసే మహిళలు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే దానం సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ప్రశాసన్‌నగర్ మహిళలు

ప్రమాదకరంగా పైప్‌లైన్ గుంతలు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని సింగాడికుంటలో మంచినీటి పైప్‌లైన్ నిర్మాణం కోసం నెలన్నర క్రితం శంకుస్థాపన చేశారు. ఈ పైపుల నిర్మాణం కోసం రోడ్డు కూడా తవ్వారు. తీరా పనులు ప్రారంభం కాకపోవడంతో గుంతలు, రాళ్లలో పడి స్థానికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రూ. 18 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఈ పైప్‌లైన్ నిర్మాణం కోసం 18 పైపులు తీసుకొచ్చి రోడ్డు పక్కన పడేశారు. రాత్రిపూట చీకటిగా ఉంటుండటంతో స్థానికులు పైపులు, తవ్వేసిన రోడ్డుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చోటు భాయి దుకాణం నుంచి శ్రీనివాస మెడికల్స్ వరకు ఈ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. జలమండలి ఇంజనీర్ల నిర్వాకంతో పనులు ముందుకు సాగడం లేదు. వర్షాకాలంలో వరద నీరు నిలిచిపోయి స్థానికంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు అధికారుల తీరుపై భగ్గుమంటున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే నాగేందర్ స్పందించి పనులు ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎన్నికల దగ్గరపడుతున్న వేళ అభివృద్ధి పనులు ముందుకు సాగకపోతే స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురయ్యే ప్రమాదం ఉంది.

సంస్కార్ స్కూల్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం



శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డలోని సంస్కార్ ది లైఫ్ స్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో ఆకట్టుకున్నారు. పోరాటయోధుల త్యాగాలు.. వారి పోరాట పటిమ నాటకాలు ద్వారా వివరించి ఆలోచింపజేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. స్కూల్ సీఈఓ మోహనవంశీ, డైరెక్టర్ మధుమతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముందు అల్లరి చేయొద్దన్నందుకు దాడి

పంజగుట్ట: ఇంటిముందు అల్లరి చేయకండి అన్నందుకు ఓ వ్యక్తిపై దాడిచేసి తీవ్రంగా గాయపిచిన సంఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పంజగుట్ట ప్రతాప్‌నగర్‌లో నివసించే ఎస్.జె.విఠల్ స్కూల్ టీచర్. ఇతను ఈ నెల 12వ తేదీన పాఠశాల ముగించుకుని ఇంటికి వచ్చే క్రమంలో సోదరుడు ఎస్.జె.గౌతంరావు ఇంటిముందు గొడవ జరగడం గమనించాడు. గౌతంరావు ఇంటిముందు ఇంటి ఎదురుగా ఉండే పిల్లలు అల్లరిచేస్తుండటంతో ఇంటిముందు ఆడుకోవద్దు అని చెప్పాడు. ఎదురు ఇంట్లో నుంచి విజయ్ కుమార్ అనే వ్యక్తి వచ్చి పిల్లలను ఎందుకు ఆడుకోవద్దు అంటావు అని వాగ్వాదానికి దిగాడు. బూతులు తిడుతున్నాడు. ఇంతలో విజయ్ కుమార్ బావమరిది దినేష్ కుమార్ వచ్చి స్టిక్‌తో గౌతంరావు తలపై కొట్టడంతో గౌతంరావు తల పగిలి తీవ్రంగా గాయపడ్డాడు. గౌతం రావు సోదరుడు విఠల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం.. భర్త ఫిర్యాదు



అదృశ్యమైన శ్రావణి

ఖైరతాబాద్: తన భార్య కనిపంచడం లేదని వ్యక్తి ఫిర్యాదు చేసిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... ఖైరతాబాద్ మారుతీనగర్‌లో నివాసముండే గూడూరు గణేష్ ప్రైవేటు ఉద్యోగి. 2020లో ఖమ్మం జిల్లాకు చెందిన గూడూరు శ్రావణి (22)తో వివాహం జరిగింది. వీరికి 2021లో పాప పుట్టింది. ఆ తరువాత పుట్టింటికి వెళ్లిన తన భార్య 5 నెలల తరువాత తిరిగి వచ్చింది. ఆ తరువాత తన ప్రవర్తనలో మార్పు వచ్చింది. విషయం ఆరా తీయగా పుట్టింటి దగ్గర ఓ వ్యక్తితో మాట్లాడుతున్న విషయం తెలుసుకొని బంధువుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చామని భర్త ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ తరువాత బాగానే ఉందని, ఈ నెల 12వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు డ్యూటీకి వెళ్లి రాత్రి 9.30 గంటలకు ఇంటికి వచ్చి చూసే సరికి భార్య, పాప కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో, అత్తమామలకు ఫోన్ చేసి విచారించినా అక్కడికి రాలేదని తెలియడంతో ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. భర్త ఫిర్యాదుతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎం చోరీకి యత్నించిన యువకుడి అరెస్టు


12 గంటల్లోనే నిందితుడిని పట్టుకున్న పోలీసులు



నిందితుడు వెంకటేష్

ఫిలింనగర్: మద్యానికి బానిసైన ఓ యువకుడు రోజువారీ సంపాదన సరిపోకపోవడంతో ఈజీమనీ కోసం ఏటీఎంను కొల్లగొట్టేందుకు యత్నించి కటకటాల పాలయ్యాడు. ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనలో పోలీసులు నిందితుడిని 12 గంటల వ్యవధిలోనే పట్టుకున్నారు. వివరాలివీ... రాయదుర్గంకు చెందిన మంచాల వెంకటేష్(27) మొబైల్ టిఫిన్లు అమ్ముతూ పొట్టపోసుకుంటున్నారు. మద్యానికి బానిసయ్యాడు. డబ్బులు సరిపోకపోవడంతో ఏకంగా ఏటీఎంనే పగలగొట్టి నోట్ల కట్టలు ఎత్తుకెళ్దామని ఆదివారం తెల్లవారుజామున షేక్‌పేట నాలా కరాచీ బేకరీ వద్ద ఎస్‌బీఐ ఏటీఎంను పగలగొట్టేందుకు యత్నించి విఫలం అయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని ఘటన జరిగిన 12 గంటల్లోనే సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయల ధరలు



సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 43, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 23, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 45, పందిరి బీర 23, క్యాబేజీ 20, క్యారెట్ 40, దొండ 35, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 16, దోసకాయ 28, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 26, ఆలుగడ్డ 21, చామగడ్డ 38, మొరంగడ్డ 40, కందగడ్డ 40, సొరకాయ 15, పొట్లకాయ 28, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 4–6 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

న్యూసెన్స్ కేసుల్లో ముగ్గురికి జైలు శిక్ష



నిందితుడు వెంకటేష్

బంజారాహిల్స్: మద్యం మత్తులో న్యూసెన్స్‌కు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న నిందితుడికి పది రోజుల జైలు శిక్ష విధిస్తూ నాంపల్లిలోని పదవ ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే... ఖైరతాబాద్‌కు చెందిన దండగొల్ల వెంకటేష్(37) పెయింటర్‌గా పని చేస్తుంటాడు. రెండు రోజుల క్రితం మద్యం మత్తులో న్యూసెన్స్‌కు పాల్పడ్డాడు. బంజారాహిల్స్ పోలీసులు నిందితుడిపై ఐపీసీ సెక్షన్ 323, 70(సి) కింద కేసు నమోదుచేసి సోమవారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. తీవ్రతను గమనించిన న్యాయమూర్తి నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

ఈవ్‌టీజింగ్ చేస్తున్న నిందితుడికి వారం జైలు...



బి.రాజ్‌కుమార్

శ్రీనగర్ కాలనీకి చెందిన పి.రాజ్‌కుమార్(40) ప్రైవేట్ ఉద్యోగి.రెండు రోజుల క్రితం స్థానికంగా ఓ యువతి వెంటపడి వేధించాడు.ఈవ్‌టీజింగ్ కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు నిందితుడిపై 70(సి) కింద పెట్టి కేసు నమోదు చేసి సోమవారం న్యాయమూర్తి ఎస్.లక్ష్మణ్‌రాజు ఎదుట హాజరుపరిచారు. యువతిని వెంబడిస్తూ ఫొటోలు తీస్తూ, ఈలలు వేస్తూ ఆమెను మానసికంగా వేధిస్తున్నందుకు నిందితుడికి వారం రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించిన ఘటనలో...



ఎ.వెంకటేష్

శ్రీనగర్ కాలనీకి చెందిన ఎ. వెంకటేష్(26)ప్రైవేట్ ఉద్యోగి. కొంత కాలంగా వీధుల్లో అకారణంగా సంచరిస్తూ ఆవారాగా తిరుగుతూ మద్యం మత్తులో న్యూసెన్స్‌కు పాల్పడుతున్నాడు. అంతే కాకుండా ప్రభుత్వం సిబ్బంది విధులకు ఆటంకం కలిగించసాగాడు. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు నిందితుడిపై ఐపీసీ సెక్షన్ 186, 70(బి) కింద కేసు నమోదు చేసి సోమవారం నాంపల్లిలోని పదవ ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు ఎదుట హాజరుపరిచారు. నిందితుడికి పది రోజుల జైలు విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

పోలీసు విధులకు ఆటంకం కల్గించిన యువకుడికి జైలు శిక్ష



షఫీ

రహమత్‌నగర్: పోలీసు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన ఓ యువకుడికి న్యాయ స్థానం పది రోజుల జైలు శిక్ష విధించింది. బోరబండ ఇన్‌స్పెక్టర్ కామల్ల రవి కుమార్ సమాచారం మేరకు... బోరబండ పోలీసుల ఆదివారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో బోరబండకు చెందిన షేక్ షఫీ పోలీసులకు ఆటంకం కలిగించాడు. అదుపులోకి తీసుకున్న అతన్ని పోలీసుల నాంపల్లి న్యాయస్థానంలో హాజరుపర్చారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి పది రోజుల జైలు శిక్ష విధించారు.

క్లుప్తంగా...

కృష్ణా జలాలపై నవంబర్ 29న విచారణ

సాక్షి, న్యూఢిల్లీ : కృష్ణా నదీ జలాల కేటాయింపులపై నవంబర్ 29 సుప్రీం కోర్టు విచారణ జరపనుంది. నదీ పరీవాహక ప్రాంతాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర మధ్య కృష్ణా ట్రిబ్యునల్ నీటి పంపకాలు జరుపుతూ 2010లో తుది అవార్డు జారీ చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ కర్ణాటక సుప్రీం కోర్టులో అభ్యంతరం వ్యక్తం చేస్తూ అప్లికేషన్ దాఖలు చేసింది. ఈ విషయాన్ని జస్టిస్ సూర్యకాంత్ జస్టిస్ దీపాంకర్ దత్తలతో కూడిన ధర్మాసనం ముందు కర్ణాటక తరపు సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ సోమవారం ప్రస్తావించారు. రూ.వేల కోట్లతో కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు పూర్తిగా వచ్చాయని శ్యామ్ దివాన్ తెలిపారు. ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం రాష్ట్రానికి కేటాయించిన జలాల మేరకు విడుదల చేయాలన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా విచారణ వేగవంతం చేయాలని, సముద్రంలోకి వృథాగా నీరు వెళ్లకుండా చూడాలని కోరారు. తొలుత నవంబర్ 21న విచారిస్తామన్న ధర్మాసనం తుది విచారణ నిమిత్తం నవంబర్ 29న విచారణ జాబితాలో చేర్చాలని రిజిస్ట్రార్‌ని ఆదేశించింది.

చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ

చార్మినర్ ఎక్స్‌ప్రెస్‌లోనూ దోపిడీకి యత్నం


ఉలవపాడు: అర్ధరాత్రి వేళ.. అందరూ నిద్రలో ఉన్నారు.. అంతలో ఒక్కసారిగా రైల్లో కలకలం.. బోగీలోకి ఎక్కిన దొంగలు ప్రయాణికులను బెదిరించి వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలు తీసుకుని చైన్ లాగి దర్జాగా రైలు దిగి వెళ్లిపోయారు. చాగల్లు–తెట్టు మధ్య హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. హైదరాబాద్ నుంచి చెన్నైకు వెళ్తున్న హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ రాత్రి గం .1.50 సమయంలో నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం రాజుపాలెం (చాగల్లు–తెట్టు) వద్ద దొంగలు చైన్ లాగడంతో రైలు నిలిచింది. దొంగలు ప్రయాణికులను బెదిరించి వారి నుంచి నగలు అపహరించి రైలు దిగారు. అనంతరం హైదరాబాద్ నుంచి తాంబరం వెళుతున్న చార్మినార్ ఎక్స్‌ప్రెస్ 2.30గం.ల. సమయంలో సిగ్నల్ వద్ద నిలిచిపోయింది. అక్కడే ఉన్న దొంగలు అక్కడే ఉండి ప్రయాణికులను బెదిరించి దోపిడీ చేసేందుకు యత్నించారు. కానీ రైల్వే పోలీసులు టార్చ్‌లైట్లు వేసి వారిని చూడాలని ప్రయత్నించడంతో రైలుపై రాళ్లు రువ్వారు. దీంతో ఆటోలో దొంగలు పారిపోయారు. ఈ రెండు ఘటనలు 40 నిమిషాల వ్యవధిలో జరిగాయి. హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో మొత్తం మూడు బోగీలలో కలిపి 111 గ్రాముల బంగారం దోపిడీ జరిగినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

మారణహోమానికే టీడీపీ నేతల దాడి

ముందస్తు ప్రణాళికతోనే అంగళ్లు నుంచి పుంగనూరు వరకు విధ్వంసం

- ఓ మార్గంలో అనుమతి తీసుకుని చంద్రబాబు మరో మార్గంలో వచ్చారు
- చంద్రబాబు స్వయంగా వేసేయండిరా అంటూ కార్యకర్తలను రెచ్చగొట్టారు
- అడ్డుకొన్న పోలీసులపైనా దాడి చేశారు.. 47 మంది పోలీసులు గాయపడ్డారు
- ఈ ఘటనతో సంబంధం ఉన్న వారందరినీ అరెస్టు చేస్తాం
- ఇలాంటి ఘటనలను, బాధ్యులను కోర్టులు ఉపేక్షించకూడదు
- హైకోర్టుకు నివేదించిన అదనపు ఏజీ సుధాకర్‌రెడ్డి
- విచారణ బుధవారానికి వాయిదా • అప్పటి వరకు పిటిషనర్లపై చర్యలు తీసుకోవద్దని ఏఏజీకి న్యాయమూర్తి మౌఖిక ఆదేశాలు

సాక్షి, అమరావతి : మారణహోమం సృష్టించాలన్న ముందస్తు పక్కా ప్రణాళికతోనే అన్నమయ్య జిల్లా అంగళ్లు వద్ద తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు దాడికి పాల్పడ్డారని పోలీసుల తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టుకు నివేదించారు. అందులో భాగంగానే పోలీసులకు కూడా చెప్పకుండా టీడీపీ అధినేత చంద్రబాబు ప్రయాణ మార్గాన్ని కూడా మార్చారని వివరించారు. పోలీసుల నుంచి ఓ మార్గానికి అనుమతి తీసుకుని, మరో మార్గంలో రావడం వెనుక కుట్ర ఉందన్నారు. టీడీపీ అగ్ర నేతల ఆదేశాలతో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు అధికార పార్టీ కార్యకర్తలపై దాడులు చేశారని, అంగళ్లు నుంచి పుంగనూరు వరకు విధ్వంసం సృష్టించారని తెలిపారు. అడ్డుకోబోయిన పోలీసులపైనా విచక్షణారహితంగా దాడి చేశారన్నారు. టీడీపీ దాడిలో దాదాపు 47 మంది పోలీసులు గాయపడి చికిత్స పొందుతున్నారని, ఓ పోలీసు ఏకంగా కంటి చూపు కోల్పోయారని వివరించారు. అధికార పార్టీ కార్యకర్తలను చూడగానే ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు 'వాళ్లను తరమండిరా, వేసేయండిరా..'అంటూ టీడీపీ కార్యకర్తలను ఉసిగొల్పారన్నారు. ఆయన ఆదేశాలతోనే వారు విధ్వంసం సృష్టించారన్నారు. పోలీసులు రాకుండా ఉంటే వారి చేతిలో పలువురు చనిపోయి ఉండేవారని వివరించారు. కార్యకర్తలను రెచ్చగొట్టినందుకే చంద్రబాబు, ఇతర నేతలపై హత్యాయత్నం కేసు కూడా నమోదు చేశామన్నారు. 'యుద్ధభేరి'పేరుతో ప్రాజెక్టుల సంద



ర్శన కోసం వచ్చి అంగళ్లు నుంచి పుంగనూరు వరకు యుద్ధ వాతావరణం సృష్టించారని, వారు చేయాలనుకున్నది చేసి చూపారని చెప్పారు. ఇలాంటి ఘటనలను, ఇందుకు బాధ్యులైన వారిని న్యాయస్థానాలు ఉపేక్షించకూడదని కోరారు. అంగళ్లు వద్ద టీడీపీ దాడులపై చంద్రబాబు సహా పలువురు టీడీపీ నేతలపై ముదివీడు పోలీసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో ముందస్తు బెయిల్ కోరుతూ టీడీపీ సీనియర్ నేతలు దేవినేని ఉమామహేశ్వరరావు, నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి, పులివర్తి నాని వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి సోమవారం విచారణ జరిపారు.

ఉపయోగపడే ప్రాజెక్టును అడ్డుకోవద్దని కోరితే చంపేస్తారా?

ఈ సందర్భంగా ఏఏజీ సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పలు గ్రామాల ప్రజలకు అత్యంత ఉపయుక్తమైన పిచ్చివాండ్లపల్లి ప్రాజెక్టును అడ్డుకునేందుకు కొందరు టీడీపీ నేతలు హైకోర్టులో స్టే తెచ్చారని, దీనిపై నిరసన తెలిపి, చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చేందుకు స్థానిక అధికార పార్టీ నేతలు అంగళ్లు వద్ద శిబిరం ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు.

అక్కడి రాగానే అధికార పార్టీ నేతలను చూసిన చంద్రబాబు ఆగ్రహంతో ఊగిపోతూ, వారిని తరమండి, కొట్టండి, వేసేయండి అంటూ కార్యకర్తలను రెచ్చగొట్టారని వివరించారు. అక్కడి నుంచి విధ్వంసం మొదలైందన్నారు. మొదటి ముద్దాయి చంద్రబాబును ఎందుకు అరెస్ట్ చేయలేదని న్యాయమూర్తి ప్రశ్నించగా.. విధ్వంసంతో సంబంధం ఉన్న వారందరినీ అరెస్టు చేస్తామని సుధాకర్‌రెడ్డి చెప్పారు. పిటిషనర్ ఉమా సైతం అధికార పార్టీ నేతలను బెదిరించేలా వారి వైపు వేలు చూపుతూ వారిని కొట్టండంటూ టీడీపీ కార్యర్తలను రెచ్చగొట్టారన్నారు. ప్రతిపక్ష నేతలు వస్తున్నారని తెలిసీ, అధికార పార్టీ నేతలు అక్కడికి ఎందుకు వెళ్లారని న్యాయమూర్తి ప్రశ్నించగా.. ప్రజలకు ఉపయుక్తమైన ప్రాజెక్టును అడ్డుకోవద్దని విజ్ఞప్తి చేయడానికే వెళ్లారని, వినతి పత్రం ఇవ్వడానికి సిద్ధమైనంత మాత్రానా చంపేస్తారా అంటూ సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు.

రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే కేసు

అంతకు ముందు దేవినేని ఉమా తరఫు సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ, ఫిర్యాదుదారు ఉమాపతిరెడ్డికి ఎలాంటి గాయాలు కాలేదన్నారు. ఉమాపై ఎలాంటి ప్రత్యక్ష ఆరోపణలు లేవని, రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే కేసు నమోదు చేశారన్నారు. మరింత మంది నేతలను ఇరికించేందుకే కేసు నమోదులో జాప్యం చేశారన్నారు. నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తరఫు న్యాయవాది ఎన్వీ సుమంత్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌పై ఎలాంటి ఆరోపణలు లేవని, ఉద్దేశపూర్వకంగానే కేసు నమోదు చేశారని అన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌రెడ్డి ఏఏజీ అభ్యర్థన మేరకు విచారణను బుధవారానికి వాయిదా వేశారు. అప్పటి వరకు పిటిషనర్లను అరెస్ట్ చేయవద్దని, ఆ మేర పోలీసులకు సూచన చేయాలని సుధాకర్‌రెడ్డికి న్యాయమూర్తి మౌఖికంగా చెప్పారు.

కేసీఆర్ హటావో..తెలంగాణ బచావో..బీజేపీకి జితావో

- ఈనెల 16 నుంచి సెప్టెంబర్ వరకు మూడు విడతల్లో ఉద్యమ కార్యక్రమాలు
- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, కె.లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కేసీఆర్ పాలన పోవాలంటే మరో ఉద్యమం ప్రారంభం కావాల్సిందేనని, ఆయన్ను గద్దె దించేందుకు బీజేపీ మరో ఉద్యమానికి సిద్ధమైందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం



ఆయన మీడియాతో మాట్లాడారు. 'కేసీఆర్ హటావో – తెలంగాణ బచావో– బీజేపీకి జితావో' నినాదంతో పోరాటం ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. ఇందు కోసం మూడు విడతలుగా బీజేపీ ఉద్యమ కార్యక్రమాలు సిద్ధం చేసిందన్నారు. ఆగస్టు 16 నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యాచరణ సెప్టెంబర్ వరకు సాగుతుందని తెలిపారు.

- మొదటి విడత కార్యక్రమాల్లో భాగంగా ఆగస్టు 16న పల్లెబాట, బస్తీబాట, 17న బాధితులు, దరఖాస్తుదారులతో మండల, డివిజన్ల వారీగా ముట్టడి కార్యక్రమం చేపట్టనున్నట్టు చెప్పారు. ఆగస్టు 18న అసెంబ్లీ కేంద్రంగా ప్రధాన రహదారుల్లో రాస్తారోకో, ధర్నా, ముట్టడి అసెంబ్లీ కేంద్రాల్లో దిగ్బంధనం ఉంటుందన్నారు.
- రెండో విడత కార్యక్రమాల్లో భాగంగా ఆగస్టు 23న అధికార పార్టీ ఎమ్మెల్యేల ఘెరావ్, 24న మంత్రుల ఘెరావ్ కార్యక్రమాలతోపాటు ఆగస్టు 27న జిల్లా కలెక్టర్ కార్యాలయ ముట్టడి, జైల్ భరో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.
- మూడో విడత కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ మొదటివారంలో హైదరాబాద్‌లో మిలియన్ మార్చ్ చేపడుతున్నట్టు చెప్పారు.



జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌కు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

తిరుమల: తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం జస్టిస్ భుయాన్ హుండీలో కానుకలు సమర్పించారు. వీరికి రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. కరుణాకర్‌రెడ్డి శాలువతో సత్కరించి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటం అందించారు.

భక్తుల రక్షణే ప్రధాన ధ్యేయం

- అటవీశాఖ సిబ్బందితో ప్రత్యేక భద్రత
- రక్షణ కోసం భక్తులకు చేతికర్ర అందిస్తాం
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి



తిరుపతి సిటీ: తిరుమల వచ్చే శ్రీవారి భక్తుల ప్రాణ రక్షణే తమ ప్రధాన ధ్యేయమని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో మీడియాతో మాడుతూ.. చిరుత దాడిలో గతంలో కౌషిక్ గాయపడటం, ఇటీవల చిన్నారి లక్షిత ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా టీటీడీ అప్రమత్తమై అటవీ శాఖ అధికారులు, పోలీసులతో కలసి కొన్ని నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల్లో 12 ఏళ్ల వయసు లోపు పిల్లలతో వచ్చే భక్తులకు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. పెద్దలను మాత్రం రాత్రి 10 వరకు అనుమతిస్తామని తెలిపారు. నడక దారిలో వెళ్లే ప్రతి భక్తునికి సహకారం కోసం ఊత కర్ర అందిస్తామన్నారు. ఘాట్ రోడ్డులో ద్విచక్ర వాహనాలను ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు మాత్రమే అనుమతిస్తామని చెప్పారు. భక్తులను గుంపులుగా వెళ్లేందుకు అనుమతిస్తూ.. ముందు వెనుక అటవీశాఖ సెక్యూరిటీతో భద్రత కల్పిస్తామన్నారు.. అటవీశాఖ అధికారులు నిపుణులైన భద్రతా సిబ్బందిని నియమించుకోవాలని సూచించామని.. వారి వేతనాలు టీటీడీయే భరిస్తుందన్నారు.

జంతువులకు ఆహారం అందించడం నిషేధం

నడక దారిలో వెళ్లే భక్తులు సాధు జంతువులకు ఆహారం అందించడం నిషేధించామని, అలా అందించే వారిపై చర్యలు తప్పవని కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నడక దారి లోని దుకాణదారులు, హోటళ్ల యజమానులు వ్యర్థాలను బయట వేయరాదని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తిరుపతి నుంచి తిరుమల వరకు నడకమార్గంలో సుమారు 500 కెమెరాలను అమర్చనున్నామని, అవసరమైతే డ్రోన్ వ్యవస్థను ప్రవేశపెట్టనున్నట్టు పేర్కొన్నారు. వైల్డ్‌లైఫ్ అవుట్ పోస్టులు 24 గంటలు పనిచేస్తాయని, డాక్టర్లు సైతం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దారి పొడవునా సుమారు 30 అడుగుల వరకు వెలుతురు ఉండేలా ఫోకస్ లైట్లు అమర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలిపిరి భూదేవి కాంప్లెక్స్, శ్రీవారి మెట్టు వద్ద 15వేల దివ్య దర్శనం టోకెన్లు జారీ చేస్తున్నామని, మధ్యలో వీటిని తనిఖీ చేయాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. టోకెన్లు పొందిన భక్తులు రోడ్డు మార్గాన సైతం వెళ్లేందుకు అనుమతిస్తామని తెలిపారు. ఫెన్సింగ్ ఏర్పాటుపై అటవీ అధికారులతో చర్చించామని.. కేంద్ర అటవీశాఖ ఉన్నత స్థాయి కమిటీ వేసి అధ్యయనం చేసిన తర్వాత నిర్ణయం ఉంటుందన్నారు.

చిక్కిన చిరుత

శేషాచలం అడవుల్లో టీటీడీ అటవీ శాఖ, రాష్ట్ర అటవీ శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన బోనులో సోమవారం తెల్లవారుజామున చిరుత చిక్కుకుంది. నెల్లూరు జిల్లాకు చెందిన లక్షిత(6) అనే బాలికపై వన్యమృగం బలి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వన్యమృగం దాడికి పాల్పడిన శేషాచల అటవీ ప్రాంతంలోని అలిపిరి–తిరుమల నడక మార్గంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, ఘంటా మండపం మధ్య మూడు బోన్లను ఉంచారు. సోమవారం వేకువజామున ఒక బోనులో మగ చిరుత చిక్కింది. ఆ చిరుత వయసు ఐదేళ్లకు పైగా ఉంటుందని అటవీ అధికారులు నిర్ధారించారు.

నగర వార్తలు

హర్ ఘర్ తిరంగ ర్యాలీ



తిరంగ ర్యాలీలో పాల్గొన్న మెథడిస్ట్ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు

అబిడ్స్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అబిడ్స్‌లోని మెథడిస్ట్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగ ర్యాలీ నిర్వహించా రు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యా ర్థులు ప్లకార్డులు చేతబట్టుకుని అబిడ్స్ వీధుల్లో ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సచ్చింద్రనాథ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఇళ్లపై జాతీయ జెండాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి పథకాలు దేశానికే ఆదర్శం

సాక్షి, సిటీబ్యూరో : తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న మైనారిటీ సంక్షేమ, అభివృద్ధి పథకాలు ఇతర రాష్ట్రాలన్నిటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలంగాణా రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ సభ్యుడు, బాల్కొండ దర్గా ముఖ్య ఉపాసకులు అబుల్ ఫతే సయ్యద్ బందగీ బాదెషా ఖాద్రీ అభిప్రాయపడ్డారు.సోమవారం ఆయన హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో ప్రతి యేట సుమారు రెండువేల కోట్లకు పైగా కేటాయించారన్నారు. షాదీ



ముబారక్ కింద తొమ్మిదేళ్ళలో 32,713 మంది ఆడబిడ్డలకు రూ.1903కోట్లు, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రుణాలు, తాజాగా మైనారిటీ బంధు పథకం కింద, ఒక్కొక్కరికీ రూ. లక్ష చొప్పున పంపిణీకి సిద్ధమైందని వివరించారు విదేశీవిద్యా నిధి పథకం రూ. 20లక్షల చొప్పున మంజూరు చేయడం సీఎం కేసీఆర్ ఉదారతకు నిదర్శనమన్నారు. అన్నిటికంటే ముఖ్యంగా రాష్ట్రంలో గంగా జమునా తహజీబ్ విరాజిల్లుతుందన్నారు.

అభివృద్ధిలో మహిళల సహకారం అవసరం

- బేగంపేటలో జరిగిన హెల్తీ బేబీ షోలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సనత్‌నగర్: మహిళలు నేడు యుద్ధ విమానాలను సైతం నడిపిస్తున్నారని ఇంకా ఈ రోజుల్లో ఆడపిల్ల పుడితే చిన్నచూపు చూడడం తగదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. అటల్ బిహారీ వాజ్‌పాయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బేగంపేట ప్యాలెస్‌లో సోమవారం జరిగిన హెల్తీ బేబీ షో కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా తల్లులకు హెల్దీ బేబీ కిట్స్ అందజేశారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలంటే ఆడపిల్లల సహకారం ఎంతో అవసరమన్నారు. దీనిని గుర్తించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ అటల్ బిహారీ వాజ్‌పాయ్ ఫౌండేషన్ ద్వారా హెల్తీ బేబీ షో కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. దీని ద్వారా పిల్లల ఆరోగ్య సంరక్షణ, వారి భవిష్యత్తుపై తల్లులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. పౌష్టికాహారం లోపం కారణంగా రక్తహీనత తదితర ఆరోగ్య రుగ్మతలను ఎదుర్కొంటున్నారని, వాటన్నింటినీ అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రతిఒక్కరం తోడ్పాటునందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎన్‌డీఎంఏ మాజీ వైస్ చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్యాం సుందర్‌గౌడ్, కార్పొరేటర్లు కేతినేని సరళ, చీర సుచిత్ర, నాయకులు నెమలి ఆనంద్, చీర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ అవార్డుకు ఓయూ ప్రొఫెసర్ ఎంపిక



ప్రొ.చంద్రశేఖర్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్, సీనియర్ అధ్యాపకుడు ప్రొ.చంద్రశేఖర్‌కు మద్రాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ శ్రీనివాసన్ స్మారక జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో ఐదు సంవత్సరాల కాలాన్ని ప్రమాణికంగా తీసుకొని బోధన, పరిశోధనకుగాను ద ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీర్స్ (ఐఈటీఈ) న్యూఢిల్లీ ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపిక చేసింది. వచ్చే నెల పుణేలో జరిగే జాతీయ సదస్సులో వార్డును అందుకోనున్నట్లు ప్రొ.చంద్రశేఖర్ తెలిపారు. 2003లో ఓయూ ఇంజినీరింగ్ ఈసీ ప్రొ.పాండరీ పాండే ఈ అవార్డును అందుకోగా రెండో సారి ప్రొ.చంద్రశేఖర్‌కు దక్కింది. ఈ సందర్భంగా వీసీ ప్రొ.రవీందర్, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్‌లు చంద్రశేఖర్‌ను అభినందించారు.

కరుణా గోపాల్‌కు బ్రిక్స్ ఇన్నోవేషన్ ఫోరం ఆహ్వానం

లక్డీకాపూల్ : రష్యాలోని మాస్కో సిటీలో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు జరగనున్న 'బ్రిక్స్ ఇన్నోవేషన్ ఫోరమ్'లో ప్రసంగించడానికి ఫౌండేషన్ ఫర్ ఫ్యూచరిస్టిక్ సిటీస్ ప్రెసిడెంట్, బీజేపీ నేత కరుణా గోపాల్‌కు ఆహ్వానం అందింది. మాస్కో సిటీ ఆఫ్ మాస్కో ఇన్నోవేషన్ క్లస్టర్ డైరెక్టర్ జనరల్ ద్వారా ఈ ఆహ్వానం అందుకున్నారు. నగరాల్లో సాంకేతికత వినియోగం, ఇన్నోవేషన్, ప్రజలపై ప్రభావం తదితర అంశాలను ఈ సదస్సులో చర్చిస్తారు. ఈ సందర్భంగా కరుణా గోపాల్ మాట్లాడుతూ.. మాస్కో డిక్లరేషన్‌పై సంతకం చేయడానికి ఎంపిక కావడం గౌరవంగా భావిస్తున్నామన్నారు.

దేశ విభజన.. చిత్రప్రదర్శన



సాక్షి, సిటీబ్యూరో : దేశ విభజన భయాందోళన దినోత్సవం సందర్భంగా సోమవారం కాచిగూడ, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లలో ప్రత్యేక ఫొటోఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా భారతదేశ విభజన సమయంలో చోటుచేసుకున్న భయాందోళనలు, హింస, విషాదం, తదితర పరిణామాలతో పాటు ఆనాటి ప్రతికూల పరిస్థితులను ధిక్కరించి దేశ ప్రజలంతా తమ సంఘటిత శక్తిని చాటుకున్న స్ఫూర్తిని తెలియజేస్తూ ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను కాచిగూడ స్టేషన్‌లో హైదరాబాద్ డివిజనల్ రైల్వేమేనేజర్ లోకేష్ విష్ణోయ్ ఒకటో నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై ప్రారంభించారు. అలాగే సికింద్రాబాద్ స్టేషన్‌లోని 10వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పైన ఏర్పాటు చేసిన ప్రదర్శనను సికింద్రాబాద్ డివిజనల్ రైల్వేమేనేజర్ భరతేష్‌కుమార్ ప్రారంభించారు.

అర్హులందరికీ బీసీ బంధు ఇవ్వాలి

– ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికి బీసీ బంధు పథకం కింద లక్ష రూపాయలు ఇవ్వాలని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఇవ్వకపోతే వచ్చే ఎన్నికల్లో బీసీల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. సోమవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆందోళన చేపట్టి ప్రసంగించారు. లక్ష రూపాయల పథకాన్ని అన్ని బీసీ కులాలకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కాలేజీ కోర్సులు చదివే బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజులస్కీమ్ పునరుద్ధరించకపోతే వచ్చే ఎన్నికల్లో అధికార పార్టీని వ్యతిరేకిస్తామని తెలిపారు. ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.పది వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో



విద్యానగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ, అంజి, వెంకట్, అరవింద్, ఆశోక్, భాస్కర్ ప్రజాపతి, చంద్రశేఖర్, రాజేందర్, శ్రావణి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ఐఓసీ పెట్రోల్ బంకుల్లో 'ఫ్రీడం ఫ్రం వేస్ట్ ఆఫర్'

సాక్షి, సిటీబ్యూరో: నగర పెట్రోల్ వినియోగదారులకు ఉచిత పెట్రోల్ బంపర్ ఆఫర్. ఐఓసీ పెట్రోల్ బంకులలో రీసైకిల్ చేయదగిన పొడి వ్యర్థాలను అందించి ఇంధనాన్ని ఉచితంగా పొందవచ్చు. సుస్థిరత, సర్క్యులారిటీ ఆలోచనలో అగ్రగామి 'రీసైకిల్' టెక్ కంపెనీ, 'ఫ్రీడమ్ ఫ్రమ్ వేస్ట్' పథకాన్ని అభివృద్ధి చేసింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్)తో కలిసి 'రీఫ్యూయల్ విత్ రీసైకిల్' కార్యక్రమంలో భాగంగా స్వాతంత్య్ర దినోత్సవ సందర్భంగా ఈ నెల 12 నుంచి 20 వరకు ఈ పథకాన్ని వర్తింపజేస్తోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు, కాగితం, కార్డుబోర్డు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, నెట్‌వర్క్ పరికరాలు, కేబుల్స్ ఇతర సామగ్రిని ఎంపిక చేసిన ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లలో ఇచ్చి వాటికి బదులుగా క్రెడిట్లను పొందవచ్చు. ఈ క్రెడిట్లను ఉపయోగించి పెట్రోల్ బంక్‌లలో పెట్రోల్, డీజిల్‌ను ఉచితంగా పొందవచ్చు.

- 'ఫ్రీడం ఫ్రం వేస్ట్' పథకం కింద 5 కేజీల కంటే ఎక్కువ వ్యర్థాలను అందించి దానికి క్రెడిట్ పాయింట్ల ద్వారా వచ్చే పెట్రోల్,డీజిల్ తో పాటు అదనంగా 500 ఎంఎల్ పెట్రోల్, డీజిల్‌ను పొందవచ్చు.
- స్నేహితులు,కుటుంబ సభ్యులను రిఫర్ చేసిన తరువాత, రిఫర్ చేయబడిన వ్యక్తి స్క్రాప్‌ను డిపాజిట్ చేసిన అనంతరం రిఫర్ చేసిన వ్యక్తి ప్రతి రిఫరల్‌కు 100 ఎంఎల్ రివార్డు ఉంటుంది.
- ఈ రెండు ఆఫర్‌లతో పాటు, టాప్ 3 రిఫరల్‌లకు ఆఫర్ కాలంలో రూ.5000 విలువైన ఇంధన ట్యాంక్‌ను గెలుచుకునే అవకాశం ఉంటుంది.

నాలుగు బంకుల్లో...

'రీఫ్యూయల్ విత్ రీసైకిల్' పథకం ప్రస్తుతం నగరంలోని నాలుగు ఐఓసీ పెట్రోల్ బంక్‌లలో అందుబాటులో ఉంది. కోకో హైటెక్‌సిటీ, టీఎస్ఐఐసీ నాలెడ్జ్ సిటీ, మదీనాగూడ సైబర్ ఫిల్లింగ్ స్టేషన్, కోకో బేగంపేట్ ప్రకాష్ నగర్ మెట్రోస్టేషన్ పక్కన పెట్రోల్ బంకుల్లో ఈ ఆఫర్ వర్తిస్తోంది.

కోర్టు గడువు ముగిసేదాకా నిలబడే ఉండాలి

వినూత్న శిక్ష విధించిన న్యాయమూర్తి


బంజారాహిల్స్: డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ నిందితుడిని రోజంతా కోర్టు గదిలో నిలబడి ఉండాలంటూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే... జూబ్లీహిల్స్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 28 మంది వాహనదారులు పట్టుబడ్డారు. వీరందరినీ సోమవారం నాంపల్లిలోని 8వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. పీకలదాకా మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డ నూరుల్లాఖాన్ అనే వాహనదారుడికి రూ. 3300 జరిమానాతో పాటు కోర్టు గడువు ముగిసేదాకా హాల్‌లో నిలబడే ఉండాలని న్యాయమూర్తి తీర్పునిచ్చారు. అలాగే మద్యం సేవించి రెండుసార్లు పట్టుబడ్డ పి. సంఘమేశ్వర్‌కు రెండు రోజుల జైలుతో పాటు రూ.3300 జరిమానా విధించారు. మిగతా 26 మంది వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.2100 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు జూబ్లీహిల్స్ ట్రాఫిక్ సీఐ వినోద్ కుమార్ తెలిపారు.

జలమండలి కార్యాలయానికి విద్యుత్ కట్

మణికొండ: ఎలాంటి అధికారిక కనెక్షన్ లేకుండా విద్యుత్‌ను వాడుకుంటున్న జలమండలి కార్యాలయానికి అధికారులు సోమవారం విద్యుత్ నిలిపివేశారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రం మర్రిచెట్టు సర్కిల్‌లో ఉన్న జలమండలి కార్యాలయం గతంలో గ్రామపంచాయతీగా ఉన్నపుడు డ్వాక్రా సంఘానికి నిర్మించారు. తదనంతరం జలమండలి డివిజన్ కార్యాలయం మణికొండకు రావటంతో వారికి దాన్ని కేటాయించారు. అప్పటి నుంచి అది జలమండలి పరిధిలోనే ఉంది. అప్పట్లో దానికి విద్యుత్ కనెక్షన్ తీసుకోలేదు. పక్కనే నీటి సరఫరా చేసే మోటార్లకు మాత్రం విద్యుత్ మీటర్లు ఉన్నాయి. కార్యాలయానికి అధికారిక కనెక్షన్ లేని విషయాన్ని తెలుసుకుని సోమవారం విద్యుత్ ఏఈ జ్ఞానేశ్వర్ ఆదేశాలతో సిబ్బంది కనెక్షన్‌ను తొలగించారు.

ఆకట్టుకుంటున్న 'మేరుత్సవ్'

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని మేరు ఇంటర్నేషనల్ స్కూల్ వేదికగా నిర్వహిస్తున్న 'మేరుత్సవ్' ఇంటర్ స్కూల్ కాంపిటీషన్ విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ఏడాది 'జీ 20 సమ్మిట్ – ఒక భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు' థీమ్‌తో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో నగరానికి చెందిన 65 పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి మరో 500 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో భాగం కానున్నారని మేరు ఇంటర్నేషనల్ పాఠశాల వ్యవస్థాపకురాలు జూపల్లి మేఘనా రావు తెలిపారు.



స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక లైటింగ్‌తో త్రివర్ణాలతో మెరిసిపోతున్న గోల్కొండ కోట

సీటు రానివారికి టెలీ కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: యూపీఎస్సీ, నీట్, జేఈఈ వంటి ప్రముఖ జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో తక్కువ మార్కులొచ్చి ఎంబీబీఎస్, ఐఐటీ వంటి వాటిల్లో సీటు రాని వారికి మానసిక చికిత్స అందజేసేందుకు 24 గంటల టెలీ కౌన్సెలింగ్‌ను ఏర్పాటు చేయాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫారసు చేసింది. ఆయా పరీక్షలు రాసి కొద్ది మార్కులతో సీట్లు కోల్పోతున్నవారు అనేకమంది ఉంటున్నారు. వీరిలో కొందరు మానసిక కుంగుబాటుకు గురవుతున్నారు. కొందరు ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో 'మానసిక ఆరోగ్యం.. వర్తమాన పరిస్థితుల్లో దాని నిర్వహణ'అనే అంశంపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఓ నివేదిక తయారు చేసి కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖకు అందజేసింది. వివరాలిలా ఉన్నాయి..

ఆత్మహత్యలు 10 శాతానికి తగ్గాలి

పాఠశాలల్లోనూ మానసికంగా కుంగిపోయే విద్యార్థుల కోసం కౌన్సిలర్లను నియమించాలి. ప్రస్తుతం జరుగుతున్న ఆత్మహత్యల సంఖ్యను 2030 నాటికి 10 శాతానికి తగ్గించాలి. కేంద్రీకృత సెంట్రల్ మెంటల్ హెల్త్ అథారిటీ, స్టేట్ మెంటల్ హెల్త్ అథారిటీలను ఏర్పాటు చేయాలి. జైళ్లల్లోనూ మెంటల్ హెల్త్ కౌన్సెలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. మానసిక ఆరోగ్య, సమస్యలను ఆరోగ్య బీమాలో చేర్చాలి. దేశంలో 47 మానసిక చికిత్సాలయాలున్నాయి. అయితే 2017లో ఏర్పాటైన మానసిక ఆరోగ్య చట్టానికి అనుగుణంగా అవి లేవు. ఆ మేరకు వాటిని తీర్చిదిద్దాలి. ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లోనూ మెంటల్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. మానసిక చికిత్సకు సంబంధించిన 17 రకాల మందులను ధరల నియంత్రణ పరిధిలోకి తీసుకొచ్చారు. అవన్నీ మెడికల్ కాలేజీలు, జిల్లా స్థాయి ఆసుపత్రుల్లో ఉన్నాయి. వాటిల్లో కనీసం 13 మందులను ప్రాథమిక ఆసుపత్రి స్థాయికి తీసుకురావాలి. పోలియో చుక్కల ప్రాధాన్యాన్ని తెలియజేసేందుకు సినీ తారలు, క్రీడాకారుల వంటి ప్రముఖులతో ప్రచారం చేస్తారు. అలాగే మానసిక సమస్యలకు సంబంధించి కూడా ఆయా రంగాల ప్రముఖులను బ్రాండ్ అంబాసిడర్లుగా నియమించి అవగాహన పెంచాలి.

సివిల్స్, నీట్, జేఈఈ అభ్యర్థులకు కౌన్సెలింగ్ ఏర్పాటు చేయాలి

- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫారసు
- కోవిడ్ తర్వాత దేశంలో 28 శాతం పెరిగిన మానసిక రుగ్మతలు
- సినీ తారలు, క్రీడాకారులతో అవగాహన పెంచాలి
- కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో మెంటల్ హెల్త్ అథారిటీలు ఏర్పాటు చేయాలి



నివేదికలో మరికొన్ని ముఖ్యాంశాలు..

- స్వయం ఉపాధి పొందుతున్నవారిలోనే ఎక్కువగా ఆత్మహత్యలు జరుగుతున్నాయి. తర్వాత వేతన జీవులు, నిరుద్యోగులు, విద్యార్థులు, వ్యాపారస్తులు, ప్రైవేట్ రంగం, రైతుల్లో ఆత్మహత్యలు పెరుగుతున్నాయి.
- 2021లో స్వయం ఉపాధికి చెందిన వారిలో 20,237 మంది ఆత్మహత్య చేసుకున్నారు. వేతన జీవులు 15,870, నిరుద్యోగులు 13,714, విద్యార్థులు 13,089, వ్యాపారస్తులు 12,055, ప్రైవేట్‌రంగ ఉద్యోగులు 11,439, రైతులు 5,318, కూలీలు 5,563 మంది ఆత్మహత్య చేసుకున్నారు.
- కోవిడ్ తర్వాత మానసిక సమస్యలు 28% పెరిగాయి. 2017లో 1.29 లక్షల మంది ఆత్మహత్య చేసుకుంటే, 2021లో 1.64 లక్షల మంది ఆత్మహత్య చేసుకున్నారు.
- ఆల్కహాల్ వల్ల 4.7 శాతం మంది, పొగాకు వల్ల 20.9 శాతం మంది మానసిక సమస్యలకు గురవుతున్నారు. డిప్రెషన్, ఉద్వేగాలు, ఇతరత్రా కారణాలతో 10.9 శాతం మందికి సమస్యలు వస్తున్నాయి. తీవ్రమైన స్కిజోఫ్రేనియా వంటి సమస్యలతో 1.4 శాతం, యాంగ్జయిటీతో 3.2 శాతం, స్ట్రెస్‌తో 3.7 శాతం, ఇతరత్రా ఏదో ఒక మానసిక సమస్యతో 13.7 శాతం బాధపడుతున్నారు.
- దేశంలో లక్ష జనాభాకు 0.75 మంది మానసిక చికిత్స నిపుణులు ఉన్నారు. అంటే 1.34 లక్షల మంది జనాభాకు ఒక మానసిక చికిత్స నిపుణుడు మాత్రమే ఉన్నారు. ప్రపంచ సగటు 1.7గా ఉంది. అభివృద్ధి చెందిన దేశాల్లో లక్షకు 8.6 మంది మానసిక నిపుణులు ఉన్నారు. .
- ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్యం కోసం ఖర్చు పెడుతున్న బడ్జెట్లో రెండు శాతమే మానసిక ఆరోగ్యంపై ఖర్చు చేస్తున్నారు. దీన్ని 10 శాతానికి పెంచాలని ఆరోగ్య సంస్థ తెలిపింది.
- ఇక మానసిక రోగుల్లో 85 శాతం మందికి తగిన వైద్యం అందడం లేదు.
- మానసిక చికిత్సలను ఆయుర్వేద, యోగా పరిధిలోకి తీసుకురావాలి. జిల్లా కేంద్రంగా మానసిక వైద్యం ఉండాలి.



మానసిక రోగుల్లో అవగాహన పెంచాలి

జిల్లాకొక యువ స్పందన కార్యక్రమం పెట్టి 20 మందిని రిక్రూట్ చేసుకొని ప్రజల్లో మానసిక రోగాలపై అవగాహన పెంచాలి. బ్రిక్స్ దేశాల్లోని దక్షిణాఫ్రికాలో 35.8 శాతం మంది మానసిక సమస్యలున్నవారే. మన దేశంలో 30.1 శాతం మంది ఏదో ఒక మానసిక సమస్యలతో ఉన్నారు.

- డాక్టర్ కిరణ్ మాదల, ఐఎంఏ, సైంటిఫిక్ కమిటీ కన్వీనర్

వ్యవసాయ వర్సిటీలో మిగిలిన సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ విశ్వవిద్యాలయం వివిధ డిప్లొమా కోర్సుల్లో సీట్ల భర్తీకి నాలుగు విడతల కౌన్సెలింగ్ నిర్వహించింది. ఇంకా మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈనెల 17న యూనివర్సిటీ ఆడిటోరియంలో వాక్-ఇన్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఎం.వెంకటరమణ తెలిపారు. ఈ కోర్సులకు పాలిసెట్-2023లో ర్యాంకు పొందిన వారికి మొదటి, ఎస్సెస్సీ పాసైన వారికి (పాలిసెట్ ర్యాంక్ లేకున్నా) రెండో ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని కౌన్సెలింగ్‌కు రావాలని రిజిస్ట్రార్ సూచించారు. మరిన్ని వివరాలకు www.pjtsau.edu.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

రేపు యూనివర్సిటీల బంద్

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): రాష్ట్రంలో ఈనెల 16న యూనివర్సిటీల బంద్‌కు కాంట్రాక్టు అధ్యాపకులు పిలుపునిచ్చారు. సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ వద్ద వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ నేతలు ఉద్యోగాల పర్మనెంట్ కోసం భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు. 16న వర్సిటీల బంద్, 19, 20 తేదీల్లో ఇందిరా పార్క్ వద్ద 48 గంటల సామూహిక సమర దీక్ష, చివరిగా వర్సిటీల పాలనను స్తంభింప చేసేందుకు పెన్ డౌన్ తదితర ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు విద్యార్థి, ఉద్యోగ, అధ్యాపక సంఘాల నేతలు సహకరించాలని కోరారు.

20న ఓయూ దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్ష

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రవేశ పరీక్షలను ఈ నెల 20న నిర్వహించనున్నట్లు పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ పాండురంగారెడ్డి తెలిపారు. 20న దూరవిద్య కేంద్రంలో ఉదయం 11 గంటల నుంచి 12.30 వరకు ప్రవేశ పరీక్ష జరగనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 16 నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

19 వేల సీట్లకు 17 నుంచి కౌన్సెలింగ్

సీఎస్ఈ బ్రాంచీలోనూ మిగిలిన 3 వేల సీట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్ సీట్లు ఇంకా 19,049 మిగిలాయి. ఆదివారం మూడో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఈ లెక్క తేలినట్టు సాంకేతిక విద్య విభాగం వెల్లడించింది. ఇందులో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ సీట్లు 3,034 వరకూ ఉన్నాయి. ఈసారి సంప్రదాయ కోర్సులైన సివిల్, మెకానికల్ సీట్లను అన్ని కాలేజీలు ముందే భారీగా తగ్గించుకున్నాయి. ఈ బ్రాంచీల్లో మొత్తం 7 వేల సీట్లకు కోత పడింది. ఈ మేరకు కంప్యూటర్ సైన్స్ దాని అనుబంధ కోర్సుల్లో సీట్లు పెరిగాయి. ఇవి కాకుండా మరో 7 వేల వరకూ కొత్తగా కంప్యూటర్ సైన్స్ సంబంధిత బ్రాంచీల్లో సీట్లు పెరిగాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా కన్వీనర్ కోటా కింద 83,766 ఇంజనీరింగ్ సీట్లు ఉంటే, ఇందులో కంప్యూటర్ సైన్స్ కోర్సులే 56,811 ఉన్నాయి. ఈ విధంగా కంప్యూటర్ బ్రాంచీల్లో సీట్లు పెరగడంతో టాప్ 20 కాలేజీల్లో సీట్లు వంద శాతం భర్తీ అయ్యాయి. అంతగా పేరులేని, గ్రామీణ ప్రాంతాలకు చేరువలో ఉండే కాలేజీల్లో మాత్రం కంప్యూటర్ కోర్సుల్లో కూడా సీట్లు మిగిలిపోయాయి. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్స్, సివిల్, మెకానికల్ బ్రాంచీల్లో సీట్లు తక్కువే (కాలేజీలు తగ్గించుకోవడం వల్ల) ఉన్నప్పటికీ, చివరకు వాటిల్లోనూ భారీగా సీట్లు మిగిలాయి. ఇలా మిగిలిపోయిన సీట్లకు ఈ నెల 17 నుంచి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఉన్నత విద్యా మండలి ప్రకటించింది.

ప్రధాన బ్రాంచీల్లో మిగిలిన సీట్లు

బ్రాంచీ	మిగిలిన సీట్లు
కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్	3034
సివిల్ ఇంజనీరింగ్	2505
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటాసైన్స్	479
ఏఐఎంఎల్	1785
సీఎస్ఈ డేటాసైన్స్	1012
ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్	2721
ఎలక్ట్రికల్, అండ్ ఎలక్ట్రానిక్స్	2630
ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ	553
మెకానికల్ ఇంజనీరింగ్	2542
మైనింగ్ ఇంజనీరింగ్	218

స్మార్ట్ హెల్మెట్.. హానికర వాయువులపై హెచ్చరిక

జాతీయస్థాయి సైన్స్ ప్రదర్శనలకు ఎంపిక

సోన్: నిర్మల్ జిల్లా సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడ్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల విద్యార్థిని స్మార్ట్ హెల్మెట్ తయారు చేసింది. నర్సాపూర్ గ్రామానికి చెందిన ఝాన్సీ 10వ తరగతి చదువుతోంది. ఈ స్మార్ట్ హెల్మెట్ జాతీస్థాయి సైన్స్ ప్రదర్శనలకు ఎంపికైంది. ఈ హెల్మెట్ ధరిస్తే గనులలో ఉన్న హానికర వాయువుల గురించి ముందుగానే హెచ్చరిస్తుంది. భూమిలోపల కదలికలు వస్తే వాటిని పసిగట్టి అటువైపు వెళ్లకుండా హెచ్చరిస్తుంది. హార్ట్‌బీట్‌ను సవరిస్తుంది. కార్మికుడు ఎక్కడైనా స్పృహ కోల్పోతే ఈ హెల్మెట్ జీపీఎస్ ద్వారా కంప్యూటర్‌లో ఇండికేషన్ ఇస్తుంది. స్మార్ట్ హెల్మెట్ తయారు చేసిన ఝాన్సీని ఇటలీలోని అరుడినియో ఇంటర్నేషనల్ సాఫ్ట్‌వేర్ కంపెనీ అక్టోబర్ 21, 22, 23 తేదీల్లో రోమ్ నగరానికి ఆహ్వానించిందని ప్రిన్సిపాల్ సరస్వతి తెలిపారు.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎండిపోతున్న టేకు చెట్లు

ఆకు అస్థిపంజరమై..
‘టేకు’ ఎర్రబారి

నిర్మల్‌ఖిల్లా

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా టేకు ఆకులు రాలి... చెట్లు ఎండిపోతున్నాయి. వర్షాకాలంలో పచ్చగా ఉండాల్సిన ఆకులు గోధుమ రంగులోకి మారి ఎండుటాకుల్లా నేల రాలుతున్నాయి. ఒక్కసారిగా చెట్లు ఎండిపోవడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అడవుల జిల్లా ఆదిలాబాద్‌లో ఇప్పుడు ఎటుచూసినా టేకుచెట్లన్నీ మోడువారి కనిపిస్తున్నాయి. సాధారణంగా ఈ సమయంలో పచ్చగా ఉండాల్సిన అడవులు...ఎరుపు రంగులోకి మారిపోతున్నాయి.





నిర్మల్,ఆదిలాబాద్ జిల్లాల్లో తెగులు సోకి ఎర్రబారిన టేకు వృక్షాలు. (ఇన్‌సెట్‌లో) తెగులుకు కారణమవుతున్న చీడపురుగు ఇదే..

యూటెక్టోనా మాచెరాలిస్ తెగులుతోనే

టేకు ఆకు అస్థిపంజరంగా మారడానికి యూటెక్టోనా మాచెరాలిస్ తెగులు కారణమని వృక్షశాస్త్ర నిపుణులు చెబుతున్నారు. టేకుఆకుల్లో ఉన్న రసాలను చీడ పురుగులు పీల్చడంతో నిర్వీర్యమైపోతుంది. సూర్యరశ్మి సమక్షంలో కిరణజన్య సంయోగక్రియ జరపకుండా అడ్డుకుంటాయి. అంతేకాకుండా టేకు ఆకులు ఎదగకుండా ఈ చీడపురుగులు సన్నని జాలీల వంటి వలయాలు ఏర్పరుస్తాయి. ఫలితంగా ఆకులన్నీ ఎండిపోయి చెట్టు మొత్తం ఎరుపు రంగులోకి మారుతుంది.

కళ తప్పుతున్న అడవులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అడవుల విస్తీర్ణం ఎక్కువ. వర్షాలు మొదలైన తర్వాత జూలై, ఆగస్టు మాసాల్లో అడవులన్నీ పచ్చదనంతో నిండిపోయాయి. కానీ పక్షం రోజులుగా అడవుల్లోని టేకుచెట్లు పూర్తిగా ఎర్రబారడంతో అడవులు కళ తప్పుతున్నాయి. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల సరిహద్దులను కలిపే సహ్యాద్రి పర్వత పంక్తుల్లోని మహబూబ్‌ఘాట్స్‌లో దట్టమైన టేకు చెట్లు కనిపిస్తాయి. ఈ సంవత్సరం మాత్రం ఈ టేకు చెట్లన్నీ ఎర్రబారి కనిపిస్తున్నాయి. దగ్గరికి వెళ్లి చూస్తే చెట్టులోని ఆకులన్నీ అస్థిపంజరంలా మారి జల్లెడను తలపిస్తున్నాయి.



వేగంగా వ్యాప్తి..

యూటెక్టోనా మాచెరాలిస్ అనే తెగులు కారణంగా టేకుచెట్ల ఆకులు ఎండిపోయినట్టుగా మారుతున్నాయి. ఈ తెగులు వేగంగా వ్యాప్తి చెందుతోంది. ఒక అంగుళం పొడవు ఉండే చిన్న చీడ పురుగులే ఇందుకు కారణం. ఇవి వెడల్పాటి టేకు ఆకులోని రసాన్ని మొత్తం పీల్చి పిప్పి చేస్తాయి. ఆకులు ఎదగకుండా వలయాలను నిర్మిస్తాయి. దీనివల్ల ఆకు క్రమంగా రంగు మారుతుంది. వీటిని టేకు స్కెలిటోనైజర్‌గా పిలుస్తారు. వాతావరణ పరిస్థితుల ద్వారా దానికదే అదుపులోకి వస్తుంది.

– డాక్టర్ వెల్మల మధు, వృక్షశాస్త్ర నిపుణుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్

‘ఏఐ’లో ఆదర్శంగా తెలంగాణ



- ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్
- తెలంగాణ ఏఐ వాతావరణం నివేదిక విడుదల

సాక్షి, హైదరాబాద్: కృత్రిమ మేధస్సు (ఏఐ) వాతావరణంను కల్పించడంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడంతో పాటు ఇతర రాష్ట్రాలకు కూడా తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ అన్నారు. ‘తెలంగాణలో కృత్రిమ మేధస్సు (ఏఐ) వాతావరణం–స్థితిగతులు’పై తెలంగాణ ఏఐ మిషన్ (టీ–ఎయిమ్) రూపొందించిన నివేదికను ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్ డైరెక్టర్ రమాదేవి లంకాతో కలిసి జయేశ్ సోమవారం విడుదల చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ శక్తికేంద్రంగా తెలంగాణ అవతరిస్తున్న తీరుకు ఈ నివేదిక అద్దం పడుతుందని వ్యాఖ్యానించారు. ఆధునిక సాంకేతికతతో కూడిన పరిశోధన, నైపుణ్యం, దృఢమైన మౌలిక వసతులు, వ్యూహాత్మక భాగస్వామ్యాలు తదితరాలతో ఇది సాధ్యమైందన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత మదింపు, సెల్ఫీల ద్వారా పింఛనుదారుల లైఫ్ సర్టిఫికెట్, రోడ్డు గుంతలను పసిగట్టి వాటి వివరాల సేకరణ తదితరాలు ఏఐ ద్వారా సాధ్యమైనట్లు ఈ నివేదిక వెల్లడించిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఏఐ సాంకేతికతను మరింత సమర్థవంతంగా ఉపయోగించుకుని పౌర సమస్యల పరిష్కారాలకు చూపే దిశగా ఆవిష్కరణలు ప్రోత్సహించేందుకు గ్రాండ్ చాలెంజెస్ పేరిట టీ–ఎయిమ్ అనేక కార్యక్రమాలను చేపడుతోందని వివరించారు.

ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్‌గా సుధాకర్‌రావు



సాక్షి, హైదరాబాద్: ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే నెమురుగొమ్ముల సుధాకర్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. 1999లో చెన్నూరు నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందిన సుధాకర్‌రావు.. తెలంగాణ ఉద్యమ సమయంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. 2014లో పాలకుర్తి నుంచి బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేశారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్‌గా ఈనెల 19న (శనివారం) ఆయన బాధ్యతలు చేపడతారు.

ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి హైకోర్టులో ఊరట



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సమయంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. ఆయన ఎన్నిక అక్రమమని, ఎన్నిక రద్దు చేయాలని దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది. 2018, డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున మర్రి జనార్దన్‌రెడ్డి, కాంగ్రెస్ తరఫున నాగం జనార్దన్‌రెడ్డి పోటీ చేశారు. మర్రికి 1,02,493 ఓట్లు రాగా, నాగంకు 48,139 ఓట్లు వచ్చాయి. ఇదిలా ఉండగా, మర్రి జనార్దన్‌రెడ్డి ఎన్నిక రద్దు చేయాలంటూ 2019లో మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అఫిడవిట్‌లో షేర్లు, భార్యకు చెందిన కంపెనీ వివరాలు మర్రి జనార్దన్‌రెడ్డి దాచి పెట్టారని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ అనుపమ చక్రవర్తి సోమవారం తీర్పు వెలువరించారు. పిటిషన్‌లో పేర్కొన్న ఆరోపణలకు నాగం జనార్దన్‌రెడ్డి తగిన ఆధారాలు చూపలేకపోయారని పేర్కొంటూ.. న్యాయమూర్తి ఎన్నికల పిటిషన్‌ను కొట్టివేశారు.

తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఎన్నికలకు షెడ్యూల్

- ఈ నెల 18 నుంచి నామినేషన్ పత్రాల అందజేత
- పోస్టల్ బ్యాలెట్ల పంపిణీ వచ్చే నెల 30 నుంచి ప్రారంభం
- బ్యాలెట్ తిరిగి పంపేందుకు గడువు నవంబర్ 30
- డిసెంబర్ 1న ఓట్ల లెక్కింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఎన్నికలు జరుగబోతున్నాయి. ఈ మేరకు వైద్య విద్యా సంచాలకుల కార్యాలయానికి చెందిన డిప్యూటీ డైరెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.శ్రీహరిరావు సోమవారం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 18 నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు నామినేషన్ పేపర్లను అందజేస్తారు. ఈ నెల 21వ తేదీ నుంచి వచ్చే నెల నాలుగో తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. వచ్చే నెల 8వ తేదీన నామినేషన్ల పరిశీలన ఉంటుంది. అదే రోజు సాయంత్రం ఐదు గంటల తర్వాత ఆమోదించిన నామినేషన్ల వివరాలు వెల్లడిస్తారు. వచ్చే నెల ఐదో తేదీ నుంచి 11వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్లను విత్‌డ్రా చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. సెప్టెంబర్ 12న సాయంత్రం ఐదు గంటలకు పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ప్రదర్శిస్తారు. అదే నెల 30వ తేదీ నుంచి నవంబర్ 15వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ పేపర్లను సరఫరా చేస్తారు. తిరిగి ఆ బ్యాలెట్ ఓటును నవంబర్ 30 సాయంత్రం 5 గంటల కల్లా పంపించేందుకు గడువు విధించారు. డిసెంబర్ 1న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. 13 మందిని మెడికల్ కౌన్సిల్ కోసం ఎన్నుకుంటారు. మరో 12 మందిని ప్రభుత్వం నామినేట్ చేస్తుంది. అనంతరం చైర్మన్‌ను ఎన్నుకుంటారు.

ఎన్నికల్లో పోటీకి సీనియర్లు సిద్ధం..

ఎన్నికల్లో పోటీ చేయాలని అనేకమంది సీనియర్ డాక్టర్లు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. కొందరు వైద్య సంఘాల నాయకులూ పోటీకి సై అంటున్నారు. మెడికల్ కాలేజీల్లో ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న డాక్టర్ కిరణ్ మాదల, డాక్టర్ నరహరి వంటి వారు పోటీకి రెడీ అంటున్నట్లు సమాచారం. ఇప్పటికే పోటీ చేయాలని భావిస్తున్న అభ్యర్థులు, మద్దతు కోసం డాక్టర్లను సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. ఎంబీబీఎస్ పూర్తి చేసి, కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న ఎవరైనా ఈ ఎన్నికల్లో పోటీ చేయొచ్చు. ఒక్కో డాక్టర్ 13 మందికి ఓట్లు వేయవచ్చు.

అన్నీ ఆన్‌లైన్‌లోనే

- వసతి గృహాల్లో విద్యార్థి అడ్మిషన్ మొదలు, నిర్వహణ, తనిఖీ వరకూ
- అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించిన సంక్షేమశాఖలు
- బీసీ సంక్షేమశాఖ పరిధిలో ఇప్పటికే 70శాతం అడ్మిషన్లు పూర్తి
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో...

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థి అడ్మిషన్ దరఖాస్తు మొదలు హాస్టళ్ల నిర్వహణ, తనిఖీ, ఖర్చులన్నీ ఇక నుంచి ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. వసతిగృహాల నిర్వహణ మరింత పారదర్శకంగా ఉంచేందుకు సంక్షేమశాఖలు సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతం చేస్తున్నాయి. ఈమేరకు సంక్షేమశాఖలు ప్రత్యేకంగా వెబ్‌పోర్టల్ వినియోగంలోకి తీసుకొచ్చాయి. శాఖలవారీగా వేర్వేరుగా వెబ్‌పోర్టల్స్ ఉండగా, వీటిని ప్రధానంగా సంక్షేమశాఖ వెబ్‌సైట్‌తో లింకు చేశారు. దీంతో సంక్షేమశాఖ ఉన్నతాధికారులు నేరుగా క్షేత్రస్థాయిలో హాస్టళ్ల వివరాలు, నిర్వహణ ఎప్పటికప్పుడు తనిఖీ చేసే వీలుంటుంది. ప్రస్తుతం బీసీ సంక్షేమశాఖతో పాటు ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖలు సైతం ప్రత్యేక వెబ్‌పోర్టళ్ల నిర్వహణకు ఉపక్రమించాయి. ప్రస్తుతం ప్రయోగాత్మకదశలో ఈ వెబ్‌సైట్లు ఉండగా, అతిత్వరలో పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లోనే నిర్వహించేలా కసరత్తు చేస్తున్నాయి.

దరఖాస్తు నుంచే...

సంక్షేమశాఖలు హాస్టల్‌లో అడ్మిషన్ల ప్రక్రియ ఆన్‌లైన్‌లో ప్రవేశపెట్టాయి. ఇదివరకు నేరుగా హాస్టల్‌కు వెళ్లి దరఖాస్తు ఫారాన్ని పూరించి సంబంధిత సంక్షేమ వసతిగృహ అధికారి సమర్పించే పద్ధతి ఉండేది. అలా ఇచ్చిన దరఖాస్తును పరిశీలించి సీట్ల లభ్యత ఆధారంగా అడ్మిషన్ ఖరారు అయ్యేది. ఇప్పుడు మాన్యువల్ పద్ధతికి బదులుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ బీసీ సంక్షేమశాఖ తీసుకొచ్చింది. హాస్టల్‌లో చేరాలనుకున్న విద్యార్థి ముందుగా వెబ్‌సైట్ తెరిచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆ దరఖాస్తులను సంక్షేమాధికారులు పరిశీలిస్తారు. అనంతరం విద్యార్థి అర్హతల ఆధారంగా సీట్ల లభ్యతకు అనుగుణంగా హాస్టల్‌లో అడ్మిషన్ ఇస్తారు. ఈ ప్రక్రియంతా ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. ఇలా అడ్మిషన్ పొందిన విద్యార్థి ఉపకార వేతన నిధులు నేరుగా హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఖాతాకు జమ అవుతాయి. రాష్ట్రంలో దాదాపు ఆరు వందల బీసీ సంక్షేమ హాస్టళ్లలో ఇప్పటికే 40వేల మంది విద్యార్థులు ఈ పద్ధతిలో అడ్మిషన్లు తీసుకున్నారు. మరో 20వేల అడ్మిషన్లకు దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. గిరిజన సంక్షేమశాఖ పరిధిలోనూ ఆన్‌లైన్‌నే అనుసరిస్తుండగా, ఎస్సీ అభివృద్ధి శాఖ పరిధిలో వివరాల నమోదు ప్రక్రియ కంప్యూటరీకరిస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమశాఖల పరిధిలో 1550 ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. వీటి పరిధిలో 3లక్షల మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు.

ఆగస్టు 15

ఆమె... దేశంలో సగం ఎప్పుడు!?

స్వాతంత్ర్య దినోత్సవం దేశ ఔన్నత్యాన్ని మాట్లాడుతుంది. దేశ ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తుంది. కాని దేశంలో సగమైన స్త్రీలు సంపూర్ణ స్వాతంత్ర్య ఫలాలు ఇంకా పొందవలసే వుంది. ఏనాడైతే స్త్రీల పట్ల సురక్షితమైన, సంస్కారవంతమైన ప్రవర్తనను ఈ సమాజం చూపుతుందో అప్పుడే స్త్రీలకు సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చినట్టు. అప్పుడే దేశ ఔన్నత్యం ఇనుమడించినట్టు. 'ఆకాశంలో సగం'లాగా దేశంలో సగం ఇంకెప్పుడు?

నేడు ఆగస్టు 15న ఎర్రకోట మీద జెండా ఎగుర వేసే సమయంలో ప్రధాని నరేంద్ర మోడీకి ఇద్దరు మహిళా ఆర్మీ ఆఫీసర్లు సహకారం అందిస్తారు. మేజర్ నికితా నాయర్, మేజర్ జాస్మిన్ కౌర్ పతాకావిష్కరణ సమయంలో ప్రధానితో పాటుగా ఉండి జెండా వందనం సమర్పిస్తారు. ఈ విశేష ఘట్టంలో ఇద్దరు మహిళలకు ఈ విధంగా చోటు దక్కడం సంతోషపడాల్సిన సంగతి. 76 ఏళ్ల క్రితం స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు స్త్రీల స్థితిగతుల్లో వచ్చిన పురోభివృద్ధికి ఇదీ ఒక సంకేతమే. నాటి నుంచి నేటి వరకు విద్య, ఉపాధి, ఉద్యోగం, సైన్యం, పాలనా యంత్రాంగం, శాసన వ్యవస్థ... వీటిల్లో స్త్రీలకు గణనీయంగా స్థానం దక్కింది. ప్రాముఖ్యం లభించింది. అయితే అంతమాత్రాన స్త్రీలు సంపూర్ణంగా స్వాతంత్ర్య ఫలాలు అనుభవిస్తున్నారా అనేది ప్రశ్న.



స్త్రీల త్యాగం

దాస్య భారతంలో జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో స్త్రీలు పాల్గొన్నారు. అన్నింటికి మించి పురుషులు దేశం కోసం ప్రాణాలు అర్పించినా, జైళ్ల పాలైనా స్త్రీలు ధైర్యంగా ఇళ్లు నడిపి కష్టాలను ఈదారు. దేశ విభజన సమయంలో తీవ్ర హింసను ఎదుర్కొన్నారు. అంతెందుకు 1930 నాటికి దేశ వ్యాప్తంగా 30 వేల మంది స్త్రీలు స్వాతంత్ర్య పోరాటంలో ఏదో విధాన జైలు శిక్ష అనుభవిస్తున్నారని తెలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఈ స్త్రీల పోరాటం చాలామటుకు చరిత్రలో నమోదు కాకుండానే కాలగర్భంలో కలిసిపోయింది. ఇప్పుడిప్పుడే నాటి వీర వనితల గాథలు వెలికి వస్తున్నాయి. ఇంత పోరాటం, త్యాగం చేసి స్త్రీల భాగస్వామ్యంతో తెచ్చుకున్న స్వాతంత్ర్యంలో స్త్రీలు నిజంగా సంతోషంగా ఉన్నారా?

సురక్షితం కాని దేశం

'ఒక స్త్రీ అర్ధరాత్రి క్షేమంగా నడిచి వెళ్లినప్పుడే ఈ దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు' అని గాంధీజీ ఏ ముహూర్తంలో అన్నారో కాని అలాంటి స్థితి నేటికీ రాకపోగా నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది. ఎన్ని చట్టాలు చేసినా, శిక్షలు తెచ్చినా స్త్రీలను గౌరవించాలి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడాలి అని మెజారిటీ సమాజం అనుకోవడం లేదు. 'నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి' అనే భావన సమాజంలో ఆది కాలం నుంచి చొప్పించి ఉండటం వల్ల స్త్రీ చేసే ప్రతి పనిలో తప్పు ఎంచడం, అదుపు చేయడం, చులకనగా చూడటం, వివక్ష చూపడం, దండించడం ఆనవాయితీగా మారింది. పిల్లల పెంపకం దశ నుంచే స్త్రీలను గౌరవించడం నేర్పించడం లేదు. ఇంట్లో అమ్మాయిని ఒకలాగా, అబ్బాయిని ఒకలాగా పెంచడం వల్ల ఈ అబ్బాయిలు 'సమాజం'గా మారి స్త్రీ పాలిట బెడదగా మారుతున్నారు. తమ మాటకు ఎటువంటి తిరస్కారం చెప్పినా పురుషుడు శిక్షించేవాడై స్త్రీని చంపేందుకు వెనుకాడటం లేదు. స్త్రీకి ఒక అభిప్రాయం కలిగి ఉండే స్వాతంత్ర్యం ఆమెకు ఎందుకు ఇవ్వడం లేదు?

స్త్రీలను ప్రేమ, మర్యాద, గౌరవాలతో కుటుంబం చూసుకోవాలి. అప్పుడు ఆ మర్యాద, గౌరవాలు సమాజంలోకి ఆటోమేటిక్‌గా వస్తాయి. కుటుంబం స్త్రీకి ఎలా రక్షణ ఇస్తుందో సమాజం కూడా స్త్రీకి అలా రక్షణ ఇవ్వాలనే పౌర శిక్షణ, సంస్కారం అవసరం. పురుషులు మాత్రమే కాదు స్త్రీలు కూడా కుటుంబం, సమాజం, దేశం కోసం గొప్పగా ఆలోచించగలరు. వారికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఇచ్చి చూస్తే తెలుస్తుంది. అటువంటి వేకువలోకి దేశం ఉదయించాలని ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కోరుకుందాం.



● ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్, శిక్ష(ణ)లో ఉన్న మహిళలే నిర్వహకులు

77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా...
ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్

కారాగారంలో గడిపే సమయం శిక్ష సమయం కాదు, శిక్షణ సమయం. కారాగారం మానసిక పరివర్తన దిశగా శిక్షణ ఇచ్చే ప్రదేశం. శిక్ష పూర్తయి విడుదలైన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడానికి అవసరమైన నైపుణ్య శిక్షణ కూడా ఇచ్చే ప్రదేశంగా ఉండాలి. అలాగే ఉంటాయి కూడా. అయితే ఈ ఏడాది దేశం మరో అడుగు ముందుకేసింది. శిక్ష అనుభవిస్తున్న మహిళలకు ఉపాధి అవకాశాలను జైలు గోడల మధ్య కాకుండా సమాజంలో కల్పించడం ఈ స్వాతంత్ర్య దినోత్సవం ప్రత్యేకత.

చెన్నై నగర శివారులో అంబత్తూరు– పుఝల్ రోడ్డులో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు 'ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్' అనే ప్రయోగాత్మకమైన సంస్కరణకు వేదికైంది. పుఝల్ మహిళల కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న మహిళల్లో ముప్పై మందికి ఉద్యోగం ఇచ్చింది. దేశంలో ఇదే మొదటి ప్రయత్నం. ఈ ప్రయత్నంతో ఈ పెట్రోల్ బంకు ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్ అనే గౌరవ సూచికకు అర్హత సాధించింది. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పన్నెండు గంటలు మహిళలు విధులు నిర్వర్తిస్తారు. ఆ తర్వాత పురుష ఖైదీలు విధుల్లోకి వస్తారు.

ఖైదీలు తమ శిక్ష కాలం పూర్తయిన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడం కోసం రకరకాల వృత్తుల్లో శిక్షణ ఇస్తారు. అవన్నీ జైలు గోడల మధ్యనే ఉంటాయి. మారుతున్న సమాజానికి తగినట్లు కొత్త కొత్త ఉపాధి మార్గాలకు తగిన ఏర్పాట్లు ఉండవు. అందుబాటులో ఉన్న పనుల్లోనే శిక్షణ ఇవ్వడమే జరిగేది. ఇదిలా ఉంటే... జైళ్లలో మహిళా ఖైదీలకు తగిన సౌకర్యాల పర్యవేక్షణ కోసం అన్ని రాష్ట్రాల్లో పర్యటించిన మహిళా కమిషన్ సభ్యుల పరిశీలనలో కొత్త విషయాలు తెలిశాయి. జైలు గోడల మధ్య ఉండడం వల్ల మహిళలు మానసికంగా కుంగుబాటుకు లోనవుతున్నారని, వారికి సమాజంలో భాగస్వామ్యం కల్పించాలని సూచించడంతో, ఆ సూచనను అందుకున్న జైలు అధికారుల్లో మొదటగా పుఝల్ జైలు అధికారులు ఈ ప్రయత్నం చేశారు. మహిళలకు పెట్రోల్ పట్టడంలో శిక్షణ ఇవ్వడంతోపాటు వినియోగదారులతో మాట్లాడడం, ఉద్యోగానికి తగిన ప్రవర్తనా నియమావళిలో కూడా మహిళలకు శిక్షణ ఇప్పించారు.

పెట్రోల్ బంకులో విధులు నిర్వర్తిస్తున్న మహిళలు తమకు స్వాతంత్ర్యం వచ్చినట్లు సంతోషిస్తున్నారు. శిక్ష కాలాన్ని ఆనందంగా పూర్తి చేస్తామని, పరిపూర్ణమైన వ్యక్తిత్వంతో సమాజంలోకి విడుదలవుతామని చెప్పారు.

శిక్ష కాలం సమాజంలోనే!
శిక్షణ కాలంలో మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్కరణలు తీసుకు రావడంతోపాటు ఖైదీలను సమాజంతో అనుసంధానం చేయడం, వారి పునరావాసం కోసం పని చేయడం కూడా అవసరమే. ఆ అవసరాన్ని గుర్తించి మహిళలతోనే ముందడుగు వేసింది జైళ్ల శాఖ. శిక్ష సమయంలో కూడా సమాజంలో మనుమలతో మాట్లాడుతూ ఉంటే మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. సమాజానికి దూరంగా ఉన్నామనే ఆవేదన దూరమవుతుంది. సమాజంలోనే నివసిస్తున్న భావనతో జీవిస్తారు.

స్వాతంత్ర్యాన్ని ఇలా ఎంజాయ్ చేయండి!

నేటి టెక్నాలజీ యుగంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని హాలిడేగా తీసుకుని ఆనందించే వారే ఎక్కువ. స్కూలు, కాలేజీ విద్యార్థులైతే జెండా వందనం తరువాత ఇంటికెళ్లిపోవచ్చు అని తెగ సంబరపడిపోతుంటారు. కానీ డెబ్బై ఆరేళ్లుగా విరామం లేకుండ జరుపుకొంటూ నేడు 77వ వసంతంలో అడుగు పెట్టాం. దేశాన్ని పాలించే అధికారులు అధికారికంగా ఈ వేడుకలు జరిపిస్తున్నారు. బాధ్యత గల పౌరులుగా మనం ఇలా సెలబ్రేట్ చేసుకుందాం....



● ఉదయాన్నే ఎర్రకోటపై జరిగే జెండావందనం, వివిధ కార్యక్రమాలను టీవీలో చూడాలి. డెబ్బై ఏడేళ్ల స్వాతంత్ర్య భారతం ఎంత ఎత్తుకు ఎదిగిందన్న అంశాలను ప్రత్యక్ష ప్రసారాలు చూడడం ద్వారా తెలుసుకోవచ్చు ● తరువాత ఎప్పటి నుంచో అనుకుంటున్న ప్లేసుకి ఈరోజు వెళ్లండి. ఒక రోజులో వెళ్లిరాగల ప్రాంతానికి వెళ్లి అక్కడ గడిపి మీ ఒత్తిడిని దూరం చేసుకోండి. అక్కడ స్వతంత్ర దినోత్సవాన్ని గుర్తుండిపోయేలా గడపండి. ● రోజూ వేసుకునే దుస్తులు కాకుండా భారతీయ సంప్రదాయం ఉట్టిపడేలాంటి దుస్తులు ధరించండి. వీలైనంత వరకు డ్రెస్‌లో తెలుపు, కాషాయం, ఆకుపచ్చని రంగులు ఉండేలా చూసుకుని వేసుకోవాలి. అప్పుడు త్రివర్ణ పతాకానికి మరింత వన్నె తెచ్చిన వారవుతారు ● ఎక్కడికీ వెళ్లే ఓపిక లేనప్పుడు ఇంట్లోనే ఉండి దేశభక్తి సినిమాలు చూడండి. మీతోపాటు మీ పిల్లలకు మన దేశ చరిత్ర, ఔన్నత్యాలు తెలుస్తాయి ● మరింత ఉత్సాహంగా సెలబ్రేట్ చేసుకోవాలంటే మూడు రంగులు ఉండేలా వెరైటీ డిష్‌లు తయారు చేసుకుని తినండి ● స్వాతంత్ర్య దినోత్సవం అర్థం ఉట్టిపడేలా గాలిపటాలు ఎగరవేయండి. మూడు రంగుల్లో ఉన్న గాలిపటాలను వీలైనంత ఎత్తుకుఎగరేస్తూ మనకొచ్చిన స్వేచ్ఛను ఎంజాయ్ చేయవచ్చు ● పుస్తకాల పురుగులు అయితే దేశభక్తి పుస్తకాలను చదవండి. స్వాతంత్ర్య సమర యోధుల విజయగాథలు, వీరిలో బాగా పాపులర్ అయిన నాయకుల బయోగ్రఫీని చదివి ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు ● దేశభక్తి గీతాలు వింటూ కూడా సంబరాలు జరుపుకోవచ్చు. అలనాటి పోరాట, అసామాన్య త్యాగాలను గుర్తుచేసే పాటలను వినాలి. లతా మంగేష్కర్, మహ్మద్ రఫీ, ఏఆర్ రెహ్మాన్ పాటలు మనలో నిద్రపోతున్న దేశభక్తిని తట్టి లేపుతాయి ● ఇంటి చుట్టుపక్కల వారు లేదా బంధువులు, కుటుంబ సభ్యులతో దగ్గరలో జరుగుతోన్న జెండా పండుగకు వెళ్లి రెపరెపలాడే త్రివర్ణ పతాకానికి జైహింద్ కొట్టాలి ● దేశానికి పెద్ద సేవ చేయలేక పోయినప్పటికీ మీ చుట్టుపక్కల ఉన్న వారందరికి స్వీట్లు పంచి, నోరు తీపి చేస్తూ స్వతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకోండి.

ప్రతి భారతీయుడికి ఎంతో విలువైన బహుమతులు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు. అందుకే వీలైనంత వరకు అందరితో కలిసి జరుపుకోవాల్సిన జెండా పండుగ ఇది. సెలవు దొరికింది అని సంబరపడిపోక వీటిలో ఏ ఒక్కదాన్ని పాటించినా స్వాతంత్ర్య దినోత్సవాన్ని గౌరవించినట్లే.

జీవన సేద్యం!

● పెద్ద కమతాల్లో సేంద్రియ వరి సేద్యంలో జీవన ఎరువులు/పురుగుమందులు కీలకం



● వ్యవసాయ క్షేత్రంలో సిద్ధమవుతున్న జీవన ఎరువులు

సాగుబడి
అశ్లేష కార్తె: ఆగస్టు 17 వరకు
మఖ: 18 నుంచి

సేంద్రియ/ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ద్రావణాలు, కషాయాలను చిన్న, సన్నకారు రైతులు తయారు చేసుకొని వాడగలుగుతున్నారు. అయితే, ఎక్కువ విస్తీర్ణంలో సేంద్రియ/ప్రకృతి సేద్యం చేసే పెద్ద రైతులకు వీటి తయారీ కష్టం కావటంతో జీవన ఎరువులు, జీవన పురుగుమందులను విరివిగా వినియోగిస్తున్నారు. రైతు శాస్త్రవేత్త, తునికిలోని ఏకలవ్య కేవీకే సలహాదారు, హార్ట్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఎం.ఎస్.సుబ్రహ్మణ్యం రాజు గత కొన్ని సంవత్సరాలుగా చిన్న, పెద్ద కమతాల్లో సాగు చేసే రైతులతో కలసి పనిచేస్తున్నారు. ఖరీఫ్/లేటు ఖరీఫ్ వరి సాగులో చిన్న కమతాల రైతులు, పెద్ద కమతాల రైతులు ఏయే ఉత్పాదకాలను, ఎంతెంత మోతాదులో వాడితే మంచి ఫలితాలు వస్తున్నాయన్న అంశాలను ఆయన 'సాక్షి సాగుబడి'కి ఇలా వివరించారు.

వరి నారుమడిని నీరు నిలవని విధంగా తయారు చేసుకోవాలి. విత్తనాన్ని ఒక రోజు ముందు ఎండబెట్టి మరునాడు విత్తన శుద్ధి చేయాలి. నిద్రావస్థ ఉన్న విత్తనాలను, నిద్రావస్థ తొలగించడానికి గోరువెచ్చని నీటిలో నానబెట్టి, అనంతరం విత్తనాలను నారుమడిపై వెదజల్లాలి. 2వ రోజు నీరు బయటకు తీయాలి. 5వ రోజు నీరు పెట్టాలి. తర్వాత తగినంత నీరు ఇస్తుండాలి. చాలా ప్రాంతాల్లో నారు 6 అంగుళాల సైజు నుంచి 10 అంగుళాల సైజు వచ్చినప్పుడు మాత్రమే ఊడ్పు/నాట్లు వేస్తుంటారు. నాట్లు వేసిన 7 రోజులకు.. చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ నాట్లు వేయాలి.

ప్రధాన పొలాన్ని ఊడ్పుకు ముందు 20 రోజుల నుంచి దఫ దఫాలుగా వారానికి ఒకసారి దుక్కి దున్ని, చదును చేసుకోవాలి. ఎకరాకు 3 నుంచి 5 టన్నుల పశువుల ఎరువు వెయ్యాలి. నాట్లతో పాటుగా వివిధ రకాల జీవన ఎరువుల (బ్యాక్టీరియాల)ను ఇవ్వాలి. మొక్కల మధ్య 20 సెం.మీ. దూరం ఉండేలా వరి నాట్లు వేయాలి. మధ్యలో కాలి బాటలు తీయాలి. గట్లపై నువ్వుల విత్తనాలను చల్లుకుంటే నువ్వుల పువ్వులు ఎనాగరస్ అనే కీటకాన్ని ఆకర్షించటం ద్వారా తెల్లదోమ నివారణ జరుగుతుంది.

సేంద్రియ వరి సాగులో చిన్న, పెద్ద రైతులకు అనువైన ఉత్పాదకాల పట్టిక

వివరణ	చిన్న రైతులకు అనువైన ప్రాచీన పద్ధతులు	పెద్ద రైతులకు అనువైన ఆధునిక పద్ధతులు
1వ రోజు విత్తనశుద్ధి	బీజామృతంతో విత్తన శుద్ధి చేయాలి	హ్యూమిక్ యాసిడ్, బవేరియా, మెటారైజియం, సూడోమోనాస్
10వ రోజు పిచికారీ	జీవామృతం + పంచగవ్య + పుల్ల మజ్జిగ	మీనామృతం + సూడోమోనాస్+ తౌడు కషాయం
12వ రోజు ఎరువు	ఘనజీవామృతం	ఘనజీవామృతం / వర్మికంపోస్టు + హ్యూమిక్ ఆసిడ్
20వ రోజు సస్యరక్షణ	ఆగ్నేయ అస్త్రం + జీవామృతం + మొలకల ద్రావణం	మీనామృతం + బేవేరియా, మెటారైజియం + వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
ఊడ్పు అనంతరం 22వ రోజు స్ప్రే	పంచగవ్య + అగ్ని అస్త్రం + పుల్ల మజ్జిగ	మీనామృతం+బవేరియా +మెటారైజియం+ వెర్టిసీలియం + కొబ్బరి నీరు పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగుకు ల్యూర్ పెట్టాలి లేదా ట్రైకోగ్రామా కార్డులు పెట్టాలి లేదా తూజా 200 (హోమియో) పిచికారీ చేయాలి.
25వ రోజు ఊడ్పు	ఘనజీవామృతం 1 టన్ను / 1 ఎకరం + వేప పిండి 200 కిలోలు/ఎకరం	ఘనజీవామృతం 1 టన్ను/ 1ఎ + బ్యాక్టీరియాలు, ఎన్‌పికె, బవేరియా, మెటారైజియం బాక్టీరియాలు.
25 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
35 రోజులకు	మొలకల ద్రావణం + ఆగ్నేయ అస్త్రం + ఇంగువ కషాయం లేదా పుల్ల మజ్జిగ పిచికారీ చేయాలి.	మీనామృతం, సోయాజీన్, పెసలు మొలకల ద్రావణం, సూడోమోనాస్, బవేరియా, మెటారైజియం, వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
40 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
45 రోజులకు	మొలకల ద్రావణం + వేప గింజల కషాయం	మీనామృతం + నేల వేము కషాయం + ఉలవల కషాయం
45 రోజులకు	ఘనజీవామృతం 500 కిలోలు/1 ఎకరం	ఘనజీవామృతం 500 కిలోలు / 1 ఎకరం
65వ రోజు పిచికారి	మొలకల ద్రావణం + ఇంగువ కషాయం + పసుపు దుంపల కషాయం + ఆగ్నేయ అస్త్రం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + వావిలాకు కషాయం
80వ రోజు పిచికారీ	మొలకల ద్రావణం + పుల్ల మజ్జిగ + దశపర్ణి కషాయం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + బవేరియా



● జీవామృతం

మోతాదు ఎంత?

● ఎకరం పంటకు సగటున 100–120 లీ. నీటిని పిచికారీ చేయాలి ● మీనామృతాన్ని నారుమడిపై లీ. నీటికి 5 ఎం.ఎల్., పైరు ఎదిగిన దశలో లీ. నీటికి / 10ఎం.ఎల్. చొప్పున కలిపి పిచికారీ చేయాలి ● బవేరియాను లీ. నీటికి /10 గ్రా. కలిపి పిచికారీ చేయాలి ● మెటారైజియమ్ లీ. నీటికి/10 గ్రా. వాడాలి ● హ్యూమిక్ యాసిడ్ కిలో విత్తనాలకు/10 గ్రా. వాడాలి. ● కిలో నేల వేము పొడిని 100 లీ. నీటిలో కలిపి కషాయం తయారు చేయాలి ● 1500 గ్రా. వావిలాకు పొడిని కషాయం చేసుకొని 100 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి ● ఎకరానికి రకానికి ఒక కిలో చొప్పున జీవన ఎరువులు వాడాలి ● లీ. నీటికి 10 ఎం.ఎల్. కొబ్బరి నీరు కలపాలి ● పంచగవ్య నారుమడిలో పిచికారీకి లీ. నీటికి 5 ఎం.ఎల్. కలపాలి. పైరు ఎదిగే దశలో పిచికారీకి లీ. నీటికి 20 ఎం.ఎల్. కలపాలి ● అర కేజీ ఇంగువతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి ● 200 గ్రా. పసుపును కషాయం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి ● 2 కిలోల మొలకలతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి ● 6 లీ. పుల్ల మజ్జిగను వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేయాలి. ● ఆగ్నేయ అస్త్రం తయారీలో మిర్చి, అల్లం, వెల్లుల్లిలను అర కిలో చొప్పున తీసుకొని నూరి కషాయం తయారు చేసి వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
(ఇతర వివరాలకు.. సుబ్రహ్మణ్యం రాజు మొబైల్: 76598 55588)

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

ఎడారిలో ఆశల మొలక



● థార్ ఎడారిలో సాగవుతున్న మొలకగడ్డి

ప్రపంచంలోనే అత్యధిక పాలను ఉత్పత్తి చేస్తున్న మన దేశంలో పచ్చిగడ్డి లభ్యత 11 శాతం తక్కువగా ఉందని భారతీయ గడ్డి నేలలు, పశుగ్రాస పరిశోధనా సంస్థ లెక్కగట్టింది. భూతాపం ప్రమాదకరమైన రీతిలో పెరుగుతున్న ప్రస్తుత కాలంలో పచ్చి గడ్డి సాగుకు హైడ్రోపోనిక్స్ పద్ధతి చక్కని ప్రత్యామ్నాయంగా మారుతోంది. ఈ పద్ధతిలో తక్కువ స్థలంలో, పది శాతం నీటితోనే ఏడాది పొడవునా మొలక గడ్డిని పెంచుకోవచ్చు. మొలక గడ్డిని పాడి ఆవులు, గొర్రెలు, మేకలకు మేపటం మన రాష్ట్రాల్లోనే కాదు.. రాజస్థాన్‌లోని థార్ ఎడారి ప్రాంత పశుపోషకులను సైతం ఆకర్షిస్తోంది. అక్కడ ఏడాదిలో రెండు నెలలే వర్షం పడుతుంది. మండు వేసవిలో ఎండ వేడి 120 డిగ్రీల సెల్షియస్‌కు చేరుతుంటుంది. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో జీవించే థార్ ప్రాంత రైతులు, సంచార పశుపోషకులు స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌ల తోడ్పాటుతో ఇటీవల హైడ్రోపోనిక్ మొలక గడ్డి సాగు చేపట్టారు. సునాయాసంగా నాణ్యమైన పాల దిగుబడితో పాటు ఆదాయాన్ని పెంచుకుంటున్నారు.



● మొలకగడ్డి వేస్తున్న మహిళారైతు పలు హేమారామ్

స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌లు ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకుల కోసం హైడ్రోపోనిక్ మొలక గడ్డిని పెంచే షెడ్లను నెలకొల్పుతున్నాయి. రైతులే వాటిలో మొక్కజొన్నలు, గోధుమలను నానబెట్టి, వర్టికల్ గార్డెన్ మాదిరిగా అనేక దొంతర్లలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ట్రేలలో మొలక గడ్డిని పెంచుతున్నారు. సాధారణంగా పొలంలో పచ్చి గడ్డిని పెంచడానికి 2 నెలలు పడుతుంది. మొలక గడ్డి 8 రోజుల్లో పెరుగుతుంది. ముఖ్యంగా పది శాతం నీటితోనే ఈ గడ్డి పెరగటం థార్ ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకులకు ఉపయుక్తంగా మారింది.

స్వచ్ఛంద సంస్థ ఉర్ముల్ సీమంత్ సమితి, డిజర్ట్ రిసోర్స్ సెంటర్‌తో కలసి హైడ్రోగ్రీన్స్, బహుళ నేచురల్స్ స్టార్టప్‌లు మొలక గడ్డి ఉత్పత్తి యూనిట్లను థార్ ఎడారి గ్రామాల్లో ఏర్పాటు చేస్తుండటంతో కొందరు మహిళా రైతులు హాయిగా ఊపిరిపీల్చుకుంటున్నారు. బహుళ నేచురల్స్ వీరి వద్ద నుంచి దేశీ ఆవు పాలను, ఒంటె పాలను సేకరించి, విలువ జోడించి ఆన్‌లైన్‌లో విక్రయిస్తోంది. వెయ్యి మంది పాడి రైతులు, 4 వేల మంది పశుపోషకులు తమ ఆవులు, మేకలకు మొలక గడ్డిని మేపుకుంటూ ఏడాది పొడవునా స్థిరమైన ఆదాయం పొందుతున్నారు.

పశుపోషణ కోసం గొడ్డు చాకిరీ చేసే మహిళా రైతులకు మొలక గడ్డి అందుబాటులోకి రావటం గొప్ప ఊరటనిస్తోంది. మొలక గడ్డి మేపుతో దేశీ ఆవు పాల దిగుబడి మూడింట ఒక వంతు పెరగడంతో పాటు, నాణ్యత కూడా పెరిగిందని రాజస్థాన్‌లోని ఘంటియాలి గ్రామానికి చెందిన దళిత మహిళా పశుపోషకురాలు 'పలు', ఆమె భర్త హేమారామ్ సంతోషంగా చెబుతున్నారు. వీరికి 8 ఆవులు, మేకలు ఉన్నాయి. 4 మైళ్ల దూరంలో ఉన్న పొలానికి వెళ్లి గడ్డి కోసుకొని, ఎండలో నెత్తిన పెట్టుకొని మోసుకు రావటం ఆమెకు కనాకష్టంగా ఉండేది. రెండేళ్ల క్రితం ఇంటి పక్కనే మొలకగడ్డి ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నాక ఆ బాధ తప్పింది. మిగులు గడ్డిని, గోధుమ గడ్డి పొడిని అమ్ముతూ ఆదాయం పొందుతుండటం విశేషం.

దూడలకు పెట్టే కాన్సంట్రేట్ మిక్చర్ దాణాను 75% తగ్గించి మొక్కజొన్న మొలక గడ్డిని మేపటం వల్ల మంచి ఫలితం కనిపించిందని బికనెర్ వెటరినరీ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.కె. ధురియా అన్నారు. హైడ్రోపోనిక్ మొలక గడ్డి వల్ల మేకల్లో జీర్ణశక్తి, పెరుగుదల బాగుందని సౌదీ అరేబియాలోని కింగ్ సౌద్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడైంది. మొలకగడ్డి యూనిట్ ఏర్పాటుకు రూ. 18 లక్షల నుంచి 25 లక్షల వరకు ఖర్చవుతోంది. అయితే, ఇసుక తుపాన్లకు మొలకగడ్డి షెడ్లు దెబ్బతినటం వల్ల నష్టం జరుగుతోంది.

అందుకని, ముమ్ముందు షిప్పింగ్ కంటెయినర్లలో మొలకగడ్డి ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయటమే దీనికి పరిష్కారమని బహుళ నేచురల్స్ భావిస్తోంది. లక్షల ఖర్చుతో కూడిన పని కావటంతో రైతులను బృందాలుగా ఏర్పాటు చేసి మొలకగడ్డి యూనిట్లను నెలకొల్పితే మేలు. అయితే, రూ. 17.500 ఖర్చుతో చిన్నపాటి మొలకగడ్డి యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చని హైడ్రోగ్రీన్స్ స్టార్టప్ చెబుతోంది.

బయోచార్‌తో సేంద్రియ ఇంటిపంటల సాగుపై శిక్షణ

సేంద్రియ ఇంటిపంటల సాగుపై పట్టణ/నగర వాసులపై ఆసక్తి పెరుగుతోంది. బయోచార్ (బొగ్గుపొడి) కలిపిన మట్టి మిశ్రమంతో టెర్రస్ గార్డెన్లు, పెరటి తోటలు, బాల్కనీలలో కూరగాయల పెంపకంపై ఈ నెల 24, 25 తేదీల్లో హైదరాబాద్ మలకోపేటలోని న్యూలైఫ్ ఫౌండేషన్ శిక్షణ ఇవ్వనుంది. మిగులు పంట దిగుబడులను సోలార్ డ్రయ్యర్‌తో ఎండబెట్టే విధానం కూడా వివరిస్తామని న్యూలైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శివ షిండే తెలిపారు. వివరాలకు.. 81210 08002.

17న అమలాపురంలో ప్రకృతి సేద్యంపై శిక్షణ

శ్రీనివాస సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 17న కోనసీమ జిల్లా అమలాపురంలోని (ముక్తేశ్వరం– కొత్తపేట రోడ్డు) శ్రీసత్యనారాయణ గార్డెన్స్‌లో ప్రకృతి వ్యవసాయంపై నిపుణులు విజయరామ్ రైతులకు అవగాహన కల్పిస్తారని నిర్వాహకులు నిమ్మకాయల సత్యనారాయణ తెలిపారు. ప్రవేశం ఉచితం. ముందుగా పేరు నమోదు చేసుకోవాలి. వివరాలకు.. 64091 11427 (సా. 3 గం. నుంచి 6 గం. వరకు మాత్రమే).

అయ్యర్, రాహుల్ ప్రాక్టీస్ షురూ



గాయాలతో జట్టుకు దూరమైన భారత క్రికెటర్లు శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ మళ్లీ బ్యాట్ పట్టారు. గాయాలు మానడంతో బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో ప్రాక్టీస్ మొదలుపెట్టారు. ఆసియా కప్ కోసం భారత జట్టును ఎంపిక చేసేందుకు త్వరలోనే అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ సమావేశం కానుంది. ఈ నేపథ్యంలో అయ్యర్, రాహుల్ ప్రస్తుతం ఫిట్‌నెస్ నిరూపించుకునే పనిలో పడ్డారు. దీనికి సంబంధించిన వీడియో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు.

ఐక రాజు 'డబుల్ ధమాకా'



అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య జూనియర్ సర్క్యూట్‌లో హైదరాబాద్ అమ్మాయి ఐక రాజు కనుమూరి రెండు టైటిల్స్ సాధించింది. నికరాగ్వాలో జరిగిన జే30 కేటగిరీ టోర్నీలో 16 ఏళ్ల ఐక సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో విజేతగా నిలిచింది. సింగిల్స్ ఫైనల్లో ఐక 6-3, 2-6, 6-3తో వాలెంటీనా టిజారో (కొలంబియా)పై గెలిచింది. టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన ఐక ఫైనల్ చేరే క్రమంలో కేవలం ఐదు గేమ్‌లు మాత్రమే కోల్పోయింది. డబుల్స్‌లో వాలెంటీనాతో జత కట్టిన ఐక టైటిల్ దక్కించుకుంది.

భారత రెజ్లింగ్ ట్రయల్స్ 25, 26వ తేదీల్లో

ఈసారి ఎవరికీ దక్కని మినహాయింపు



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌లను ఖరారు చేసే ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్లను ఈనెల 25, 26వ తేదీల్లో ఎంపిక చేయనున్నారు. పాటియాలాలో నిర్వహించే ఈ ట్రయల్స్ నుంచి ఎవరికీ మినహాయింపు లేదని... ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాలనుకుంటే అందరూ ఈ ట్రయల్స్‌కు హాజరు కావాల్సిందేనని భారత రెజ్లింగ్ సమాఖ్య వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న అడ్-హాక్ ప్యానెల్ వెల్లడించింది. ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత జట్ల ఎంపిక కోసం నిర్వహించిన ట్రయల్స్ నుంచి స్టార్ రెజ్లర్లు బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్‌లకు మినహాయింపు ఇవ్వడం వివాదాస్పదమైంది. సెప్టెంబర్ 16 నుంచి 24 వరకు బెల్‌గ్రేడ్‌లో ప్రపంచ చాంపియన్‌షిప్ జరగనుంది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఆయా కేటగిరీల్లో టాప్-5లో నిలిచిన రెజ్లర్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తారు.

సినెర్ తొలిసారి...

టొరంటో: మూడో ప్రయత్నంలో ఇటలీ రైజింగ్ టెన్నిస్ స్టార్ యానిక్ సినెర్ తన కెరీర్‌లో తొలి ఏటీపీ మాస్టర్స్ సిరీస్-1000 టైటిల్ గెలిచాడు. నేషనల్ బ్యాంక్ ఓపెన్ ఏటీపీ-1000 మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నీలో 21 ఏళ్ల సినెర్ విజేతగా నిలిచాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో సినెర్ 6-4, 6-1తో అలెక్స్ డి మినార్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించాడు. సినెర్‌కు 10,19,335 డాలర్ల (రూ. 8 కోట్ల 47 లక్షలు) ప్రైజ్‌మనీతో పాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. 2021, 2023లలో మయామి మాస్టర్స్ సిరీస్ టోర్నీ ఫైనల్లో సినెర్ ఓడిపోయాడు. ఫాబియో ఫాగ్‌నిని తర్వాత ఏటీపీ మాస్టర్స్ సిరీస్ టైటిల్ గెలిచిన రెండో ఇటలీ ప్లేయర్‌గా సినెర్ గుర్తింపు పొందాడు. 2019లో ఫాబియో ఫాగ్‌నిని మోంటెకార్లో ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టోర్నీలో టైటిల్ గెలిచాడు.



తిలక్ వర్మ... పేరు గుర్తుంచుకోండి!

- తొలి అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న హైదరాబాద్ క్రికెటర్
- విండీస్‌తో టి20 సిరీస్‌లో టాప్ స్కోరర్
- నిలకడ కొనసాగిస్తే వన్డే ప్రపంచకప్‌లోనూ చాన్స్



తిలక్ పేరులో 'లక్' ఉంది. ఈ 'లక్' చోటు వచ్చేందుకు పనికొస్తుందేమో కానీ... రాణించేందుకు ఏమాత్రం ఉపయోగపడదు. శక్తి, సామర్థ్యాలతో పాటు టెక్నిక్, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న పట్టుదల, పాతుకుపోవాలన్న సంకల్పమే ఏ ఆటగాడినైనా నిలబెడతాయి. ఎడంచేతి వాటం బ్యాటర్ తిలక్ వర్మ కూడా అదే చేశాడు. కష్టపడే జట్టులోకి వచ్చాడు. వచ్చాక ప్రత్యర్థి బౌలర్ల భరతం పడుతున్నాడు. బ్యాటింగ్‌లో ఈ నిలకడే భారత టీమ్ మేనేజ్‌మెంట్ కంట నాలుగో స్థానంపై ఆశాకిరణమయ్యేలా చేస్తోంది.

–సాక్షి క్రీడా విభాగం

ఠాకూర్ తిలక్ వర్మ ఐపీఎల్‌లో దంచేస్తుంటే అందరికి తెలిసొచ్చింది. కానీ హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) డివిజన్ లీగ్ క్రికెట్‌లోనే అతను వార్తల్లో వ్యక్తి అని చాలా మందికి తెలియదు. మూడు రోజుల ఆటలో జట్టును అర్ధ సెంచరీలతో ఆదుకున్నాడు. సెంచరీలతో గెలిపించాడు. ఐపీఎల్ వేలంలోకి వచ్చాక లీగ్‌లో మనోడున్నాడు అనిపించాడు. నిలకడైన ఆటతో మెల్లిగా ముంబై ఇండియన్స్ జట్టు మొనగాడయ్యాడు. ఇప్పుడు కరీబియన్‌కు తీసుకెళ్తే భారత ఆశాకిరణమయ్యాడు. అలా ఒక్కో మెట్టెక్కుతూ... కింది నుంచే పైకొచ్చాడు.

గతేడాది ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన తిలక్ ఆ సీజన్‌లో ముంబైని మురిపించాడు. షాట్ల ఎంపిక, బంతిని పంపిన ప్లేసింగ్ తీరు, ధాటిగా ఆడే నైపుణ్యం ఇవన్నీ గమనించిన ముంబై యాజమాన్యం అతనికి విరివిగా అవకాశాలిచ్చింది. అన్ని మ్యాచ్‌ల్లో బరిలోకి దింపింది. దాంతో 131.02 స్ట్రయిక్‌రేట్‌తో 397 పరుగులు చేశాడు. 36.09 సగటు నమోదు చేశాడు. ఈ సీజన్‌లోనూ 11 మ్యాచ్‌ల్లో ఆడిస్తే 164.11 స్ట్రయిక్ రేట్‌తో 343 పరుగులు చేశాడు. సగటేమో 42.87! అంటే ఈ రెండేళ్లలో సగటు, స్ట్రయిక్‌రేట్ రెండు పెంచుకున్నాడు. జట్టు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టాడు. ఈ గణాంకాలతోనే తిలక్ వర్మ అదరగొట్టాడనుకుంటే పొరబడినట్లే! ఎందుకంటే ముంబై కష్టాల్లో ఉంటే ఆటగాళ్లపై ఒత్తిడి పెరిగితే... అతను మాత్రం యథేచ్ఛగా ఆడిన తీరే అందరిమెప్పు పొందేలా చేసింది. క్రికెట్ విశ్లేషకులు, ప్రముఖ టీవీ వ్యాఖ్యాతలే కాదు... దిగ్గజ క్రికెటర్లు సైతం తిలక్ వర్మ ఆటకు, ఆడిన తీరుకు ముచ్చటపడ్డారు. ప్రశంసలు కురిపించారు.

విండీస్‌లో సిక్సర్లతో...

అతని ప్రతిభను బీసీసీఐ సీనియర్ సెలక్షన్ కమిటీ కూడా గుర్తించి కరీబియన్ పర్యటనకు పంపింది. కేవలం టి20ల్లో మాత్రమే అవకాశమిచ్చింది. అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదుగా లభించిన ఈ సదవకాశాన్ని హైదరాబాదీ లెఫ్ట్ హ్యాండర్ వదులుకోలేదు. కోచ్ రాహుల్ ద్రవిడ్, కెప్టెన్ హార్దిక్ పాండ్యాల గేమ్ ప్లాన్‌లో భాగమైన తిలక్... విండీస్ తురుపుముక్కలైన సీమర్లను సునాయాసంగా ఎదుర్కొన్నాడు. ఎదుర్కొన్న తొలి బంతికి పరుగు తీయలేకపోయాడు... కానీ అంతర్జాతీయ పరుగుల ప్రయాణాన్ని మాత్రం సిక్సర్లతో ప్రారంభించాడు. తొలి రెండు టి20ల్లో 39 పరుగులు, 51 పరుగులు అతనిదే టాప్ స్కోర్! తర్వాత మూడు మ్యాచ్‌ల్లో 49 నాటౌట్, 7 నాటౌట్, 27 పరుగులు... ఇలా ప్రతి మ్యాచ్‌లోనూ బాధ్యత కనబరిచాడు. ఓవరాల్‌గా 173 పరుగులతో ఈ సిరీస్‌లో భారత టాప్ స్కోరర్‌గా అవతరించాడు. అందుకే భారత కెప్టెన్ రోహిత్ ఓ ఇంటర్వ్యూలో హైదరాబాదీ ఆటగాడిని ప్రత్యేకంగా ప్రస్తావించాడు, ప్రశంసించాడు.

ఆసియా కప్, ప్రపంచకప్‌లపై...

యువరాజ్ సింగ్ రిటైర్మెంట్ తర్వాత బదులు తోచని ప్రశ్నగా మిగిలిపోయిన నాలుగో స్థానం ఇప్పుడు తిలక్‌ను ఊరిస్తోంది. ఆసియా కప్‌లో సెలక్టర్లు మాత్రం అతన్ని కొనసాగించే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. ఇక అక్కడ కూడా మ్యాచ్ మ్యాచ్‌కు ఇలాంటి నిలకడ, ధాటైన జోరు కొనసాగిస్తే మాత్రం స్వదేశంలో జరిగే వన్డే ప్రపంచకప్ కోసం అతని పేరును పరిశీలించడం, చోటివ్వడం ఖాయమవ్వుతుందేమో చూడాలి.

విదిత్ సంచలనం

ప్రపంచ ఐదో ర్యాంకర్‌పై గెలుపుతో క్వార్టర్స్‌లోకి



బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నీ ఓపెన్ విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ విదిత్ సంతోష్ గుజరాతి సంచలనం సృష్టించాడు. ప్రపంచ ఐదో ర్యాంకర్, రష్యా గ్రాండ్‌మాస్టర్ ఇయాన్ నిపోమ్‌నిషితో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో విదిత్ 4-2తో నెగ్గి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. నిర్ణీత రెండు క్లాసికల్ గేమ్‌ల తర్వాత ఇద్దరూ 1-1తో సమంగా ఉండటంతో విజేతను నిర్ణయించేందుకు సోమవారం ర్యాపిడ్ ఫార్మాట్‌లో టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించారు. ముందుగా 25 నిమిషాల నిడివిగల రెండు ర్యాపిడ్ గేమ్‌లను ఆడించగా ఈ రెండూ 'డ్రా'గా ముగిశాయి. దాంతో స్కోరు 2-2తో సమమైంది. అనంతరం 10 నిమిషాల నిడివిగల రెండు ర్యాపిడ్ గేమ్‌లను ఆడించారు. ఈ రెండింటిలో విదిత్ గెలుపొందడం విశేషం. తొలి గేమ్‌లో 60 ఎత్తుల్లో గెలిచిన విదిత్ రెండో గేమ్‌లో 52 ఎత్తుల్లో నెగ్గాడు. దాంతో విదిత్‌కు క్వార్టర్ ఫైనల్ బెర్త్ ఖరారైంది. ఈ టోర్నీలో నాలుగో భారత ప్లేయర్ క్వార్టర్ ఫైనల్ చేరాడు. ఇప్పటికే ఇరిగేశి అర్జున్, దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద క్వార్టర్ ఫైనల్ చేరారు. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్స్ తొలి గేమ్‌లలో కార్ల్‌సన్ (నార్వే)తో గుకేశ్; నిజాత్ అబసోవ్ (అజర్‌బైజాన్)తో విదిత్; ప్రజ్ఞానందతో అర్జున్; కరువానా (అమెరికా)తో లీనియర్ (అమెరికా) తలపడతారు.

హారిక ఓటమి

మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక పోరాటం ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో హారిక 3.5-4.5తో అలెగ్జాండ్రా గోర్యాచ్‌కినా (రష్యా) చేతిలో ఓడిపోయింది. వీరిద్దరి మధ్య రెండు క్లాసికల్ గేమ్‌లు 'డ్రా'గా ముగియడంతో విజేతను నిర్ణయించేందుకు ర్యాపిడ్ ఫార్మాట్‌లో టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించారు. తొలి గేమ్‌లో గోర్యాచ్‌కినా, రెండో గేమ్‌లో హారిక గెలిచారు. దాంతో స్కోరు 2-2తో సమమైంది. అనంతరం నిర్వహించిన రెండు గేమ్‌లు 'డ్రా' కావడంతో స్కోరు 3-3తో సమమైంది. ఈసారి రెండు గేమ్‌లు నిర్వహించగా... తొలి గేమ్‌లో గోర్యాచ్‌కినా 43 ఎత్తుల్లో గెలిచి, రెండో గేమ్‌ను 95 ఎత్తుల్లో 'డ్రా' చేసుకొని సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది.

క్రికెట్‌కు ఫిన్ వీడ్కోలు



లండన్: ఇంగ్లండ్ జట్టు పేస్ బౌలర్ స్టీవెన్ ఫిన్ అన్ని రకాల క్రికెట్ ఫార్మాట్‌ల నుంచి వీడ్కోలు తీసుకున్నాడు. తీవ్రమైన మోకాలి గాయం కారణంగానే తాను ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు 34 ఏళ్ల ఫిన్ వెల్లడించాడు. తన 13 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో ఫిన్ ఇంగ్లండ్ తరఫున 36 టెస్టులు, 69 వన్డేలు, 21 టి20 మ్యాచ్‌లు ఆడాడు. 6 అడుగుల 7 అంగుళాల ఎత్తున్న ఫిన్ టెస్టుల్లో 125 వికెట్లు, వన్డేల్లో 102 వికెట్లు, టి20ల్లో 27 వికెట్లు పడగొట్టాడు. ఆస్ట్రేలియాపై 2010-11, 2013, 2015లలో యాషెస్ సిరీస్ గెలిచిన ఇంగ్లండ్ జట్లలో ఫిన్ సభ్యుడిగా ఉన్నాడు.

రన్నరప్ సంతోష్ జోడీ



కాలిఫోర్నియా: సూపర్ స్మాష్ ఓపెన్ బ్యాడ్మింటన్ డబుల్స్ టోర్నమెంట్‌లో యూఎస్ అకాడమీకి ప్రాతినిధ్యం వహించిన భారత ప్లేయర్ రావూరి సంతోష్ రన్నరప్‌గా నిలిచాడు. అమెరికాలో జరిగిన ఈ టోర్నీలో సంతోష్-రత్నజీత్ తమాంగ్ జోడీ 6-21, 14-21తో శ్లోక్ రామచంద్రన్-సిబాయాన్ (అమెరికా) ద్వయం చేతిలో ఓటమి పాలైంది. హైదరాబాద్‌కు చెందిన సంతోష్ గతంలో భారత జూనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. పుల్లెల గోపీచంద్ అకాడమీలో శిక్షణ పొందాడు.


విజేత జెస్సికా



మాంట్రియల్: పదేళ్ల తర్వాత నేషనల్ బ్యాంక్ ఓపెన్ డబ్ల్యూటీఏ-1000 టెన్నిస్ టోర్నీలో అమెరికా ప్లేయర్‌కు టైటిల్ లభించింది. సోమవారం జరిగిన ఈ టోర్నీ మహిళల సింగిల్స్ ఫైనల్లో నాలుగో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా) 6-1, 6-0తో లుద్మిలా సమ్సోనోవా (రష్యా)పై అలవోకగా గెలిచి చాంపియన్‌గా నిలిచింది. జెస్సికాకు 4,54,500 డాలర్ల (రూ. 3 కోట్ల 77 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 900 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. 2013లో సెరెనా విలియమ్స్ తర్వాత ఈ టోర్నీలో విజేతగా నిలిచిన అమెరికన్ ప్లేయర్‌గా జెస్సికా ఘనత వహించింది.

దేశం అనగానే భారతీయ ప్రేక్షకులు వెంటనే కనెక్ట్ అయిపోతారు. సరైన దేశభక్తి సినిమా వస్తే సూపర్ డూపర్ హిట్ చేసి భావోద్వేగంతో ఊగిపోతారు. బాలీవుడ్‌లో మంచి మంచి దేశభక్తి సినిమాలు వచ్చాయి. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తప్పక చూడాల్సిన 10 దేశభక్తి సినిమాలు..


మేరా భారత్ మహాన్




హకీకత్ (1964): దేశాల మధ్య యుద్ధాలు వస్తే సైనికుల వీరోచిత పోరాటాలు, త్యాగాలు తప్పనిసరి. వాటిని చూపుతూనే యుద్ధాలు ఎలా సగటు సైనికుడి ప్రాణాలు బలిగొంటాయో కూడా చూపిన సినిమా హకీకత్. 1962 నాటి ఇండో చైనా యుద్ధం మీద వచ్చిన ఈ సినిమా అతి తక్కువ మంది భారత సైనిక పటాలం చైనా భారీ సేనతో ఎలా తలపడిందో చూపుతుంది. బల్‌రాజ్ సహానీ, ధరేంద్ర తదితరులు నటించిన ఈ సినిమాకు చేతన్ ఆనంద్ దర్శకుడు. కైఫీ ఆజ్మీ రాసిన ప్రఖ్యాత దేశభక్తి గీతం 'కర్ చలే హమ్ ఫిదా జాన్ ఏ వతన్ సాథియో' ఇందులోదే.



ఉప్‌కార్ (1967): దేశభక్తి సినిమాలు తీసి 'మిస్టర్ భరత్' బిరుదు పొందిన నటుడు మనోజ్ కుమార్ నాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి సూచన మేరకు 'జై జవాన్ జై కిసాన్' నినాదానికి ఇచ్చిన సినీ రూపం 'ఉప్‌కార్'. సైనికులు దేశ సరిహద్దుల వద్ద మాత్రమే సంఘర్షణ చేస్తారు... కాని రైతులు దేశంలో జీవితాంతం సంఘర్షణ చేసి గింజలు పండించి జనం కడుపులు నింపుతారు... వారే నిజమైన హీరోలు అని చెప్పే సినిమా ఇది. 'మేరీ దేశ్ కి ధర్తీ సోనా ఉగ్‌లే...ఉగ్‌లే హీరే మోథీ' హిట్ గీతం ఇందులోదే.



బోర్డర్ (1997): యుద్ధంలో చావు కళ్ల ముందు కదలాడుతుంటే దేశం తప్ప మరేమీ గుర్తు రాక సంతోషంగా బలిదానం ఇచ్చే సైనికుల వీర త్యాగం ఎలా ఉంటుందో 'బోర్డర్'లో చూడాలి. 1971 నాటి ఇండో పాక్ యుద్ధాన్ని కథాంశంగా తీసుకుని దర్శకుడు జె.పి. దత్తా తీసిన ఈ సినిమా ఒక గొప్ప వార్ మూవీ. సన్ని డియోల్, సునీల్ శెట్టి తదితరులు నటించిన ఈ సినిమాలో సైనికుల జీవితాన్ని వాస్తవికంగా చూపడంలో దర్శకుడు సఫలం అయ్యాడు. యుద్ధ వ్యూహాలు కూడా ఈ సినిమాలో తెలుస్తాయి.



లగాన్ (2001): దేశభక్తికి క్రీడలు జత చేసి గొప్ప సంచలనం సృష్టించిన సినిమా 'లగాన్'. పన్నుల మీద పన్నులు వేసి దాష్టీకం చేస్తున్న బ్రిటిష్ వారిని చిన్న పల్లెజనం క్రికెట్‌లో ఓడించడం ప్రేక్షకులకు ఎంతగానో నచ్చింది. ఆమిర్ ఖాన్ నిర్మించిన ఈ సినిమాకు అశుతోష్ గోవారికర్ దర్శకుడు. ఆస్కార్ నామినేషన్ పొందింది. అద్భుతమైన కథనం, సంగీతం, నటన, భావోద్వేగాలు, ఆటలో ఉండే మలుపులు తోడు కావడంతో ప్రేక్షకులు జేజేలు పలికారు.



ది లెజెండ్ ఆఫ్ భగత్‌సింగ్ (2002): అమర దేశభక్తుడు భగత్ సింగ్ కథను తీసుకుని రాజ్ కుమార్ సంతోషి తీసిన అద్భుతమైన సినిమా ఇది. అజయ్ దేవగణ్- భగత్ సింగ్ పాత్రను పోషించి ప్రేక్షకుల కంట కన్నీరు తెప్పించాడు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్... ఈ ముగ్గురు దేశభక్తులు తమ ఉడుకు నెత్తురుతో దేశం కోసం పోరాడి లేత వయసులో మరణించడం ప్రేక్షకుల మనసు కలచి వేసేలా ఈ సినిమా చూపుతుంది. దేశం కోసం ఎలాంటి స్ఫూర్తితో ఉండాలో తెలుపుతుంది.



లక్ష్య (2004): మంచి దేశభక్తి సినిమా మాత్రమే కాదు యువతను లక్ష్యం వైపు నడిపించే సినిమా కూడా. రిలీజైనప్పుడు ప్రేక్షకుల నుంచి స్పందన అంతంత మాత్రంగా ఉన్నా ఆ తర్వాత కల్ట్ క్లాసిక్‌గా నిలిచింది. కార్గిల్ వార్‌ను నేపథ్యంగా తీసుకుని గొప్ప సాంకేతిక విలువలతో తీశారు. హృతిక్ రోషన్‌తో పాటు అమితాబ్ బచ్చన్ కూడా నటించారు. మిలట్రీ వాతావరణం, క్రమశిక్షణ, ధీరత్వం ఈ సినిమాలో పుష్టిగా చూడొచ్చు.



స్వదేశ్ (2004): ఈ దేశం నీకేమిచ్చిందని కాదు... ఈ దేశానికి నువ్వేమిచ్చావ్ అని తరచి ప్రశ్నించుకోవాలని నెహ్రూ అన్నారు. ఆ ప్రశ్నకు జవాబు ఈ సినిమా. ఈ దేశంలో పుట్టి పెరిగి చదువుకుని పరాయి దేశానికి వెళ్లి ఆ దేశానికి సేవ చేయడం తప్పు కాదు కానీ మన దేశానికి ఏదైనా చేయాలన్న బాధ్యతను మరువకూడదని ఎంతో గట్టిగా చెప్పింది 'స్వదేశ్'. షారూక్ ఖాన్ నటించిన ఈ చిత్రానికి అశుతోష్ గోవారికర్ దర్శకుడు. ఎన్‌ఆర్‌ఐల బాధ్యతను నిలదీసిన సినిమా ఇది.



రంగ్ దే బసంతి (2006): ఉద్యోగం వచ్చే చదువును చదువుకోవడం వేరు, దేశం పట్ల చైతన్యాన్ని కలిగించుకుని బాధ్యతను గుర్తెరగడం వేరు. నేటి యువత తమ కెరీర్‌ను వెతుక్కుంటున్నది గాని దేశం కోసం ఏం చేయాలో ఆలోచించడం లేదు. 'రంగ్ దే బసంతి'... అల్లరి చిల్లరి యూనివర్సిటీ కుర్రాళ్లను దేశం కోసం ఏదైనా గట్టిగా చేయాలని నిర్ణయించుకోవడాన్ని చూపుతుంది. పుచ్చిపోయిన వ్యవస్థను సరిచేయాలనుకుని ప్రాణాలు అర్పించే కుర్రాళ్ల కథ ఇది. రాకేష్ మెహ్రా దర్శకుడు. ఆమిర్ ఖాన్ హీరో.



ది ఫర్‌గాటెన్ హీరో (2004): నేతాజీ సుభాష్ చంద్రబోస్ కోసం ఈ దేశం గుండె సగర్వంగా స్పందిస్తూనే ఉంటుంది. బ్రిటిష్ వారిపై పోరాడటానికి ఏకంగా సైన్యాన్ని నిర్మించిన ధీరుడు ఆయన. నేతాజీ మరణం ఇంకా మిస్టరీనే. నేతాజీ జీవితాన్ని అథెంటిక్‌గా చూపిన సినిమా ఇది. శ్యామ్ బెనగళ్ దర్శకునిగా ఎంత రీసెర్చ్ చేశాడో తెలుస్తుంది. నేతాజీగా సచిన్ ఖడేకర్ అద్భుతంగా నటించారు. గతించిన చరిత్రకు దర్పణం ఈ సినిమా.



రాజీ (2018): దేశం కోసం గూఢచారిగా పని చేసి త్యాగాలు చేసిన వారు ఎందరో. వారిలో పురుషులతో పాటు స్త్రీలు కూడా ఉన్నారు. అలాంటి ఒక స్త్రీ కథ 'రాజీ'. ఆలియా భట్ నటించిన ఈ సినిమా పాకిస్తాన్‌కు కోడలుగా వెళ్లి అక్కడ భారత్ కోసం గూఢచారిగా పని చేసిన సెహమత్ అనే స్త్రీ ఎదుర్కొన్న సవాళ్లను చూపుతుంది. మేఘనా గుల్జార్ దర్శకత్వం వహించిన ఈ సినిమా చిన్న బడ్జెట్‌తో నిర్మితమైనా భారీ వసూళ్లను రాబట్టింది.

సినిమా

ఆపరేషన్ డేట్ ఫిక్స్



● వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న తొలి హిందీ చిత్రానికి 'ఆపరేషన్ వాలెంటైన్' టైటిల్ ఖరారు చేశారు. అంతేకాదు.. ఈ మూవీని డిసెంబర్ 8 రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో వరుణ్ తేజ్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ పైలట్‌గా, రాడార్ ఆఫీసర్ పాత్రలో మానుషి చిల్లర్ నటిస్తున్నారు. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, రినైసెన్స్ పిక్చర్స్‌పై ఈ చిత్రం రూపొందుతోంది. ''వాస్తవ ఘటనల స్ఫూర్తితో, భారత వైమానిక దళ ధైర్య సాహసాలను చూపే యాక్షన్ మూవీ ఇది. శక్తి ప్రతాప్ సింగ్, అమిర్ ఖాన్, సిద్ధార్థ్ రాజ్ కుమార్ ఈ చిత్రకథ రాశారు. హిందీ, తెలుగులో రూపొందిస్తున్నాం'' అని మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రానికి సహనిర్మాత: నందకుమార్ అబ్బినేని.

హే కృష్ణా... వస్తున్నాం



● నవీన్ పోలిశెట్టి, అనుష్క

మా సినిమాని రిలీజ్ చేయడానికి మంచి తేదీ చెప్పు అంటూ జ్యోతిష్కుడు మహేశ్ దగ్గరికి వెళ్లాడు పోలిశెట్టి. ఓ 70, 80 ఏళ్ల తర్వాత రిలీజ్ చేసుకో అని మహేశ్ అంటే... 'హే కృష్ణా' అంటూ ఉట్టి కొట్టి కృష్ణాష్టమికి రిలీజ్ చేసుకుంటాం అంటాడు పోలిశెట్టి. మిస్ శెట్టిగా అనుష్కా శెట్టి, మిస్టర్ పోలిశెట్టిగా నవీన్ పోలిశెట్టి నటించిన చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'. మహేశ్ బాబు పి. దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్‌పై వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం విడుదల వాయిదా పడుతూ వస్తోంది. ఫైనల్లీ కృష్ణాష్టమి సందర్భంగా సెప్టెంబర్ 7న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించే వీడియోను సోమవారం విడుదల చేశారు. నవీన్ పోలిశెట్టి, మహేశ్‌ల కామెడీతో సాగే ఈ ఫన్నీ వీడియో ద్వారా విడుదల తేదీని ప్రకటించారు.

ధనుష్‌కి జోడీగా...



● రష్మిక

హీరో ధనుష్, డైరెక్టర్ శేఖర్ కమ్ముల కాంబినేషన్‌లో 'డీ 51' (వర్కింగ్ టైటిల్) సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో హీరోయిన్‌గా రష్మికా మందన్నని ఖరారు చేశారు మేకర్స్. శ్రీ నారాయణ్ దాస్ కె. నారంగ్ ఆశీస్సులతో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్‌ఎల్‌పీ (ఏషియన్ గ్రూప్), అమిగోస్ క్రియేషన్స్‌పై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా రష్మిక మందన్న తన ఆనందాన్ని పంచుకుంటూ– ''చాలా ఎగ్జయిటెడ్‌గా ఉంది. ఈ ఆనందాన్ని మీ అందరితో పంచుకోవాలనుకుంటున్నాను'' అంటూ 'డీ 51' ఫొటో ఫ్రేమ్‌ని షేర్ చేశారు. ఈ చిత్రానికి సమర్పణ: సోనాలి నారంగ్.


మరో థ్రిల్లర్‌తో...



● కార్తీక్

'విరూపాక్ష' సినిమాతో ఘన విజయం అందుకున్న డైరెక్టర్ కార్తీక్ దండు తన తర్వాతి చిత్రాన్ని ప్రకటించారు. 'విరూపాక్ష' నిర్మాతలే ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. బి. బాపినీడు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పీ, సుకుమార్ రైటింగ్స్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించనున్న ఈ సినిమా అనౌన్స్‌మెంట్ ప్రీ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''విరూపాక్ష'ను మిస్టిక్ థ్రిల్లర్‌గా రూపొందించిన కార్తీక్ దండు తన తదుపరి చిత్రాన్ని మిథికల్ థ్రిల్లర్ జానర్‌లో తీయబోతున్నాడు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

ఐబీ ఆఫీసర్ రాఘవేంద్ర



● అనుపమ్ ఖేర్

ఐబీ ఆఫీసర్ (ఇంటెలిజెన్స్ బ్యూరో) రాఘవేంద్ర రాజ్‌పుత్‌గా చార్జ్ తీసుకున్నారు అనుపమ్ ఖేర్. టైగర్ నాగేశ్వర రావుని పట్టుకునే మిషన్ విషయంలో రాఘవేంద్ర ఎలాంటి ప్లాన్స్ వేశారు? అనేది 'టైగర్ నాగేశ్వరరావు' చిత్రంలో చూడాల్సిందే. రవితేజ టైటిల్ రోల్‌లో వంశీ దర్శకత్వంలో తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్న చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. ఈ చిత్రంలో అనుపమ్ ఖేర్ చేస్తున్న కీలక పాత్ర అయిన ఐబీ ఆఫీసర్ రాఘవేంద్ర రాజ్‌పుత్ లుక్‌ని విడుదల చేశారు. ''టైగర్ నాగేశ్వరరావు'టీజర్‌ను ఈ నెల 17న విడుదల చేయనున్నాం. అలాగే ఈ మూవీని అక్టోబర్ 20న రిలీజ్ చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో నూపుర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	79	65,402
నిఫ్టీ ▲	6	19,435

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,734	▽	32
డోజోన్స్	35,250	▽	90
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,507	▽	17
డాక్స్	15,904	▲	72
షాంఘై	3,178	▽	11
నికాయ్	32,060	▽	414

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో ముంబై	
బంగారం (24 క్యారట్)	58,874
బంగారం (22 క్యారట్)	58,638
వెండి (కిలో)	69,937

ఐటీసీ డార్క్ ఫ్యాంటసీకి బ్రాండ్ అంబాసిడర్‌గా షారుఖ్



ముంబై: ఐటీసీ సన్‌ఫీస్ట్ డార్క్ ఫ్యాంటసీ బిస్కెట్స్‌కు బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులయ్యారు. దీనికి సంబంధించిన ప్రచార ప్రకటనలను పలు భాషల్లో ఆవిష్కరిస్తున్నట్లు ఐటీసీ ఫుడ్స్ డివిజన్ సీవోవో అలీ హ్యారిస్ షేర్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఫ్యాన్స్ ఉన్న షారుఖ్ ఖాన్‌తో జట్టు కట్టడం బ్రాండ్‌కి మరింత తోడ్పడగలదని ఆయన పేర్కొన్నారు. కంపెనీ తలపెట్టిన హర్ దిల్ కీ ఫ్యాంటసీ ప్రచార కార్యక్రమాలు జీవితాన్ని అసాధారణంగా గడిపేలా స్ఫూర్తినిచ్చే విధంగా ఉన్నాయని షారుఖ్ ఖాన్ తెలిపారు.

టచ్ మొబైల్స్ 'ఫ్రీ ఫోన్' ఆఫర్



హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మొబైల్ రిటైల్ చెయిన్ సంస్థ టచ్ మొబైల్స్ 'ఫ్రీ ఫోన్' ఆఫర్ ప్రకటించింది. 1947 ఆగస్టు నెలలో జన్మించిన వారికి మొబైల్ ఉచితంగా ఇస్తుంది. ఇండిపెండెన్స్ డే రోజున టచ్ స్టోర్‌ను సందర్శించి తమ ఆధార్ కార్డులోని పుట్టిన తేదీని చూపించి ఎలాంటి చార్జీలు లేకుండా ఫ్రీగా మొబైల్ ఫోన్‌ను సొంతం చేసుకోవచ్చు. ఈ ఆఫర్ ఆగస్టు 15 ఒక్క రోజుకే పరిమితం. అలాగే బ్రాండెడ్ ఫోన్లపై 50%, యాక్ససరీస్‌లపై 77% వరకు తగ్గింపు అందిస్తుంది. ఒప్పో అన్ని మోడళ్లపై 15% వరకు క్యాష్ బ్యాక్ పొందవచ్చు. ప్రారంభ ధర రూ.6,999తో 32 అంగుళాల ఎల్‌ఈడీ టీవీని అందిస్తుంది. హెచ్‌డీఎఫ్‌సీ డెబిట్, క్రెడిట్ కార్డులపై 10% తక్షణ క్యాష్ బ్యాక్ పొందవచ్చు. సున్నా వడ్డీతో సులభ వాయిదా పద్ధతిలో అధునాతన మోడల్స్ పొందే అవకాశం ఉంది.

వొడాఐడియాకు భారీ నష్టాలు

క్యూ1లో రూ. 7,840 కోట్లు



న్యూఢిల్లీ: మొబైల్ టెలికం కంపెనీ వొడాఫోన్ ఐడియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్ (క్యూ1)లో నికర నష్టం మరింత పెరిగి రూ. 7,840 కోట్లను తాకింది. అధిక వ్యయాలు ప్రభావం చూపాయి. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 7,296 కోట్ల నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం మాత్రం 2 శాతం స్వల్ప వృద్ధితో రూ. 10,656 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 10,407 కోట్ల టర్నోవర్ ప్రకటించింది. ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) రూ. 128 నుంచి రూ. 139కు మెరుగుపడింది.

ధర 'దడ'!



- జూలైలో టోకు, రిటైల్ ఆహార ధరల సెగ
- రిటైట్ ద్రవ్యోల్బణం 7.44%
- 15 నెలల గరిష్టం
- టోకున 14.25 శాతం పెరిగిన ఆహార బాస్కెట్ ధర

న్యూఢిల్లీ: ఆహార ధరలు ఇటు రిటైల్‌గానూ, అటు టోకుగానూ ఆకాశాన్నంటుతున్నాయి. ప్రభుత్వం జూలైకి సంబంధించి సోమవారం వెలువరించిన గణాంకాలు ఈ విషయాన్ని తెలిపాయి. రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కీలక ద్రవ్య పరపతి విధానానికి ప్రాతిపదిక అయిన వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం జూలైలో ఏకంగా 7.44%గా (2022 ఇదే నెల ధరలతో పోల్చి ధరల పెరుగుదల) నమోదయ్యింది. గడచిన 15 నెలల్లో ఈ స్థాయి రిటైల్ ద్రవ్యోల్బణం ఇదే తొలిసారి. సూచీలో కీలక విభాగాలైన కూరగాయలు, ఇతర ఆహార పదార్థాల ధరలు తీవ్రంగా పెరగడం దీనికి కారణం. ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశాల ప్రకారం, రిటైల్ ద్రవ్యోల్బణం ప్లస్ లేదా మైనస్‌తో 4% వద్ద ఉండాలి. అంటే అప్పర్ బ్యాండ్‌లో 6% అధిగమిస్తే... దానిని ఎకానమీలో డేంజర్ బెల్స్‌గా పరిగణించాల్సి ఉంటుంది. తాజా సమీక్షా నెలలో అంకెలు ఈ స్థాయిని అధిగమించడం గమనార్హం. 2022 జూలైలో రిటైల్ ద్రవ్యోల్బణం 6.71% ఉంటే, ఈ ఏడాది జూన్‌లో 4.87గా నమోదయ్యింది. 2022 ఏప్రిల్‌లో 7.79% రిటైల్ ద్రవ్యోల్బణం నమోదయ్యింది. ఆ స్థాయికి మళ్లీ రిటైల్ ద్రవ్యోల్బణం చేరడం ఆందోళన కలిగిస్తున్న అంశం.

ఫుడ్ బాస్కెట్ 11.51 శాతం అప్

వినియోగ ధరల సూచీలో కీలక విభాగాలు చూస్తే.. ఒక్క ఫుడ్ బాస్కెట్ ద్రవ్యోల్బణం జూలైలో 11.51 %గా నమోదయ్యింది. జూన్‌లో ఈ రేటు 4.55 శాతం. జూలై 2022లో ఈ రేటు 6.69%గా ఉంది. ఒక్క కూరగాయల ధరలు జూలైలో ఏకంగా 37.43% ఎగశాయి. తృణ ధాన్యాలు, సంబంధిత ఉత్పత్తుల ధరలు 13% పెరిగినట్లు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) పేర్కొంది.

టోకు సూచీ మైనస్ 1.36 శాతం...

టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం జూలైలో వరుసగా నాల్గవనెల మైనస్‌లోనే కొనసాగింది. టోకు సూచీ బాస్కెట్ మొత్తంగా చూస్తే జూలై ధరలు అసలు పెరగకపోగా మైనస్ 1.36 శాతంగా నమోదయ్యింది. ఈ ధోరణిని ప్రతి ద్రవ్యోల్బణంగా పరిగణిస్తారు. కాగా, సూచీలో కీలక విభాగమైన ఫుడ్ బాస్కెట్‌లో ధరల స్పీడ్ మాత్రం ఏకంగా 14.25% ఎగసింది (గత ఏడాది జూలై ధరలతో పోల్చి). ఒక్క కూరగాయల ధరలు భారీగా 62.12% ఎగశాయి. తృణ ధాన్యాలు, పప్పు దినుసుల ధరలు వరుసగా 8.31%, 9.59% చొప్పున పెరిగాయి. ఇక మినరల్ ఆయిల్స్, బేసిక్ మెటల్స్, కెమికల్ అండ్ కెమికల్ ప్రొడక్ట్స్, జౌళి ధరలు మాత్రం తగ్గాయని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ పేర్కొంది. ఇదే ధోరణిలో ఆహార ధరలు పెరిగితే, టోకున ధరలు ప్రతి ద్రవ్యోల్బణం నుంచి ద్రవ్యోల్బణం బాటకు మారతాయని కేర్‌ఎడ్జ్ చీఫ్ ఎకనమిస్ట్ రజనీ సిన్హా పేర్కొన్నారు.

ఐటీసీ లాభం జూమ్

క్యూ1లో రూ. 5,180 కోట్లు

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 16% ఎగసి రూ. 5,180 కోట్లను అధిగమించింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 4,462 కోట్లు ఆర్జించింది. నిర్వహణ ఆదాయం మాత్రం రూ. 19,831 కోట్ల నుంచి రూ. 18,639 కోట్లకు తగ్గింది. ఇది 6% క్షీణతకాగా.. మొత్తం వ్యయాలు సైతం 13% తగ్గి రూ. 12,422 కోట్లకు పరిమితమయ్యాయి. ఇక మొత్తం టర్నోవర్ 4% నీరసించి రూ. 19,362 కోట్లుగా నమోదైంది.

విభాగాలవారీగా..: తాజా క్యూ1లో ఐటీసీ.. ఎఫ్ఎంసీజీ విభాగం 13 శాతంపైగా వృద్ధితో రూ. 13,528 కోట్ల ఆదాయాన్ని సాధించింది. దీనిలో సిగరెట్ల బిజినెస్ నుంచి 12 శాతం అధికంగా రూ. 8,356 కోట్లు అందుకుంది. హోటళ్ల బిజినెస్ 8% బలపడి రూ. 625 కోట్ల ఆదాయం అందుకుంది.



'హోటల్' షేర్ల జారీ తీరిదీ..: ఐటీసీ హోటల్స్ పేరుతో ఆతిథ్య రంగ బిజినెస్‌ను ప్రత్యేక కంపెనీగా ఐటీసీ విడదీస్తున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా కంపెనీ బోర్డు 1:10 నిష్పత్తిలో షేర్ల జారీకి ఆమోదముద్ర వేసినట్లు ఐటీసీ పేర్కొంది. వాటాదారులకు ఐటీసీ లోగల ప్రతీ 10 షేర్లకుగాను 1 ఐటీసీ హోటల్ షేరును కేటాయించనుంది. షేర్ల జారీ తదుపరి ఐటీసీ హోటల్స్‌లో 60% వాటాను ఐటీసీ వాటాదారులు పొందనుండగా.. ఐటీసీ 40% వాటాను కలిగి ఉండనుంది. హోటల్ షేర్లు త్వరలో బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో లిస్టకానున్నాయి. ఐటీసీ హోటల్స్‌ను ప్రత్యేక కంపెనీగా విడదీసి స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ చేసేందుకు సుమారు 15 నెలలు పట్టవచ్చని ఐటీసీ తాజాగా అంచనాలు ప్రకటించింది.

ఫలితాల నేపథ్యంలో ఐటీసీ షేరు బీఎస్ఈలో నామమాత్ర లాభంతో రూ. 449 వద్ద ముగిసింది.

రికార్డు కనిష్టానికి రూపాయి

26 పైసలు డౌన్; 83.08 వద్ద క్లోజింగ్

ముంబై: అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు పెరగడం, డాలరు బలపడటం తదితర పరిణామాలతో రూపాయి మారకం విలువ సోమవారం ఆల్ టైమ్ కనిష్టానికి పడిపోయింది. డాలరుతో పోలిస్తే 26 పైసలు క్షీణించి 83.08 వద్ద క్లోజయ్యింది. విదేశీ పెట్టుబడులు తరలిపోతుండటం కూడా దేశీ కరెన్సీపై ప్రతికూల ప్రభావం చూపినట్లు విశ్లేషకులు తెలిపారు. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజీలో 83.04 వద్ద రూపాయి ట్రేడింగ్ ప్రారంభమైంది. 82.94–83.11 గరిష్ట, కనిష్ట స్థాయిల మధ్య తిరుగాడింది. చివరికి క్రితం ముగింపుతో పోలిస్తే 26 పైసలు తగ్గి 83.08 వద్ద క్లోజయ్యింది. గత శుక్రవారం సైతం డాలరుతో పోలిస్తే 16 పైసలు క్షీణించి 82.82 వద్ద రూపాయి క్లోజయ్యింది.



జూలైలో ఎగుమతులు 16% డౌన్

- విలువలో 32.25 బిలియన్ డాలర్లు
- అంతర్జాతీయ మందగమనం నేపథ్యం



న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి పరిస్థితులు భారత్ ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దేశ జూలై ఎగుమతుల్లో (2022 ఇదే నెల గణాంకాలతో పోల్చి) అసలు వృద్ధిలేకపోగా 16 శాతం క్షీణించాయి. విలువలో 32.25 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. కీలక పెట్రోలియం, రత్నాలు–ఆభరణాలు, ఇతర కీలక రంగాల ఎగుమతులు భారీగా పడిపోయాయి. వాణిజ్య పరిశ్రమల శాఖ తాజా గణాంకాలను విడుదల చేసింది.

దిగుమతులూ క్షీణతే..: ఇక దిగుమతుల విలువ కూడా జూలైలో 17% పడిపోయి 52.92 బిలియన్ డాలర్లకు పడిపోయింది. దీనితో ఎగుమతులు–దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం– వాణిజ్యలోటు 20.67 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. 2022 జూలైలో 25.43 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్య లోటు తాజాగా దాదాపు 5 బిలియన్ డాలర్లకు తగ్గిపోవడం గమనార్హం.

నాలుగు నెలల్లోనూ..

ఈ ఏడాది (2022–23) ఏప్రిల్ నుంచి జూలై మధ్య ఎగుమతులు 14.5% పడిపోయి 136.22 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతులు 13.79 శాతం పడిపోయి 213.2 బిలియన్ డాలర్లకు చేరాయి. వెరసి వాణిజ్యలోటు 76.98 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. ఇక ఈ నాలుగు నెలల్లో పసిడి దిగుమతులు 2.7% పెరిగి 13.2 బిలియన్ డాలర్లకు చేరాయి. చమురు దిగుమతుల బిల్లు 23.4% తగ్గి 55 బిలియన్ డాలర్లకు దిగివచ్చింది.

ఎలక్ట్రానిక్ వస్తువుల దిగుమతులపై మరిన్ని ఆంక్షలు ఉండబోవు: కేంద్రం

మరిన్ని ఎలక్ట్రానిక్ వస్తువులపై దిగుమతి ఆంక్షలు విధించే ప్రతిపాదన ప్రస్తుతానికి లేదని వాణిజ్య కార్యదర్శి సునీల్ బర్త్వాల్ తెలిపారు. చైనా వంటి దేశాల నుంచి దిగుమతులను తగ్గించడానికి అలాగే దేశీయ తయారీని పెంచడానికి నవంబర్ 1 నుండి ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, మరికొన్ని ఎలక్ట్రానిక్ పరికరాలపై దిగుమతి ఆంక్షలు విధించాలని ప్రభుత్వం నిర్ణయించడం తెలిసిందే. ఎలక్ట్రానిక్స్, మొబైల్ తయారీకి ప్రొడక్షన్–లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) పథకం వర్తిస్తుందని మంత్రి చెప్పారు.

నష్టాల్లోంచి లాభాల్లోకి...

- ఆదుకున్న ఆఖరి గంట కొనుగోళ్లు
- ఇంట్రాడే కనిష్టాల నుంచి రికవరీ
- రాణించిన రిలయన్స్, ఇన్ఫోసిస్ షేర్లు
- స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నేడు మార్కెట్లకు సెలవు



ముంబై: ఆఖరి గంటలో అధిక వెయిటేజీ రిలయన్స్, ఇన్ఫోసిస్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు సోమవారం ఇంట్రాడే నష్టాలను భర్తీ చేసుకొని స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. యూరప్ మార్కెట్ల లాభాల ప్రారంభం నుంచీ సానుకూల సంకేతాలు అందిపుచ్చుకున్నాయి. ట్రేడింగ్‌లో 501 పాయింట్లను కోల్పోయిన సెన్సెక్స్ చివరికి 79 పాయింట్ల లాభంతో 65,402 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 170 పాయింట్ల పతనం నుంచి తేరుకొని ఆరు పాయింట్ల స్వల్ప లాభంతో 19,435 వద్ద ముగిసింది. మెటల్, బ్యాంక్స్, ఫైనాన్స్, ఇంధన, ఫార్మా, కన్జూమర్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎక్స్ఛేంజీలకు సెలవు ప్రకటించారు.

- అదానీ పోర్ట్స్ ఆడిటర్ బాధ్యతల నుంచి డెలాయిట్ నిష్క్రమణతో అదానీ గ్రూప్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అత్యధికంగా అంబుజా సిమెంట్స్ షేరు 3.50% పతనమైంది. ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్ ప్రైజెస్ షేరు 3.26% నష్టపోయింది. అదానీ ట్రాన్స్‌మిషన్స్ 2.50%, ఏసీసీ, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ విల్మార్, అదానీ టోటల్ గ్యాస్ షేర్లు 2% వరకు నష్టపోయాయి. అదానీ పోర్ట్స్ 1.50%, ఎన్‌డీటీవీ 1.30%, అదానీ పవర్ ఒక శాతం పతనయ్యాయి.
- రూ.880 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో గత వారం ఐపీఓకు వచ్చిన టీవీఎస్ సప్లై చివరి రోజు నాటికి 2.78 రెట్ల సబ్‌స్క్రిప్షన్ సాధించింది. ఇష్యూలో భాగంగా కంపెనీ 2.51 కోట్ల ఈక్విటీ షేర్లను జారీ చేయగా మొత్తం 6.98 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.

విద్య, ఉద్యోగ సమాచారం

జామ్-2024

దేశంలోని ఐఐటీ(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)ల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎమ్మెస్సీ, ఎమ్మెస్సీ–పీహెచ్‌డీ(డ్యూయల్ డిగ్రీ) కోర్సుల్లో ప్రవేశాలకు జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్(జామ్–2024) పరీక్షను నిర్వహిస్తారు. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 3000

» **తెలుగు రాష్ట్రాల ఐఐటీల్లో సీట్ల వివరాలు:** ఐఐటీ హైదరాబాద్‌లో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులలో 105 సీట్లను జామ్ ర్యాంకు ఆధారంగా కేటాయిస్తారు. ఐఐటీ తిరుపతిలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథ్స్–స్టాటిస్టిక్స్‌లో మొత్తం 60 సీట్లున్నాయి.

» **అర్హత:** నిర్దేశిత విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులు. ప్రస్తుతం ఆఖరి సంవత్సరం చదువుతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

» **సబ్జెక్టులు:** ఏడు సబ్జెక్టుల్లో ఈ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. అవి బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, జియాలజీ, మ్యాథమేటిక్స్, మ్యాథమేటికల్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్. వీటిలో ప్రతిభ చూపిన వారు ఏడు సబ్జెక్టులకు చెందిన పలు స్పెషలైజేషన్లతో కోర్సులు ఎంచుకోవచ్చు. పరీక్ష కోసం అభ్యర్థులు ఒకటి లేదా గరిష్టంగా రెండు సబ్జెక్టులు ఎంచుకోవచ్చు. సెషన్–1లో ఒకటి, సెషన్–2లో మరొక సబ్జెక్టులో పరీక్ష రాసుకోవచ్చు. సెషన్–1లో కెమిస్ట్రీ, జియాలజీ, మ్యాథమేటిక్స్ సబ్జెక్టుల్లో పరీక్ష నిర్వహిస్తారు. రెండో సెషన్‌లో బయోటెక్నాలజీ, ఎకనామిక్స్, మ్యాథమేటికల్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్ సబ్జెక్టులు ఉంటాయి.

» **పరీక్ష విధానం:** ఆన్‌లైన్ విధానంలో పరీక్ష జరుగుతుంది. పరీక్ష వ్యవధి 3 గంటలు. ఇంగ్లిష్ మాధ్యమంలో ప్రశ్నపత్రం ఉంటుంది. ఏ సబ్జెక్టు ప్రశ్నపత్రంలోనైనా మొత్తం ఆబ్జెక్టివ్ 60 ప్రశ్నలు–వంద మార్కులు. మూడు విభాగాల్లో(మల్టిపుల్ ఛాయిస్, మల్టిపుల్ సెలెక్ట్, న్యూమరికల్) ప్రశ్నలు అడుగుతారు. వీటికి ఎ,బి, సి సెక్షన్లుగా విభజించారు.

» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: ఆంధ్రప్రదేశ్:** విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, తిరుపతి. **తెలంగాణ:** హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

» **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభతేది:** 05.09.2023.

» **దరఖాస్తులకు గడువుతేది:** 13.10.2023.

» **పరీక్ష తేది:** 11.02.2024.

» **వెబ్‌సైట్:** https://jam.iitm.ac.in

ఏకలవ్య స్కూల్స్.. గురువులకు ఆహ్వానం

» టీచింగ్,నాన్–టీచింగ్ విభాగాల్లో 6,329 కొలువులు

» టీజీటీ హోదాలో మొత్తం 5,660 పోస్టులు

» కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నోటిఫికేషన్

» రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా నియామకాలు



ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ కొలువు కోరుకునే వారికి చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది! జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని..ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో.. టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నియామక ప్రక్రియ ద్వారా టీచింగ్, నాన్–టీచింగ్ విభాగాల్లో మొత్తం 6,329 పోస్టులను భర్తీ చేయనున్నారు. టీచింగ్ విభాగంలో 5,660 టీజీటీ పోస్టులున్నాయి. ఈ నేపథ్యంలో.. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రత్యేకత, భర్తీ చేయనున్న పోస్టుల వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు..

కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన విద్యా సంస్థలు.. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్. ప్రస్తుతం జాతీయ స్థాయిలో మొత్తం 740 పాఠశాలలు ఉండగా.. తెలుగు రాష్ట్రాలైన ఏపీలో 28, తెలంగాణలో 23 స్కూల్స్ ఉన్నాయి. వీటిలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు.. పూర్తిగా గురుకుల విధానంలో విద్యాబోధన సాగుతోంది.

మొత్తం 6,329 పోస్టులు

తాజా నియామక ప్రక్రియ ద్వారా టీచింగ్, నాన్–టీచింగ్ విభాగాల్లో మొత్తం 6,329 పోస్టులను భర్తీ చేయనున్నారు. టీచింగ్ విభాగంలో ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ) 5,660 పోస్టులు, నాన్ టీచింగ్ పోస్టుల విభాగంలో 669 హాస్టల్ వార్డెన్ పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపడతారు.

వేతనాలు

- టీజీటీ(తృతీయ భాష) వేతన శ్రేణి–రూ.44,900–రూ.1,42,400.
- టీజీటీ(ఇతర విభాగాలు) వేతన శ్రేణి–రూ.35,400–రూ.1,12,400.
- హాస్టల్ వార్డెన్స్ వేతన శ్రేణి రూ.29,200–రూ.92,300.

అర్హతలు

- అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకుంటున్న సబ్జెక్ట్‌తో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు సంబంధిత సబ్జెక్ట్ మెథడాలజీలో బీఈడీ పాసై ఉండాలి.
- థర్డ్ లాంగ్వేజ్ పోస్టుల అభ్యర్థులు మూడేళ్ల బ్యాచిలర్ డిగ్రీలో సదరు భాషను ఎలక్టివ్ సబ్జెక్ట్‌గా మూడేళ్ల పాటు చదివుండాలి. –సీటెట్‌లో ఉత్తీర్ణత సాధించాలి.
- ఎన్‌సీటీఈ నిర్వహించే నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సు పూర్తి చేసుకున్న వారికి బీఈడీ అర్హత నిబంధన అవసరం ఉండదు.
- మ్యూజిక్ టీచర్ పోస్టుల అభ్యర్థులు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మ్యూజిక్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- **ఆర్ట్ టీచర్:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఫైన్ ఆర్ట్స్/క్రాఫ్ట్‌లో ఉత్తీర్ణత లేదా రీజనల్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ నుంచి ఫైన్ ఆర్ట్స్‌లో బీఈడీ పాసవ్వాలి.
- **టీజీటీ–పీఈటీ:** బీపీఈడీ ఉత్తీర్ణత ఉండాలి.
- **లైబ్రేరియన్:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ ఉత్తీర్ణులవ్వాలి. లేదా బ్యాచిలర్ డిగ్రీ అర్హతగా లైబ్రరీ సైన్స్‌లో ఏడాది వ్యవధిలోని డిప్లొమా ఉత్తీర్ణత సాధించాలి.
- **హాస్టల్ వార్డెన్:** బ్యాచిలర్ డిగ్రీ లేదా ఎన్‌సీటీఈ నిర్వహించే నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సు ఉత్తీర్ణులవ్వాలి.

వయసు

- అన్ని పోస్టులకు 18.08.2023 నాటికి వయసు 18–35 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎంపిక ప్రక్రియ

ఏకలవ్య గురుకుల పాఠశాలల్లో పోస్టుల భర్తీకి జాతీయ స్థాయిలో ఈఎంఆర్ఎస్ స్టాఫ్ సెలక్షన్ ఎగ్జామ్(ఈఎస్ఈఈ)ను నిర్వహించనున్నారు. ఈ పరీక్షలో మెరిట్ ఆధారంగా తుది జాబితా రూపొందించి నియామకాలు ఖరారు చేస్తారు.

120 మార్కులకు టీజీటీ పరీక్ష

టీజీటీ పోస్టులకు సంబంధించి రాత పరీక్షను నాలుగు విభాగాలుగా మొత్తం 120 మార్కులకు నిర్వహిస్తారు. పార్ట్–1 జనరల్ అవేర్‌నెస్ 10 ప్రశ్నలు–10 మార్కులు; పార్ట్–2 రీజనింగ్ ఎబిలిటీ 10 ప్రశ్నలు–10 మార్కులు; పార్ట్–3 ఐసీటీ నాలెడ్జ్ 10 ప్రశ్నలు–10 మార్కులు; పార్ట్–4 టీచింగ్ ఆప్టిట్యూడ్ 10 ప్రశ్నలు–10 మార్కులు; పార్ట్–5 సంబంధిత సబ్జెక్ట్ 80 ప్రశ్నలు–80మార్కులు.. ఇలా మొత్తం 120 ప్రశ్నలు–120 మార్కులకు పరీక్ష జరుగుతుంది. టీజీటీ పరీక్ష వ్యవధి మూడు గంటలు.

హాస్టల్ వార్డెన్ రాత పరీక్ష

ఏకలవ్య గురుకుల పాఠశాలల్లో భర్తీ చేయనున్న హాస్టల్ వార్డెన్ పోస్టులకు ప్రత్యేక రాత పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్ష ఆరు విభాగాల్లో 120 మార్కులకు ఉంటుంది. పార్ట్–1 జనరల్ అవేర్‌నెస్ 10 ప్రశ్నలు–10 మార్కులు; పార్ట్–2 రీజనింగ్ ఎబిలిటీ 20 ప్రశ్నలు–20 మార్కులు; పార్ట్–3 ఐసీటీ నాలెడ్జ్ 20 ప్రశ్నలు–20 మార్కులు; పార్ట్–4 పోక్సో, బాలల భద్రతకు సంబంధించిన చట్టాలు 10 ప్రశ్నలు–10 మార్కులు; పార్ట్–5 అడ్మినిస్ట్రేటివ్ ఆప్టిట్యూడ్ 30 ప్రశ్నలు–30 మార్కులు; పార్ట్–6 లాంగ్వేజ్ కాంపిటెన్సీ(హిందీ, ఇంగ్లిష్, ప్రాంతీయ భాష) 30 ప్రశ్నలు–30 మార్కులు.. ఇలా మొత్తం 120 ప్రశ్నలు–120 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు.

లాంగ్వేజ్ కాంపిటెన్సీ టెస్ట్

- టీజీటీ, హాస్టల్ వార్డెన్ పోస్టులకు అయిదు విభాగాల్లో పరీక్షతోపాటు.. ప్రత్యేకంగా లాంగ్వేజ్ కాంపిటెన్సీ టెస్ట్‌ను 30 మార్కులకు నిర్వహిస్తారు. అభ్యర్థులు తాము పరీక్షకు హాజరవుతున్న మాధ్యమానికి సంబంధించిన భాషలో ఈ టెస్ట్ ఉంటుంది. ఇందులో జనరల్ ఇంగ్లిష్ నుంచి 10 ప్రశ్నలు, హిందీ నుంచి 10 ప్రశ్నలు, ఎంచుకున్న లాంగ్వేజ్ నుంచి 10 ప్రశ్నలు చొప్పున అడుగుతారు.
- లాంగ్వేజ్ కాంపిటెన్సీ టెస్ట్‌లో భాగంగా మొత్తం 18 భాషల్లో ఏదో ఒకదాన్ని ఎంచుకునే అవకాశముంది. బెంగాలీ, డోంగ్రి, గారో, గుజరాతీ, హిందీ, కన్నడ, కశ్మీరీ, ఖాసీ, మలయాళం, మణిపురి, మరాఠి, మిజో, నేపాలి, ఒడియా, సంథాలి, తెలుగు, ఉర్దూ భాషల్లో ఏదో ఒక భాషను రీజనల్ లాంగ్వేజ్‌గా ఎంచుకోవచ్చు.
- టీజీటీ పోస్టులకు సంబంధించి లాంగ్వేజ్ కాంపిటెన్సీ టెస్ట్‌ను కేవలం అర్హత విభాగంగానే పేర్కొన్నారు. ఇందులో ఇంగ్లిష్, హిందీ, రీజనల్ లాంగ్వేజ్ మూడు భాషల్లోనూ 40 శాతం మార్కులు చొప్పున పొందాల్సి ఉంటుంది. అప్పుడే మిగతా విభాగాలను మూల్యాంకన చేస్తారు.

నెగెటివ్ మార్కులు

- టీజీటీతోపాటు హాస్టల్ వార్డెన్.. ఈ రెండు పరీక్షలు ఓఎంఆర్ బేస్డ్ టెస్ట్‌గా పెన్–పేపర్ విధానంలో ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. ప్రతి తప్పు సమాధానానికి 1/4వ వంతు మార్కు తగ్గిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 18.08.2023
- **ఈఎస్ఈఈ పరీక్ష తేదీ:** నవంబర్‌లో నిర్వహించే అవకాశం ఉంది.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** విజయవాడ, హైదరాబాద్.
- **వెబ్‌సైట్:** emrs.tribal.gov.in

రాత పరీక్షలో రాణించేలా

జనరల్ అవేర్‌నెస్

ఈ విభాగంలో మంచి మార్కుల కోసం స్టాక్ జీకేతో పాటు కరెంట్ అఫైర్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ముఖ్యంగా ఇటీవల కాలంలో జరిగిన జాతీయ–అంతర్జాతీయ ఒప్పందాలు, కేంద్ర ప్రభుత్వ తాజా సంస్కరణలు/విధానాలు వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

రీజనింగ్ ఎబిలిటీ

పజిల్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్, డేటా సఫిషియన్సీ, వెర్బల్ రీజనింగ్, బ్లడ్ రిలేషన్స్, సీక్వెన్సెస్, సిరీస్, డైరెక్షన్స్, అసెర్షన్ అండ్ రీజన్, వెన్ డయాగ్రమ్‌లను ప్రాక్టీస్ చేయాలి.

టీచింగ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగం కోసం టీచింగ్ విధానాలు, భావనలు,లక్ష్యాలు, ప్రాథమిక అవసరాలు, అభ్యాసకు లక్షణాలు, టీచింగ్‌ను ప్రభావితం చేసే అంశాలు, టీచింగ్ మెథడ్స్, టీచింగ్ ఎయిడ్స్, మూల్యాంకన విధానాలపై అవగాహన పెంచుకోవాలి.

ఐసీటీ నాలెడ్జ్

ఈ విభాగం కోసం కంప్యూటర్ సిస్టమ్ ప్రాథమిక భావనలు, ఆపరేటింగ్ సిస్టమ్స్ బేసిక్స్, ఎంఎస్ ఆఫీస్, కీ–బోర్డ్ షార్ట్ కట్స్, కంప్యూటర్‌కు సంబంధించిన పదజాలం, అబ్రివేషన్లు, కంప్యూటర్ నెటవర్క్స్, సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ సంబంధిత అంశాలపై దృష్టి పెట్టాలి.

సబ్జెక్ట్ మెథడాలజీ

పార్ట్–5గా ఉండే డొమైన్ నాలెడ్జ్‌లో.. సబ్జెక్ట్ మెథడాలజీ నుంచి 65 ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో తాము చదివిన సబ్జెక్ట్‌లపై అవగాహన పెంచుకోవాలి. ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించి భావనలు, సిద్ధాంతాలు, నిబంధనలను విశ్లేషిస్తూ అధ్యయనం చేస్తే..ఏ కోణంలో ప్రశ్న అడిగినా సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది.

పెడగాజీపైనా

పార్ట్–5లోనే యాక్టివిటీ బేస్డ్ పెడగాజీ, కేస్ ఆధారిత ప్రశ్నలు 10 అడుగుతారు. అభ్యర్థులు.. విద్యా దృక్పథాలు, పెడగాజీ, చైల్డ్ డెవలప్‌మెంట్, శిశు వికాసం వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. పెడగాజీకి సంబంధించి సహిత విద్య, శిశువు విద్యా ప్రణాళిక, బోధన పద్ధతులు, మూల్యాంకనం–నాయకత్వం–గైడెన్స్–కౌన్సెలింగ్ గురించి అధ్యయనం చేయాలి. ఎడ్యుకేషన్‌కు సంబంధించిన చట్టాలపై పూర్తి అవగాహన పొందాలి. ముఖ్యంగా నూతన విద్యా విధానం–2020పై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

లైబ్రేరియన్ రాత పరీక్ష

లైబ్రేరియన్ పోస్టులకు నిర్వహించే రాత పరీక్షలో రాణించేందుకు.. లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ ఫౌండేషన్, నాలెడ్జ్ ఆర్గనైజేషన్, ఇన్ఫర్మేషన్ ప్రాసెసింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బేసిక్స్, మేనేజ్‌మెంట్ ఆఫ్ లైబ్రరీస్ అండ్ ఇన్ఫర్మేషన్ సెంటర్స్/ ఇన్‌స్టిట్యూషన్స్, ఇన్ఫర్మేషన్ సోర్సెస్, సర్వీసెస్, లైబ్రరీ యూజర్స్‌కు సంబంధించి అన్ని అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

దేశ విభజన సమయం
ఇంత భయానకమా!
సందర్శకులను ఆలోచింపచేసిన ఫొటో ఎగ్జిబిషన్లు


వనపర్తి తపాలా కార్యాలయంలో ప్రదర్శన తిలకిస్తున్న సందర్శకులు

సాక్షి, హైదరాబాద్: దేశ విభజన సమయంలో నెలకొన్న భయానక పరిస్థితులు, నాటి ప్రజల పోరాట పటిమ, త్యాగాలను ప్రతిబింబించే ఫొటో ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. విభజన సమయ భయాందోళన పరిస్థితులను నెమరేసుకుంటూ ఆగస్టు 14న ప్రత్యేకంగా ఫొటో ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేసి నాటి వీరుల త్యాగాలు స్మరించుకోవాలన్న ప్రధాని పిలుపు మేరకు దక్షిణ మధ్య రైల్వే, తపాలా శాఖలు వాటి కార్యాలయాల్లో ఫొటో ప్రదర్శనలు ఏర్పాటు చేశాయి. సికింద్రాబాద్, కాచిగూడ, బేగంపేట, ఖమ్మం, కాజీపేట, వరంగల్, నిజామాబాద్, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి తదితర స్టేషన్లలో సోమవారం ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. మరోవైపు హైదరాబాద్ ప్రధాన జనరల్ పోస్టాఫీసులో సహా ఆదిలాబాద్, ఆర్మూరు, హుజురాబాద్, జనగామ, కామారెడ్డి, కొత్తగూడెం, మహబూబాబాద్, నిజామాబాద్, వరంగల్, వనపర్తి హెడ్ పోస్టాఫీసుల్లో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. 1947 మతపరపమైన అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. విభజన సమయంలో నిరాశ్రయులైన వారు అనుభవించిన బాధలు, ఆ సమయంలో వారి పక్షాన పోరాడిన యోధుల గురించి తెలిపే చిత్రాలను ప్రదర్శించారు.



పోస్టాఫీసుల ద్వారా 3.9 లక్షల జెండాల విక్రయం

సాక్షి, హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో పోస్టాఫీసుల్లో జాతీయ పతాకాల విక్రయ కేంద్రాలకు మంచి స్పందన వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా పోస్టాఫీసుల్లో 3.90 లక్షల జాతీయ పతాకాలను విక్రయించినట్లు పోస్టల్ అధికారులు తెలిపారు. రూ.25 చొప్పున పతాకానికి ధర నిర్ణయించి స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా గతేడాది హర్ ఘర్ తిరంగా పేరుతో కేంద్రప్రభుత్వం జాతీయ పతాకాలను ప్రజలకు చేరువగా అందుబాటులో ఉంచిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పోస్టాఫీసుల్లో కూడా జాతీయ పతాకాలు విక్రయించారు. గతేడాది 1.71 లక్షల జాతీయ పతాకాలను పోస్టాఫీసుల నుంచి ప్రజలు కొనుగోలు చేశారు. దీంతో ఈసారి 5.8 లక్షల జెండాలను సిద్ధం చేశారు. దీనికి మంచి స్పందన లభించింది. 3.87లక్షల జెండాలను జనం నేరుగా పోస్టాఫీసులకు వచ్చి కొనుగోలు చేయగా, మరో 3 వేల జెండాలను ఆన్‌లైన్ ద్వారా కొన్నారు.